

ఆర్టీసీ ఆదాయానికి రూ.2.35 కోట్ల మేర గండి

- మూడు రోజుల్లో 490 బస్సులు రద్దు
- నివేదిక సిద్ధం చేసిన ఆర్ఎం



ద్వారకా బస్‌స్టేషన్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ కారణంగా ఆర్టీసీ విశాఖ రీజియన్ ఆదాయానికి రూ.2.35 కోట్ల మేర గండి పడింది. తుఫాన్ కారణంగా మూడు రోజులపాటు తెరిపి లేకుండా వర్షం కురవడంతో అధికారులు అనేక రూట్లలో బస్సులు రద్దు చేశారు. కొన్ని రూట్లలో అతి కష్టం మీద నడిపినా ప్రయాణికులు లేరు. దాంతో ఆదాయం భారీగా పడిపోయింది. విశాఖ రీజియన్‌లోని ఏడు డిపోల్లో 740 బస్సులు ఉన్నాయి. తుఫాన్ కారణంగా సోమవారం 60 బస్సులు రద్దు చేశారు. మిగిలిన 680 బస్సులను ఆపరేట్ చేసినా, ఆక్యుపెన్సీ రేషియో సగటున 60 శాతం మాత్రమే నమోదయ్యింది. మంగళవారం 200 బస్సులు రద్దు చేసి 540 బస్సులు ఆపరేట్ చేశారు. ఆక్యుపెన్సీ రేషియో 50 శాతం నమోదయ్యింది. బుధవారం ఏకంగా 230 బస్సులను రద్దు చేసి 510 బస్సులను ఆపరేట్ చేశారు. ఆక్యుపెన్సీ రేషియో 50 శాతం నమోదయ్యింది. ఈ మూడు రోజులు ఉదయం 6.00 నుంచి రాత్రి 9.00 గంటల మధ్య మాత్రమే బస్సులు నడిపారు.

ఆదాయానికి గండి

తుఫాన్‌కు ముందురోజు వరకు విశాఖ రీజియన్‌కు రోజువారీ రూ.1.3 కోట్ల ఆదాయం వచ్చేది. స్త్రీశక్తి పథకం అమలు తరువాత సగటు ఆక్యుపెన్సీ రేషియో 90శాతం నుంచి 95 శాతం వరకు నమోదవుతోంది. తుఫాన్ నేపథ్యంలో సోమవారం రూ.60 లక్షలు, మంగళవారం రూ.50 లక్షలు, బుధవారం రూ.45 లక్షలు మాత్రమే ఆదాయం వచ్చింది. సాధారణంగా ఈ మూడు రోజులకు రూ.3.9 కోట్లు రావలసి ఉండగా రూ.1.55 కోట్లు మాత్రమే వచ్చింది. దీంతో మూడు రోజుల్లో రూ.2.35 కోట్లు ఆదాయానికి గండిపడింది. ఇందుకు సంబంధించి నివేదికను తయారుచేశారు. దీనిని రీజనల్ మేనేజర్ బి.అప్పలనాయుడు శుక్రవారం ప్రధాన కార్యాలయానికి పంపనున్నారు.

జీవీఎంసీలో కొత్త జోన్‌లకు సిబ్బంది

- త్వరలోనే కార్యకలాపాలు



విశాఖపట్నం, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ పరిధిలో కొత్తగా ఏర్పాటు చేసిన ఉత్తర, అగనంపూడి జోన్‌లకు సిబ్బందిని కేటాయిస్తూ కమిషనర్ కేతన్ గార్గ్ గురువారం ఉత్తర్వులు జారీచేశారు. ప్రస్తుతం ఎనిమిది జోన్‌లు ఉండగా, వాటిని పది జోన్‌లకు పెంచాలని కమిషనర్ నిర్ణయించారు. ఈ మేరకు ప్రతిపాదనలు తయారుచేసి కౌన్సిల్‌లో ఆమోదం పొందిన తర్వాత రాష్ట్ర ప్రభుత్వానికి పంపించారు. ప్రభుత్వం జీవీఎంసీ పరిధిలోని ఎనిమిది జోన్‌లను పదికి పెంచుతూ గెజిట్ జారీచేసిన విషయం తెలిసిందే. జీవీఎంసీ పరిధిలో ఎనిమిది నియోజకవర్గాలు ఉండగా ఒక్కో నియోజకవర్గానికి ఒక్కో జోన్ చొప్పున నియోజకవర్గాల పేర్లతోనే పునర్విభజన చేస్తున్నారు. అయితే భీమిలి, పెందుర్తి నియోజకవర్గాల పరిధిలోని వార్డులు దూరంగా ఉండడంతో రెండేసి జోన్‌లను ఏర్పాటుచేస్తారు. భీమిలి నియోజకవర్గాన్ని భీమిలి జోన్‌తో పాటు మధురవాడ జోన్‌గా విభజించారు. తూర్పు నియోజకవర్గానికి తూర్పు జోన్ కింద ప్రస్తుతం ఉన్న జోన్-3 కార్యాలయాన్ని వినియోగించనున్నారు. దక్షిణ నియోజకవర్గానికి ప్రస్తుతం ఉన్న జోన్-4 కార్యాలయాన్ని, పశ్చిమ నియోజకవర్గానికి జోన్-5 (జ్ఞానాపురం) కార్యాలయం, గాజువాక నియోజకవర్గానికి జోన్-6 (గాజువాక) కార్యాలయం, అనకాపల్లి జోన్‌కు జోన్-7 (అనకాపల్లి) కార్యాలయాన్ని కేటాయించారు. కొత్తగా ప్రారంభించే ఉత్తర నియోజకవర్గం జోన్‌కు మురళీనగర్ లేదా మాధవధారలో కొత్తభవనంలో కార్యాలయం ఏర్పాటుచేయనున్నారు. పెందుర్తి నియోజకవర్గాన్ని ... మిగతా 6వ పేజీలో

రహదారులు ఛిద్రం

తుఫాన్ ప్రభావంతో కురిసిన భారీ వర్షాలకు దెబ్బతిన్న రోడ్లు

- మద్దిలపాలెం నుంచి హనుమంతవాక వరకూ రోడ్డుపై లేచిపోయిన తారు
- జగదాంబ జంక్షన్, రైల్వేస్టేషన్ పరిసరాల రోడ్లు మరింత అధ్వానం
- జీవీఎంసీ పరిధిలో పది కిలోమీటర్ల మేర రహదారులు దెబ్బతిన్నట్టు అధికారుల గుర్తింపు
- మరమ్మతుకు రూ.7.12 కోట్లు ఖర్చు అవుతుందని అంచనా



గోతులమయమైన భీమ్‌నగర్ రోడ్డు



నొవాటెల్ హోటల్ ఎదుట రోడ్డు దుస్థితి



దెబ్బతిన్న వెంకోజీపాలెం-హనుమంతవాక రహదారి

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

మొంథా తుఫాన్ ప్రభావంతో కురిసిన వర్షాలకు నగరంలో రహదారులు దెబ్బతిన్నాయి. చాలాచోట్ల పెద్ద పెద్ద గుంతలు ఏర్పడ్డాయి. జాతీయ రహదారిపై ఇటీవల వేసిన లేయర్ అక్కడక్కడా లేచిపోయింది. పాడైపోయిన రహదారులపై రాకపోకలు సాగించడానికి వాహనచోదకులకు ఇబ్బంది పడుతున్నారు.

తుఫాన్ నగరంపై తీవ్ర ప్రభావం చూపించింది. నాలుగైదు రోజులపాటు వర్షాలు కురవడంతో పలుచోట్ల రహదారులపై నీరు నిలిచిపోయింది. డ్రైనేజీల సామర్థ్యానికి మించి వరద నీరు పోటెత్తడంతో లోతట్టు ప్రాంతాల్లోని రోడ్లు చెరువులను తలపించాయి. రోజుల తరబడి నీరు నిల్వ ఉండడంతో రోడ్లు బాగా నానిపోయాయి. తారు,పిక్క మధ్య ఉన్న గ్యాప్‌ల ద్వారా నీరు కిందకు చేరింది. అదే సమయంలో వాహనాల రాకపోకలు కొనసాగడంతో తారు పిక్క పైకిలేచిపోయింది. జాతీయ రహదారిపై హనుమంతవాక జంక్షన్ నుంచి మద్దిలపాలెం వరకూ ఇటీవల కొత్తగా వేసిన లేయర్ కూడా పలుచోట్ల కొట్టుకుపోయింది. ద్వారకా బస్ కాంప్లెక్స్ వద్ద రోడ్డుపై భారీ గుంతలు ఏర్పడ్డాయి. అలాగే ఎల్ఐసీ బిల్డింగ్ నుంచి అంబేడ్కర్ సర్కిల్ మీదుగా రైల్వే స్టేషన్‌కు వెళ్లే రోడ్డు, జగదాంబ జంక్షన్ నుంచి సీపీ కార్యాలయం మీదుగా డాల్ఫిన్ జంక్షన్‌కు వెళ్లే రోడ్లలో అడుగుకొకగొయ్యి ఏర్పడింది. జీవీఎంసీ పరిధిలో మొంథా తుఫాన్ వల్ల దాదాపు పది కిలోమీటర్లు పొడవున రహదారులు దెబ్బతిన్నట్టు అధికారులు గుర్తించారు. వాటి మరమ్మతుకు సుమారు రూ.7.12 కోట్లు ఖర్చవుతుందని అంచనా వేస్తూ ప్రభుత్వానికి నివేదిక పంపించారు.

జడ్పీకి రూ.4.37 కోట్ల నష్టం

- పునరావాస కేంద్రాల్లో ఉన్న 494 మందికి ఆర్థిక సాయం
- మత్స్యకారులకు నేటి నుంచి సరుకులు పంపిణీ

విశాఖపట్నం, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): తుఫాన్ ప్రభావంతో కురిసిన భారీవర్షాలకు జిల్లా పరిషత్ పరిధిలో భవనాలకు రూ.4.37 కోట్ల నష్టం వాటిల్లింది. మూడు జిల్లాల పరిధిలో 118 పాఠశాల భవనాలు దెబ్బతినడంతో రూ.2.16 కోట్లు నష్టం సంభవించింది. ఇంకా ఏడు మండల పరిషత్ అభివృద్ధి అధికారి కార్యాలయాలు దెబ్బతినడంతో రూ.26 లక్షలు, 88 అంగన్‌వాడీ భవనాలకు రూ.1.76 కోట్లు, మూడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల భవనాలకు రూ.5.54 లక్షలు, నాలుగు సామాజిక భవనాలు దెబ్బతినడంతో రూ.10.5 లక్షలు నష్టం వాటిల్లినట్టు అధికారులు అంచనా వేశారని జడ్పీ సీఈవో పి.నారాయణమూర్తి తెలిపారు. కాగా విశాఖ జిల్లాలో తుఫాన్ నష్టంపై అంచనా కోసం ఆయా శాఖల అధికారులు, సిబ్బంది క్షేత్రస్థాయిలో పర్యటిస్తున్నారు. శుక్రవారానికి నష్టంపై నివేదిక వచ్చే అవకాశం ఉంది. కాగా జిల్లాలోని ... మిగతా 6వ పేజీలో

ఏపీఈపీడీసీఎల్‌కు రూ.10.47 కోట్ల నష్టం

విశాఖపట్నం, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): తుఫాన్ ప్రభావం కారణంగా ఏపీఈపీడీసీఎల్ పరిధిలోని 11 సర్కిళ్లలో రూ.10.47 కోట్ల నష్టం సంభవించినట్టు సీఎండీ పృథ్వీతేజ్ ఇమ్మడి తెలిపారు. ఆయన విద్యుత్ సరఫరా పునరుద్ధరణ పనులను స్వయంగా పర్యవేక్షిస్తున్నారు. ఈ సందర్భంగా పృథ్వీతేజ్ మాట్లాడుతూ విద్యుత్ స్తంభాలు, జనరేటర్లు, పోల్ డ్రిల్లింగ్ యంత్రాలు, ట్రాన్స్‌ఫార్మర్లు వంటి సామగ్రిని ముందుగానే సిద్ధం చేసుకోవడం, సిబ్బందిని అందుబాటులో ఉంచుకోవడంతో పునరుద్ధరణ పనులు వేగంగా సాగాయన్నారు.

మహిళల్లో పెరుగుతున్న బీపీ, షుగర్

స్వస్థ నారీ సశక్త్ పరివార్ అభియాన్ వైద్య శిబిరాల్లో గుర్తింపు

- మూడొంతుల మందిలో సమస్యలు
- 13,902 మందిలో 10,281 మందికి హైబీపీ
- 14,700 మందిలో 10,018 మందికి షుగర్



విశాఖపట్నం, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): అనారోగ్యం బారినపడుతున్న మహిళల సంఖ్య పెరుగుతోంది. పనిభారం, ఆర్థిక, ఇతర సమస్యల కారణంగా మహిళలు తీవ్ర ఒత్తిడికి గురై అనారోగ్యం పాలవుతున్నారు. తాజాగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్వహించిన స్వస్థ నారీ సశక్త్ పరివార్ అభియాన్‌లో భాగంగా ప్రత్యేకంగా నిర్వహించిన వైద్య శిబిరాల్లో ఈ విషయాన్ని గుర్తించారు. వైద్య శిబిరాలకు వచ్చిన మహిళల్లో ఎక్కువ మంది బీపీ, షుగర్ వంటి సమస్యలతో బాధపడుతున్నట్టు తేలింది.

గత నెల 17 నుంచి ఈ నెల రెండో తేదీ వరకు జిల్లాలోని 66 అర్బన్ హెల్త్ సెంటర్లు, ఎనిమిది ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, విలేజ్ హెల్త్ క్లినిక్‌లు కలిపి 139 చోట్ల ఆరోగ్య శిబిరాలను ఏర్పాటుచేశాయి. వీటికి 33,913 మంది మహిళలు హాజరయ్యారు. అందులో 13,902 మంది బీపీ పరీక్ష చేయించుకోగా, 10,281 మంది హైబీపీతో బాధపడుతున్నట్టు తేలింది. అలాగే 14,700 మందికి పరీక్ష చేయగా, 10,018 మందికి షుగర్ ఉన్నట్టు నిర్ధారించారు. వారికి ఇప్పటివరకూ షుగర్ ఉన్నట్టు తెలియకపోవడం గమనార్హం. అలాగే 18,046 మందికి యాంటీనేటల్ చెకప్ (గర్భం దాల్చినప్పటి నుంచి ప్రసవానికి ముందు వరకూ చేసే పరీక్షలు), 8,446 మందికి హిమోగ్లోబిన్, 3,069 మందికి సర్వైకల్ క్యాన్సర్, 5,218 మందికి నోటి క్యాన్సర్, 7,161 మందికి రొమ్ము క్యాన్సర్ పరీక్షలు నిర్వహించారు. మరో 181 మందికి సికిల్‌సెల్ ఎనీమియా పరీక్షలను నిర్వహించారు. కొంతమంది మహిళలకు మరిన్ని పరీక్షలు చేయాల్సి ఉందని, ఆ తరువాత వైద్య సేవలను అందిస్తామని అధికారులు వెల్లడించారు.

ఎస్.కోటపై తర్జనభర్జన

విశాఖ జిల్లాలో విలీనం చేయాలనే డిమాండ్

- జిల్లాల పునర్విభజనపై ఏర్పాటైన మంత్రివర్గ ఉప సంఘానికి భారీగా వినతులు
- ప్రభుత్వం సుముఖంగా ఉన్నట్టు ప్రచారం
- 'పెందుర్తి'పైనా ఏదో ఒక నిర్ణయం
- నియోజకవర్గం మొత్తం ఒకే రెవెన్యూ డివిజన్‌లో ఉండాలని భావిస్తున్న ప్రభుత్వం



ఎస్.కోట

విశాఖపట్నం, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): జిల్లాల పునర్విభజన నేపథ్యంలో ప్రస్తుతం విజయనగరం జిల్లాలో ఉన్న శృంగవరపుకోట అసెంబ్లీ నియోజకవర్గాన్ని విశాఖపట్నం జిల్లాలో విలీనం చేయాలనే డిమాండ్ వినిపిస్తోంది. ఎస్.కోట అసెంబ్లీ సెగ్మెంట్ విశాఖపట్నం పార్లమెంటు నియోజకవర్గ పరిధిలో ఉంది. అందువల్ల ఆ నియోజకవర్గాన్ని విశాఖ జిల్లాలో విలీనం చేయాలని కోరుతూ జిల్లాల పునర్విభజనపై ఏర్పాటైన మంత్రివర్గ ఉపసంఘానికి పలు రాజకీయ పార్టీల నాయకులు, ప్రజలు వినతులు ఇచ్చారు.

గత ప్రభుత్వ హయాంలో చేపట్టిన జిల్లాల పునర్విభజనలో తలెత్తిన లోపాలను సరిదిద్దేందుకు కూటమి ప్రభుత్వం నిర్ణయించింది. దీనికి అనుగుణంగా ప్రస్తుత జిల్లాల్లో మార్పులు, చేర్పులపై ఏర్పాటుచేసిన మంత్రివర్గ ఉపసంఘం మూడు రోజుల క్రితం సమావేశమైంది. గత ప్రభుత్వం 2022లో కొత్త జిల్లాలు ఏర్పాటుచేసినపుడు ఎస్.కోటను విశాఖపట్నంలో విలీనం చేయాలనే డిమాండ్ వచ్చింది. అయితే అందుకు విజయనగరం జిల్లాకు చెందిన వైసీపీ పెద్దలు అడ్డుచెప్పడంతో ప్రభుత్వం ఎస్.కోటను విజయనగరం జిల్లాలోనే కొనసాగేలా నిర్ణయం తీసుకుంది. దీనిపై అప్పట్లో తీవ్ర వ్యతిరేకత వచ్చింది. అయినా వైసీపీ నేతలు పట్టించుకోలేదు. గత ఏడాది ఎన్నికల సమయంలో తాము అధికారంలోకి వచ్చిన తరువాత ఎస్.కోటను విశాఖపట్నంలో విలీనం చేస్తామని టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు హామీ ఇచ్చారు. ఆయన సీఎం అయిన తరువాత టీడీపీ నేతలు ఎన్నికల హామీ విషయాన్ని ప్రస్తావించారు. ఇదేవిధంగా రాష్ట్రంలోని మిగిలిన జిల్లాల్లో ఇబ్బందులను సీఎం దృష్టికి నేతలు తీసుకువెళ్లడంతో మంత్రివర్గ ఉపసంఘం ఏర్పాటుచేశారు. జిల్లాల నుంచి అభ్యంతరాలు, వినతులను నేరుగా ఉపసంఘం తీసుకుంది. ఇంకా జిల్లా యంత్రాంగాల ద్వారా మంత్రివర్గ ఉపసంఘానికి నేతలు నివేదికలు పంపించారు. విశాఖ జిల్లాకు సంబంధించి ఎస్.కోటను విశాఖ జిల్లాలో విలీనం చేయాలని వచ్చిన వినతులను మంత్రివర్గ ఉప సంఘానికి పంపారు. ఒకవేళ ఎస్.కోట నియోజకవర్గాన్ని విశాఖ జిల్లాలో విలీనం చేయాలనుకుంటే ఆ పరిధిలోని నాలుగు మండలాలను విశాఖపట్నం లేదా భీమిలి డివిజన్‌లో విలీనం చేయాల్సి ఉంటుంది.

ఇక పెందుర్తి నియోజకవర్గం విశాఖపట్నం, అనకాపల్లి రెవెన్యూ డివిజన్ల పరిధిలో ఉంది. పెందుర్తి మండలం విశాఖ రెవెన్యూ డివిజన్‌లో ఉండగా, పరవాడ, సబ్బవరం మండలాలు ... మిగతా 6వ పేజీలో

రోడ్లు, ఫుట్‌పాత్‌లు ఆక్రమిస్తే జరిమానా

- జీవీఎంసీ కమిషనర్ కేతన్‌గార్గ్



12వ వార్డులో రోడ్డును ఆక్రమించి ఏర్పాటుచేసిన దుకాణదారుతో మాట్లాడుతున్న కమిషనర్ కేతన్‌గార్గ్

విశాఖపట్నం, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): నగరంలో రోడ్లు, ఫుట్‌పాత్‌లు ఆక్రమించి దుకాణాలు ఏర్పాటుచేస్తే జరిమానా విధించాలని అధికారులకు జీవీఎంసీ కమిషనర్ కేతన్‌గార్గ్ ఆదేశాలు జారీచేశారు. గురువారం ఆయన జోన్-2 పరిధి 12వ వార్డులోని ఆరిలోవ, పెదగదిలిలో పర్యటించారు. ఈ సందర్భంగా పెదగదిలి వద్ద ఫుట్‌పాత్‌ను ఆక్రమించి టిఫిన్ దుకాణం, క్యాంటీన్ ఏర్పాటుచేయడం చూసి కమిషనర్ ఆగ్రహం వ్యక్తంచేశారు. తక్షణం వారికి జరిమానా విధించాలని శానిటరీ ఇన్‌స్పెక్టర్‌ను ఆదేశించారు. రోడ్లు, ఫుట్‌పాత్‌లు ఆక్రమించి ఏర్పాటుచేసిన దుకాణాలను యుద్ధప్రాతిపదికన తొలగించాలని సూచించారు. అనంతరం సమీపంలో వర్షంలో పారిశుధ్య విధులు నిర్వర్తిస్తున్న కార్మికులతో కమిషనర్ మాట్లాడారు. రెయిన్‌కోట్‌లు, గ్లౌజ్‌లు సరఫరా చేశామని, అవి అందాయా?, లేదా? అని కార్మికులను ప్రశ్నించారు. తమకు అందజేశారని తామే ధరించలేదని కార్మికులు బదులివ్వడంతో ఆరోగ్యానికి ఇబ్బంది కలిగేలా విధులు నిర్వర్తించడం మంచిది కాదని కమిషనర్ హితవుపలికారు. వర్షాలు కురుస్తున్నందున చెత్త, వ్యర్థాలు డ్రైనేజీల్లోకి చేరకుండా ఎప్పటికప్పుడు తొలగించాలని ఆదేశించారు.

స్టార్ హోటళ్లతో పోలీస్ శాఖ ఎంఓయూ

నగరానికి వచ్చే ఐపీఎస్ అధికారులకు బస కల్పించేలా ఒప్పందం

- రెండో తేదీన డీజీపీ సమక్షంలో సంతకాలు
- ఏపీలో ఇదే ప్రథమం
- రూ.2 కోట్లతో పోలీస్ మెస్ ఆధునికీకరణ

విశాఖపట్నం, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): నగరంలోని 14 స్టార్ హోటళ్లతో రాష్ట్ర పోలీస్ శాఖ ఒప్పందం కుదుర్చుకోవాలని నిర్ణయించింది. రాష్ట్రానికి చెందిన ఐపీఎస్ అధికారులు ఎవరైనా నగరానికి వస్తే ఆ 14 హోటళ్లలో తమకు నచ్చిన చోట బస చేయవచ్చు. ఈ మేరకు వచ్చే నెల రెండో తేదీన డీజీపీ హరీష్‌కుమార్‌గుప్తా సమక్షంలో హోటళ్ల యజమానులు, నగర పోలీస్ కమిషనర్ ఒప్పంద పత్రాలు మార్చుకోనున్నారు. ఈ తరహా ఒప్పందం కుదుర్చుకోవడం ఏపీలో ఇదే ప్రథమం.

ప్రస్తుతం ఐపీఎస్ అధికారులు ఎవరైనా నగరానికి వస్తే బీచ్‌రోడ్డులోని సన్‌రైజ్ గెస్ట్‌హౌస్ (పోలీస్ మెస్)లో బస కల్పిస్తున్నారు. అందులో కేవలం 16 గదులు మాత్రమే ఉన్నాయి. ఏవైనా అంతర్జాతీయ సదస్సులు, కార్యక్రమాలు, ప్రముఖుల పర్యటనల సందర్భంలో గదుల సమస్య ఏర్పడుతోంది. దీనిని అధిగమించేందుకు పోలీస్ కమిషనర్ శంఖబ్రతబాగ్చి నగరంలోని త్రీస్టార్, ఫోర్ స్టార్, ఫైవ్‌స్టార్ హోటళ్ల యజమానులతో ఇటీవల భేటీ అయ్యారు. పోలీస్ అధికారులు నగరానికి వచ్చినప్పుడు వారికి ప్రభుత్వం ఇచ్చే టీఏ, డీఏలను హోటల్‌కు చెల్లిస్తారని, ఆ మొత్తాన్ని తీసుకుని వారికి వసతితోపాటు భోజన సదుపాయం కల్పించాలని ప్రతిపాదించారు. ఇందుకు 14 హోటళ్ల యజమాన్యాలు అంగీకరించాయి. దీంతో ఈనెల రెండో తేదీన డీజీపీ హరీష్‌కుమార్‌గుప్తా నగరానికి వచ్చినపుడు ఒప్పందం కుదుర్చుకోనున్నారు. అలాగే బీచ్‌రోడ్డులోని పోలీస్ మెస్‌ను నిర్మించి చాలా కాలమైంది. దానికి రిపేర్లు, లిఫ్ట్, టెర్రస్ గార్డెన్ వంటి హంగులు, సదుపాయాలు కల్పించేందుకు రూ.రెండు కోట్లు వరకు ... మిగతా 6వ పేజీలో

డీసీపీ-1గా జగదీశ్



జగదీశ్ అడహల్లి

విశాఖపట్నం, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): నగర పోలీస్ కమిషనరేట్‌లో డీసీపీ-1గా జగదీశ్ అడహల్లిని నియమిస్తూ డీజీపీ హరీష్ కుమార్‌గుప్తా గురువారం ... మిగతా 6వ పేజీలో



సింహాద్రినాథునికి స్వర్ణ పుష్పార్చన


స్వామికి పూజ చేస్తున్న అర్చకుడు

సింహాచలం, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి) : సింహాద్రినాథునికి ఆర్జిత సేవల్లో భాగంగా స్వర్ణ పుష్పార్చన గురువారం వైభవంగా నిర్వహించారు. వేకువజామున సుప్రభాతసేవతో స్వామివారిని మేల్కొలిపి ప్రభాతారాధనలు పూర్తిచేశారు. ఉత్సవమూర్తి గోవిందరాజస్వామి, ఉభయ దేవేరులను స్వర్ణాభరణాలు, పుష్పమాలికలతో శోభాయమానంగా అలంకరించి వేదికపై అధిష్ఠింపజేశారు. ఆలయ పద్మనిధి నుంచి స్వర్ణ పుష్పాలు తీసి భక్తులతో స్పృశింపజేసి బేడా మండపంలో ప్రదక్షిణ చేశారు. విశ్వక్సేనారాధన, పుణ్యాహవచనములు చేసి షోడశోపచారాలు సమర్పించారు. అనంతరం నారసింహ అష్టోత్తర శతనామార్చన పఠిస్తూ స్వర్ణ పుష్పాలతో అర్చన చేశారు. మంత్రపుష్పం, కర్పూర నీరాజనాలిచ్చిన తరువాత భక్తులకు వేదాశీర్వచనాలు, ప్రసాదాలు అందజేశారు.

అప్పన్న సన్నిధిలో నటుడు ప్రవీణ్‌కుమార్



సింహాచలం, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి) : టాలీవుడ్ నటుడు ప్రవీణ్‌కుమార్ వరాహ లక్ష్మీనృసింహస్వామిని గురువారం దర్శించుకున్నారు. ఆలయానికి వచ్చిన ఆయన కుటుంబ సభ్యులతో కలిసి అతిశ్రీఘ్రదర్శనం టికెట్లు తీసుకుని క్యూలో వెళ్లి స్వామివారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా విలేకరులతో మాట్లాడుతూ 2008లో సినీ రంగ ప్రవేశం చేసిన తాను ఇప్పటి వరకు పది సినిమాల్లో నటించానన్నారు. ప్రేమ కథా చిత్రం, శంభోశివ శంభో, రామ రామ కృష్ణ కృష్ణ, మిరపకాయ్ తదితర సినిమాల్లో చేసిన పాత్రలను ప్రేక్షకులు ఎంతగానో ఆదరించారని చెప్పారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

కొమ్మాది, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి) : కొమ్మాది సబ్‌స్టేషన్ పరిధిలో నిర్వహణ పనుల దృష్ట్యా శుక్రవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్టు ఏఈ నరేశ్ తెలిపారు, గురువారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. కొమ్మాది జంక్షన్, శ్రీనివాసానగర్, సాయిరాం కాలనీ, జీసీసీ లేఅవుట్, టీచర్స్ లేఅవుట్, హౌసింగ్ బోర్డు కాలనీ, అమరావతి కాలనీ, సేవానగర్, డ్రైవర్స్ కాలనీ, కె1 కాలనీ, కె2 కాలనీ, కె3 కాలనీ, కొమ్మాది, దేవీమెట్ట, డీఆర్‌కే టౌన్ షిప్, అన్నంరాజునగర్ ప్రాంతాలకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

అతిగా మొబైల్ వీక్షణం గుండెకు చేటు



కార్యక్రమంలో పాల్గొన్న వైద్యులు

ఎండాడ, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి) : అతిగా మొబైల్ వీక్షించడం, నిద్ర లేమి, మత్తు పదార్థాల వినియోగం, తీవ్ర ఒత్తిడి యువతలో గుండెపోటుకు దారి తీసే అంశాలు అని గీతం ఆస్పత్రి (జిమ్‌సర్) న్యూరాలజిస్ట్ డాక్టర్ విజయభాస్కరరావు అన్నారు. ప్రపంచ స్ట్రోక్ దినోత్సవం పురస్కరించుకుని గీతం ఆసుపత్రిలో గురువారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. 45 ఏళ్లలోపు వారిలో గుండెపోటు రావడానికి ప్రధాన కారణం చెడు అలవాట్లేనని చెప్పారు. అధిక రక్తపోటు, మధుమేహం, కొవ్వు, పొగ తాగడం, ఊబకాయం వంటివి గుండె పోటుకు దారితీస్తాయని చెప్పారు. బరువు తగ్గడం, దృష్టి లోపం, చేతుల తిమిరి, సరిగ్గా మాట్లాడలేకపోవడం వంటి లక్షణాలు ఉంటే వెంటనే వైద్యులను సంప్రతించాలని సూచించారు. గుండెపోటు వచ్చినప్పుడు మొదటి 4, 5 గంటలు విలువైనదని, సకాలంలో చికిత్స ప్రారంభిస్తే ప్రాణాపాయం నుంచి బయటపడవచ్చునన్నారు. ఈ కార్యక్రమంలో జిమ్‌సర్ వైద్య కళాశాల డీన్ డాక్టర్ ఎన్వీ రావు, డాక్టర్ వి. దీప్తి, తదితరులు పాల్గొన్నారు.

నూతన క్యాలెండర్ తయారీకి కసరత్తు

సింహాచలం, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి) : వరాహలక్ష్మీనృసింహ స్వామి దేవస్థానం ఆధ్వర్యంలో నూతన (2026) సంవత్సరానికి సంబంధించిన క్యాలెండర్ తయారీకి అధికారులు సన్నాహాలు ప్రారంభించారు. ఈమేరకు ఆలయ స్థానాచార్యులు రాజగోపాల్‌తో ఆస్థాన పంచాంగకర్త తెన్నేటి శ్రీనివాసశర్మ గురువారం సమావేశమయ్యారు. క్యాలెండర్‌లో ముద్రించాల్సిన అంశాలపై చర్చించారు.

12న దుకాణాలకు వేలం

భీమునిపట్నం, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి) :పట్టణంలోని మెయిన్ రోడ్‌లో జీవీఎంసీ నూతనంగా నిర్మించిన షాపింగ్ కాంప్లెక్స్‌లో 11 దుకాణాలను లీజుకు ఇచ్చేందుకు వచ్చే నెల 12న బహిరంగ వేలం నిర్వహించనున్నట్టు జోనల్ కమిషనరు ఒమ్మి అయ్యప్పనాయుడు తెలిపారు. గురువారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. మూడేళ్ల పాటు లీజుకు ఇచ్చేందుకు ఈ వేలం జరుగుతుందన్నారు. ఆసక్తిగల వారు కమిషనరు జీవీఎంసీ పేరున రూ. 48 వేలు డీడీ తీయడంతో పాటు ఆధార్, పాన్ కార్డు జెరాక్స్ కాపీలు తీసుకుని ఆ రోజు స్థానిక జోనల్ కార్యాలయంలో జరిగే బహిరంగ వేలంలో పాల్గొనాలని సూచించారు.

సాగర్‌నగర్‌లో వెలగని వీధి లైట్లు

సాగర్‌నగర్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి) :సాగర్‌నగర్‌లోని ఎల్ఐజీ ఏ, బీ, సీ గృహ సముదాయాలు, ఎంఐజీ సి, డి గృహ సముదాయాల్లో నెల రోజులుగా వీధి లైట్లు వెలగడం లేదు. దీంతో స్థానికులు రాత్రి వేళ తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. లైట్లకు ఉన్న టైమర్లు సక్రమంగా పనిచేయకపోవడంతో ఈ పరిస్థితి నెలకొన్నట్టు తెలిసింది. టైమర్లు సక్రమంగా పనిచేస్తే సాయంత్రం చీకటి పడిన తరువాత లైట్లు వాటి అంతత అవే వెలుగుతాయి. ఉదయం వాటి అంతట అవే ఆరిపోతాయి. టైమర్లు పని చేయకపోవడంతో పలు వీధుల్లో లైట్లు మొరాయిస్తున్నాయి. అధికారులు తక్షణమే స్పందించి సమస్యను పరిష్కరించాలని పలువురు కోరుతున్నారు.

మాజీ మంత్రి కన్నబాబుతో వైసీపీ నేతల భేటీ

తగరపువలస, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి) : తగరపువలసకు చెందిన వైసీపీ మహిళా అధ్యక్షురాలు డి. ప్రశాంతి, ఇతర మహిళా నాయకులు విశాఖ వచ్చిన ఆ పార్టీ ఉత్తరాంధ్ర ఇన్‌చార్జి, మాజీ మంత్రి కురసాల కన్నబాబును మద్దిలపాలెంలోని పార్టీ కార్యాలయంలో గురువారం కలిశారు. ఈ సందర్భంగా మహిళల సమస్యలను ఆయనకు వివరించారు. అనంతరం ఆయన ప్రశాంతిని శాలువతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ వరదు కల్యాణి, భీమిలి నియోజకవర్గ ఇన్‌చార్జి మజ్జి శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

స్టార్ హోటళ్లతో పోలీస్ శాఖ ఎంఓయూ

... 5వ పేజీ తరువాయి

ఖర్చుపెట్టాలని సీపీ నిర్ణయించారు. దీనికి సంబంధించిన పనులకు డీజీపీ అదేరోజు ప్రారంభించనున్నారు. అలాగే నగర పోలీస్ కమిషనరేట్ పరిధిలోని వివిధ కేసుల్లో సీజ్ చేసిన పది వేల కిలోలకుపైగా గంజాయిని కాపులుప్పాడలోని డంపింగ్‌యార్డులో డీజీపీ, జిల్లా అధికారుల సమక్షంలో అదేరోజు దహనం చేయనున్నారు. ఈ కార్యక్రమాలు పూర్తయిన తర్వాత వచ్చే నెల 14,15 తేదీల్లో నగరంలో జరిగే పెట్టుబడుల సదస్సుకు సంబంధించిన బందోబస్తు ఏర్పాట్లపై పోలీస్ ఉన్నతాధికారులతో డీజీపీ సమీక్ష నిర్వహించనున్నారు.

గోస్తనీలో ఊట బావుల మునక

- 22 గ్రామాలకు నిలిచిన తాగునీటి సరఫరా
- ప్రత్యామ్నాయ ఏర్పాట్లలో జీవీఎంసీ అధికారులు


చిట్టివలస వద్ద ఇన్ ఫిల్టరేషన్ బావులు (ఫైల్)


బావులు కనిపించకుండా ప్రవహిస్తున్న నది

తగరపువలస, భీమునిపట్నం, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి) : తగరపువలస, చిట్టివలస పరిధిలోని 22 గ్రామాలకు తాగునీరు అందించే ఇన్ ఫిల్టరేషన్ బావులు గోస్తనీ నది ప్రవాహానికి మునిగిపోయాయి. దీంతో ఆయా గ్రామాలకు నీటి సరఫరా నిలిచిపోయింది. జీవీఎంసీ 1, 2 వార్డుల పరిధిలో ఉన్న తగరపువలస, చిట్టివలస పరిధిలోని 22 గ్రామాలతో పాటు నియోజకవర్గం పరిధిలోని వివిధ రక్షిత మంచి నీటి పథకాలకు తాగునీరు పంపింగ్ చేయడానికి చిట్టివలస, సామేయవలస ప్రాంతాల్లో గోస్తనీ నదిని ఆనుకుని పంపు హౌస్‌లు నిర్మించారు. వాటికి నీరు సరఫరా చేయడానికి చిట్టివలస వద్ద 16, సామేయవలస వద్ద 8 ఇన్ ఫిల్టరేషన్ బావులు తవ్వారు. వాటి ద్వారా నీటిని కుళాయిలకు సరఫరా చేస్తుంటారు. తుఫాన్ నేపథ్యంలో నాలుగు రోజుల పాటు కురిసిన భారీ వర్షాలకు నదిలో ప్రవాహం పెరగడంతో బావులు నీట మునిగాయి. పంపు హౌస్‌లకు సరఫరా చేసే నీరు శుద్ధి చేయడానికి అవకాశం లేకపోవడంతో అధికారులు తాగునీటి సరఫరాను నిలిపివేశారు. తగరపువలస, చిట్టివలస, సంగివలస, చిల్లపేట, జీరుపేట, ఎడదాసరిపేట, వలందపేట, మామిడిసాలెం, నమ్మివానిపేట తదితర గ్రామాలకు కుళాయిల ద్వారా తాగునీటి సరఫరా లేకపోవడంతో జీవీఎంసీ యంత్రాంగం ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేస్తోంది. నీటిని శుద్ధి చేసి కుళాయిల ద్వారా సరఫరా చేయడానికి కొంత సమయం పడుతుందని జోనల్ కమిషనర్ ఒమ్మి అయ్యప్పనాయుడు తెలిపారు.

రోజు విడిచి రోజు నీటి సరఫరా

భీమిలి జోన్ పరిధిలోని గ్రామాలకు రోజు విడిచి రోజు కుళాయిల ద్వారా నీరు సరఫరా చేస్తామని జడ్సీ అయ్యప్పనాయుడు తెలిపారు. 1, 2, 3 వార్డుల్లో ఉన్న తగరపువలస, సంగివలస, చిట్టివలస, చిల్లపేట, బ్యాంక్ కాలనీ, మామిడిపాలెం, భీమిలి టౌన్, కృష్ణాకాలనీ, బర్మాకాలనీ, ఎగువపేట, వలందపేట, సత్యనారాయణపేట, రెల్లివీధి, తోటవీధి ప్రాంతాలకు కుళాయిల ద్వారా నీరు సరఫరా చేస్తామన్నారు. సరఫరా సమయాల్లో మార్పు జరగవచ్చన్నారు. మిగిలిన ప్రాంతాలకు ట్యాంకర్ల ద్వారా సరఫరా చేస్తామన్నారు. ఎక్కడైనా సమస్య ఉంటే 1 వార్డు ఇన్‌చార్జి ఏఈ పి. శివకుమార్ 9494915740, 2 వార్డు ఇన్‌చార్జి ఏఈ ఎస్. జ్యోత్స్న 8096141940, 3వ వార్డు ఇన్‌చార్జి ఏఈ కె. గీతాలక్ష్మి 7893982956 ఫోన్ నంబర్లకు సంప్రతించాలన్నారు. ట్యాంకర్ల నీటికి 9866046100 నంబరుకు సంప్రతించాలన్నారు.

నీట మునిగిన పంట పొలాలు


సింగనబందలో నీట మునిగిపోయిన వరి పంట

భీమునిపట్నం (రూరల్), అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి) :మండలంలోని సింగనబంద పంచాయతీలో 28 ఎకరాల్లో పంట పొలాలు నీట మునిగాయి. అలాగే దొకరపేట, కృష్ణంరాజుపేట, లక్ష్మీపురం, మజ్జివలస, మజ్జిపేట, దాకమర్రి, అమనాం, అన్నవరం, తాళ్లవలసలో కూడా పంట పొలాల్లోకి నీరు చేరింది. ఆయా గ్రామాల్లోని చెరువులకు గండ్లు పడడంతో పంటలు ముంపునకు గురయ్యాయి. తాటితూరు, నగరపాలెంలో గోస్తనీ నది నీరు పొలాల్లోకి చేరింది. పొట్టదశలో ఉన్న వరి నీట మునిగి నానిపోవడంతో ఎందుకూ పనికి రాకుండా పోయిందని రైతులు ఆవేదన చెందుతున్నారు. వేరుశెనగ, అరటి,బొప్పాయి, బెండ, దొండ, వంగ పంటలతో పాటు గోంగూర, తోటకూర, పాలకూర, బచ్చలకూర వంటి ఆకుకూరలు, బీర, ఆనప పాదులు నీట మునిగిపోయాయి. వ్యవసాయాధికారులు గ్రామాల్లో పర్యటించి పంట నష్టం అంచనాలు రూపొందించాలని బాధిత రైతులు కోరుతున్నారు.

ఎక్కడ చూసినా.. బురద, వర్షం నీరు

మధురవాడ, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి) : మధురవాడ పరిసరాల్లో నాలుగు రోజుల పాటు కురిసిన వర్షాలకు కొన్ని ప్రాంతాల్లో బురద పేరుకుపోగా, మరికొన్నిచోట్ల రహదారులు వర్షం నీటిలో ఉన్నాయి.స్వతంత్రనగర్ కాలనీ, బాపూజీనగర్, పోర్టు కాలనీ, నగరంపాలెం, మిథిలాపురి వుడా కాలనీ, పాత మధురవాడ మెట్ట, వాంబే కాలనీ ప్రాంతాల్లో గురువారం కూడా వర్షంనీరు నిలిచే ఉంది. దీంతో స్థానికులు రాకపో కలకు ఇబ్బందులు పడ్డారు. గణేశ్‌నగర్ ప్రభుత్వ పాఠశాల చుట్టూ నీరు, బురదతో ఉండడంతో ఇబ్బందులు ఎదురయ్యాయి. అయోధ్యనగర్‌కు వెళ్లే రహదారి ఇంకా నీటిలోనే ఉంది.కాగా వర్షాల వల్ల భవన నిర్మాణ పనులు నిలిచిపోవడంతో కార్మికులు ఉపాధి కోల్పోయారు. వీధి వ్యాపారులు, తోపుడు బండ్లపై వ్యాపారాలు చేసుకునే వారు అమ్మకాలు డీలా పడ్డారు.


జలమయమైన అయోధ్యనగర్ రహదారి, ఖాళీ స్థలాలు


గణేశ్‌నగర్ పాఠశాలకు వెళ్లే మార్గంలో బురద

చెక్ డ్యామ్‌ల పైనుంచి నీటి ప్రవాహం


మజ్జివలస వద్ద కురపల్లి చెక్ డ్యామ్ పైనుంచి పారుతున్న నీరు

భీమునిపట్నం (రూరల్), అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని మజ్జివలస, తాళ్లవలస, చిన్నిపేట, మజ్జిపేట, నారాయణరాజుపేట, అమనాం, చిప్పాడ గ్రామాల్లోని చెక్ డ్యామ్‌ల పైనుంచి నీరు ప్రవహిస్తోంది. నాలుగు రోజులుగా కురుస్తున్న వర్షాలకు గోస్తనీ నదితో పాటు అనుబంధ కాలువల్లో నీటి ఉధృతి పెరగడంతో ఏటి కాలువల్లో భారీగా నీరు చేరింది. దీంతో చెక్ డ్యామ్‌ల పైనుంచి నీరు ప్రవహిస్తోంది. గతంలో ఎప్పుడూ ఈవిధంగా జరగలేదని రైతులు చెబుతున్నారు.

చెట్టు కూలి పాక్షికంగా దెబ్బతిన్న ఇల్లు

సింహాచలం, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి) : మొంథా తుఫాన్ 98వ వార్డు ప్రజలకు కష్టాలు మిగిల్చింది. ప్రియాగార్డెన్స్‌లో ఇంటిపై సమీపంలోని చెట్టు కూలడంతో ఇల్లు పాక్షికంగా దెబ్బతింది. చెట్టు కొమ్మలు విద్యు త్ వైర్లపై పడడంతో సరఫరా నిలిచిపోయింది. విషయం తెలుసుకున్న కార్పొరేటర్ నరసింహం, జీవీఎంసీ, రెవెన్యూ, విద్యుత్ శాఖల సిబ్బంది చెట్టును తొలగించి విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారు. అలాగే లండగరువులో అరటి మొక్కలు నేలకొరగడంతో రైతులు ఆవేదన చెందుతున్నారు.

మార్గశిర మాసోత్సవాలకు ఆహ్వానం

మహారాణిపేట, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి) : వచ్చే నెల 21 నుంచి బురుజుపేటలోని కనకమహాలక్ష్మి ఆలయంలో మార్గశిర మాసోత్సవాలు ప్రారంభం కానున్నాయి. ఈ సందర్భంగా నవంబరు ఒకటో తేదీన ఉత్సవాలకు అంకురార్పణగా రాట వేయనున్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొనాలని కలెక్టర్ హరేంధిరప్రసాద్, దక్షిణ ఎమ్మెల్యే వంశీకృష్ణను అధికారులు ఆహ్వానించారు.

బాధితులకు భోజన ఏర్పాట్లు



బాధితులకు ఆహారం అందిస్తున్న దివీస్ కంపెనీ ప్రతినిధులు

భీమునిపట్నం (రూరల్), అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి) : చిప్పాడలో ఉన్న దివీస్ కంపెనీ ప్రతినిధులు నాగమయ్యపాలెం, అన్నవరం, చిప్పాడ గ్రామాల్లోని తుఫాన్ బాధితులకు గురువారం అల్పాహారం, భోజనాలు అందించారు. కంపెనీ సీఎస్ఆర్ ప్రతినిధులతో పాటు సచివాలయ సిబ్బంది ఆయా గ్రామాల్లోని యువకుల సహాయంతో ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. అన్నవరం పంచాయతీ ఎర్రయ్యపాలెంలో 200 మందికి, చిప్పార పంచాయతీ కంచరపాలెంలో 210, పెదనాగమయ్యపాలెం, చిననాగమయ్యపాలెంలో గ్రామాల్లో 350 మందికి అల్పాహారం, భోజనాలు అందించామని సీఎస్ఆర్ ప్రతినిధి శ్రీనివాసరావు తెలిపారు. ఈ కార్యక్రమంలో సచివాలయ కార్యదర్శులు గోపాలకృష్ణ, రాణి, రామచంద్రరావు, వీఆర్ఓలు రాజు కృష్ణ ప్రసన్న. తదితరులు పాల్గొన్నారు.

పడవలకు రక్షణ కరువు

భీమునిపట్నం (రూరల్), అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని నాగమయ్యపాలెంలో మత్స్యకా రుల పడవలకు రక్షణ కరువైంది. సముద్ర తీరంలో నిలుపుదల వేసిన పడవలు కెరటాల తాకిడికి పాడవు తున్నాయి. వేట లేని సమయంలో మత్స్యకారులు తమ పడవలను తీరంలో నిలుపుతారు. తుఫాన్లు వచ్చి నప్పుడు కెరటాల ఉధృతికి కొన్నిసార్లు పడవలు కొట్టుకుపోతున్నాయి. సముద్రంలో వేసిన మాదిరి లంగర్లు వేసి ఉంచడం వల్ల నీటిలో ఉంటాయి. కానీ ఈ తీరంలో పడవల పరిస్థితి అలా లేదు. గ్రామం లోతట్టు ప్రాంతంలో ఉండడంతో పడవలు కెరటాల తాకిడికి దెబ్బతింటున్నాయి.

బాధితులకు ఆర్థిక సాయం పంపిణీ


కొమ్మాది : బాధితురాలికి ఆర్థిక సహాయం అందిస్తున్న విజయ్‌బాబు

కొమ్మాది, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి) : తుపాన్లు వంటి విపత్తులను సమర్థంగా ఎదుర్కొవడంలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడిని మించిన నాయకుడు లేరని భీమిలి టీడీపీ నాయకుడు చిక్కాల విజయ్‌బాబు అన్నారు. గురువారం ఆయన 5వ వార్డు పరిధిలోని మారికవలస, శారదానగర్‌లో తుఫాన్ బాధితులకు ప్రభుత్వం మంజూరు చేసిన రూ. వెయ్యి తక్షణ ఆర్థిక సహాయాన్ని అందజేశారు. కార్యక్రమంలో కార్పొరేటర్ మొల్లి హేమలత, విశాఖ పార్లమెంట్ టీడీపీ ఉపాధ్యక్షుడు వాండ్రాసి అప్పలరాజు, మాజీ కార్పొరేటర్ మన్యాల సోంబాబు, టీడీపీ వార్డు అధ్యక్షుడు నాగోతి సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

పద్మనాభంలో...

పద్మనాభం : మండలంలోని ఇద్దరు తుఫాన్ బాధితులకు రెవెన్యూ అధికారులు తహశీల్దార్ కార్యాల యంలో రూ. 3 వేలు చొప్పున గురువారం ఆర్థిక సహాయం అందజేశారు. పద్మనాభం గ్రామానికి చెందిన రొంగలి ఈశ్వరమ్మ, రెడ్డిపల్లి గ్రామానికి చెందిన దుంగ కొండమ్మకు పరిహారం పంపిణీ చేశారు. వారికి పునరావాస కేంద్రంలో వసతి కల్పించి భోజన సౌకర్యం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో డీటీ చంద్రశేఖర్, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు కె. దామోదరరావు, టీడీపీ మండల అధ్యక్షుడు రమణ, మాజీ అధ్యక్షుడు కె. నగేశ్‌కుమార్, పీఏసీఎస్ పర్సన్ ఇన్‌చార్జిలు ఎం. అప్పలనాయుడు(అన్నమయ్య), శ్రీరాములు, వీఆర్ఓ వీర్రాజు, నాయకులు గంగరాజు, ఎర్నాయుడు, పైడినాయుడు, అచ్చింనాయుడు, సూర్యనారాయణ పాల్గొన్నారు.

భీమునిపట్నంలో..

భీమునిపట్నం : భీమిలి జోన్ 4వ వార్డులోని చేపలుప్పాడ వార్డు సచివాలయంలో బాధితులకు నియోజకవర్గ టీడీపీ నాయకుడు చిక్కాల విజయ్‌బాబు చేతుల మీదుగా ఆర్థిక సహాయాన్ని అందించారు. తుఫాన్ బాధితులకు, పునరావాస కేంద్రాల్లో ఉన్న వారికి ఈ ఆర్థిక సహాయాన్ని అందిస్తున్నామని తహశీల్దార్ రామారావు తెలిపారు. చేపలుప్పాడ, నాగమల్లయ్యపాలెం, మూలకుద్దు గ్రామాల్లో 54 కుటుంబాలకు సహాయం అందించినట్టు చెప్పారు. టీడీపీ నాయకుడు పాసి త్రినాథ్ కుమార్ మాట్లాడుతూ ప్రభుత్వ రేషన్ సరకులు కూడా సరఫరా చేసిందని, త్వరలో పంపిణీ చేస్తామని చెప్పారు.


సద్గురు సేవాశ్రమంలో కేక్ కట్ చేస్తున్న టీడీపీ నాయకులు

ఘనంగా గంటా రవితేజ జన్మదిన వేడుకలు

భీమునిపట్నం, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి) : ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు తనయుడు, టీడీపీ యువ నాయకుడు రవితేజ జన్మదిన వేడుకలు గురువారం సాయంత్రం 4వ వార్డు రామయోగి అగ్రహారంలోని సద్గురు సేవాశ్రమంలో ఘనంగా నిర్వహించారు. వార్డు ఐటీడీపీ ఆధ్వర్యంలో జరిగిన ఈ వేడుకలకు యువ నాయకుడు పాసి త్రినాథ్‌కుమార్ ముఖ్యఅతిథిగా హాజరై కేక్ కట్ చేశారు. అనంతరం వృద్ధులకు భోజనం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో నాయకులు గజ్జి రాజు, కారి అప్పారావు, ఊళ్ల రాజు, టీఎన్ఎస్ఎఫ్ నాయకులు సూరాడ రవి, బోర సుధాకర్‌రెడ్డి, ఐటీడీపీ నియోజకవర్గ నాయకుడు మరుపిళ్ల రాజేంద్రప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

బీచ్ రోడ్డులో విరిగి పడుతున్న కొండ చరియలు

విశాలాక్షినగర్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి) : బీచ్ రోడ్డు పరిధిలోని సీతకొండ ప్రాంతంలో గురువారం కొండ చరియలు విరిగిపడ్డాయి. తుఫాన్‌కు మూడు రోజులుగా కురిసిన భారీ వర్షాల వల్ల మట్టి పెల్లలు బాగా నాని ఉండడంతో కొండ చరియలు పడుతున్నాయి. కొండపై పెద్ద పెద్ద బండరాళ్లు ఉండడంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని వాహనదారులు ఆందోళన చెందుతున్నారు. అధికారులు స్పందించి కొండ చరియలు పడకుండా చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

గాలులకు ధ్వంసమైన సరుగుడు తోటలు


నేలకొరిగిన సరుగుడు తోటలు

విశాఖపట్నం, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): తుఫాన్ ప్రభావంతో వీచిన గాలులకు ఆనందపురంలోని రామవరంలో 80 ఎకరాల్లో సరుగుడు తోటలు దెబ్బతిన్నాయి. రెండు మూడు నెలల్లో కోతకు సిద్ధంగా ఉన్న తోటలు గాలులకు విరిగిపోయి నేలకొరిగాయి. 80 ఎకరాల్లో సగానికిపైగా చెట్లు విరిగిపోవడంతో రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. విరిగిపోయిన చెట్లు తక్కువ ధరకు విక్రయించాల్సి వస్తోందని వాపోయారు. సగటున ఎకరాకు రూ. 25 వేల వరకు నష్టం వాటిల్లిందన్నారు. గాలులకు నేలకొరిగిన తోటలను పరిశీలించాలని ఉద్యానశాఖాధికారులను కోరారు.

భాగస్వామ్య సదస్సుకు సిద్ధమవుతున్న వేదిక


ఏయూ ఇంజనీరింగ్ మైదానంలో భాగస్వామ్య సదస్సుకు వేస్తున్న టెంట్

విశాఖపట్నం, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి) : కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ఈ ఏడాది నవంబరు 14,15 తేదీల్లో ఆంధ్రవిశ్వవిద్యాలయం ఇంజనీరింగ్ కళాశాల మైదానంలో నిర్వహించనున్న భాగస్వామ్య సదస్సుకు ఏర్పాట్లు ముమ్మరంగా జరుగుతున్నాయి. జర్మన్ హేంగర్స్‌తో భారీ సమావేశ మందిరం, మరో రెండు హాళ్లు, ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, కేంద్ర వాణిజ్యశాఖామంత్రి పీయూష్‌గోయల్‌కు వేర్వేరుగా రెండు చాంబర్లు నిర్మిస్తున్నారు. పలు కంపెనీలు, ప్రభుత్వ శాఖలు స్టాల్స్ ఏర్పాటుచేస్తున్నాయి. తుఫాన్‌ల కాలం కావడంతో వర్షం, గాలులు తట్టుకునేలా ప్రధాన వేదిక, సమావేశ మందిరం, ఇతర హాళ్లు నిర్మిస్తున్నారు. తుఫాన్ ప్రభావంతో నాలుగు రోజులుగా నిలిచిపోయిన పనులు గురువారం ప్రారంభమయ్యాయి. ప్రతి హాల్లో ప్రతినిధులకు సౌకర్యవంతంగా ఉండేలా సీటింగ్, బారికేడ్లు, వాష్‌రూమ్స్, పార్కింగ్ ఏరియా, వీవీఐపీ గ్యాలరీలు, లాంజ్‌లు నిర్మిస్తున్నారు.

జీవీఎంసీలో కొత్త జోన్‌లకు సిబ్బంది

... 5వ పేజీ తరువాయి

రెండు జోన్‌లుగా విభజించడంతో పెందుర్తి జోన్ కార్యాలయంగా ప్రస్తుతం ఉన్న జోన్-8 (వేపగుంట) కార్యాలయాన్ని వినియోగిస్తారు. కొత్తగా 'అగనంపూడి జోన్' ఏర్పాటుచేయనున్నారు. అగనంపూడి లేదా దువ్వాడలో ఏదైనా ప్రైవేటు భవనంలో కార్యాలయం ఏర్పాటు చేయాలని అధికారులు భావిస్తున్నారు. కొత్తగా ఏర్పడిన ఉత్తర, అగనంపూడి జోన్‌లకు యూసీడీ ఏపీడీ, ఏఎంహెచ్‌ఓ, సూపరింటెండెంట్‌లు, సీనియర్ అసిస్టెంట్లు, జూనియర్ అసిస్టెంట్లు, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, సూపర్‌వైజర్లు, మజ్దూర్‌లు, రికార్డు అసిస్టెంట్లు, కంప్యూటర్ ఆపరేటర్లను కేటాయిస్తూ కమిషనర్ గురువారం ఉత్తర్వులు జారీచేశారు. ఉత్తర్వులను సంబంధిత ఉద్యోగులకు గురువారం సీ సెక్షన్ సిబ్బంది స్వయంగా చేరవేశారు. దీనిని బట్టి త్వరలోనే కొత్తజోన్‌ల కార్యకలాపాలు ప్రారంభమవుతాయని అధికారులు అభిప్రాయపడుతున్నారు.

జడ్పీకి రూ.4.37 కోట్ల నష్టం

... 5వ పేజీ తరువాయి

పునరావాస కేంద్రాల్లో తలదాచుకున్న 177 కుటుంబాలకు చెందిన 497 మందికి తాత్కాలిక సాయం కింద రూ.4.06 లక్షలు ఆయా తహశీల్దార్ల ఖాతాలకు జమ చేశారు. సీతమ్మధార తహశీల్దార్ కార్యాలయం పరిధిలో గురువారం కొంతమందికి సాయం అందించారు. వీరితోపాటు 13 వేల మంది మత్స్యకారులకు నిత్యావసర సరుకులు కొనుగోలుకు రూ.6.58 లక్షలు మార్కెటింగ్ శాఖ అధికారులకు బదలాయించారు. సరుకులు కొనుగోలు చేసిన అధికారులు వాటిని కిలోల వంతున ప్యాకింగ్ చేసే పనిలో ఉన్నారు. బహుశా శుక్రవారం లేదా శనివారం బియ్యంతోపాటు నిత్యావసర సరుకులు పంపిణీ చేస్తారు.

ఎస్.కోటపై తర్జనభర్జన

... 5వ పేజీ తరువాయి

అనకాపల్లి డివిజన్‌లో ఉన్నాయి. దీంతో పాలనాపరంగా ఇబ్బందులు ఎదురవుతున్నాయి. జిల్లాల పునర్విభజన సమయంలో పెందుర్తి నియోజకవర్గం మొత్తాన్ని అనకాపల్లి జిల్లా పరిధిలో చేర్చాలనే ప్రతిపాదనపై వ్యతిరేకత వచ్చింది. దీంతో మధ్యేమార్గంగా పెందుర్తి మండలాన్ని విశాఖ జిల్లాలో కొనసాగించి, సబ్బవరం, పరవాడ మండలాలను అనకాపల్లి జిల్లాలో కలిపారు. కాగా అసెంబ్లీ నియోజకవర్గం మొత్తం ఒకే రెవెన్యూ డివిజన్‌లో ఉండాలని ప్రభుత్వం తాజాగా నిర్ణయం తీసుకుంది. ఈనేపథ్యంలో పరవాడ, సబ్బవరం మండలాలను విశాఖ డివిజన్‌లో చేర్చుతారా?, లేక పెందుర్తి మండలాన్ని కూడా అనకాపల్లి విలీనం చేస్తారా?...అనేది చూడాలి. ఈ రెండింటిలో ఏ నిర్ణయం తీసుకున్నా పెందుర్తి నియోజకవర్గం మొత్తం ఒకే జిల్లా పరిధిలోకి వస్తుంది.

డీసీపీ-1గా జగదీశ్

... 5వ పేజీ తరువాయి

ఉత్తర్వులు జారీచేశారు. 2020 ఐపీఎస్ బ్యాచ్‌కు చెందిన జగదీశ్ ప్రస్తుతం అల్లూరి సీతారామరాజు జిల్లా అడిషనల్ ఎస్పీ(ఆపరేషన్స్)గా విధులు నిర్వర్తిస్తున్నారు. డీసీపీ-1గా పనిచేసిన అజితా వేజెండ్లకు గత నెలలో బదిలీ కావడంతో ఆ పోస్టు ఖాళీ అయిన విషయం తెలిసిందే. డీసీపీ-2 మేరీప్రశాంతి ప్రస్తుతం డీసీపీ-1గా ఇన్‌చార్జి బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు.

గెడ్డల్లోకి భారీగా వరద నీరు



వాసవానిపాలెం గెడ్డలో భారీగా ప్రవహిస్తున్న వరద నీరు

ఎంవీపీ కాలనీ, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి) : గత మూడు రోజులుగా భారీగా కురిసిన వర్షానికి గెడ్డ ప్రవాహం భారీగా పెరిగింది. ముడసర్లోవ నుంచి హనుమంతువాక మీదుగా వెంకోజీపాలెం, ఎంవీపీ కాలనీలోని పలు సెక్టర్ల మధ్య నుంచి, వాసవానిపాలెం వద్ద బీచ్‌లో గెడ్డ ప్రవాహం కలుస్తుంది. వర్షాల నేపథ్యంలో బుధ, గురువారాల్లో బురద నీరు భారీగా ప్రవహించింది. గెడ్డలోని చెత్తాచెదారం పూర్తిగా కొట్టుకుపోయింది. అంతకు ముందే గెడ్డల్లో పూడిక తొలగించడంతో ప్రవాహానికి అడ్డు లేకుండా, ఏ ప్రాంతమూ ముంపునకు గురయ్యే ప్రమాదం ఎదురు కాలేదు.

ఆరిలోవలో..



రామకృష్ణాపురంలో ప్రవహిస్తున్న గెడ్డ

ఆరిలోవ, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి) : మొంథా తుపాను నేపథ్యంలో కురిసిన భారీ వర్షాలకు ఆరిలోవ ప్రాంతంలోని గెడ్డలు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. గెడ్డలకు ఆనుకొని రక్షణ గోడలు నిర్మించడంతో వరద నీరుఇళ్లల్లోకి చేరే ప్రమాదం తప్పిందని రామకృష్ణాపురంవాసులు తెలిపారు. చాలా రోజుల తర్వాత గెడ్డలు నిండాయని, ఇలా ప్రవహిస్తుండడం ఆనందంగా ఉందని స్థానికులు ఆనందం వ్యక్తంచేస్తున్నారు.

భాగస్వామ్య సదస్సుకు బీచ్ రోడ్డు ముస్తాబు

- వర్షాలు పడుతున్నా చకచకా సుందరీకరణ పనులు
- డివైడర్ల మధ్యలో కొత్త మొక్కలు
- కూడళ్లలో ఫౌంటెన్లు, విద్యుద్దీపాలు

బీచ్ రోడ్డు, అక్టోబర్ 30 (ఆంధ్రజ్యోతి) : నవంబర్ రెండో వారంలో నగరంలో జరిగే భాగస్వామ్యసదస్సుకు ఏర్పాట్లు చకచకా సాగుతున్నాయి. ఇందులో భాగంగా ఆర్కే బీచ్‌లో సుందరీకరణ పనులు చేపడుతున్నారు. గురువారం ఉదయం వర్షం కురుస్తున్నప్పటికీ పనులను ఆపకుండా డివైడర్ల మధ్యలో కూలీలుమొక్కలను నాటారు.

ప్రధానంగా.. పార్క్ హోటల్ నుంచి ఆర్కే బీచ్ వరకు పనులు ఊపందుకున్నాయి. బీచ్ రోడ్డును ముస్తాబు చేస్తున్నారు. పాత మట్టిని తొలగించి కొత్తది వేసి మొక్కలను నాటుతున్నారు. డివైడర్ల గ్రిల్స్‌కు పెయింటింగ్ వేస్తున్నారు. రహదారులపై పేరుకుపోయిన మట్టిని తొలగిస్తున్నారు.తీరంలో ఇసుకను యంత్ర పరికరాలతో చదును చేస్తున్నారు. భాగస్వామ్య సదస్సుకు సంబంధించిన నమూనాలు ఏర్పాటు చేశారు. పాడైన ఫుట్‌పాత్‌లను పునర్నిర్మిస్తున్నారు. పలు కూడళ్లలో ఫౌంటెన్లు, అందమైన పూల మొక్కలను ఏర్పాటు చేసి ఆకర్షణీయంగా తీర్చిదిద్దుతున్నారు. పార్కు హోటల్, అల్లూరి సీతారామరాజు, వైఎస్ఆర్ కూడళ్లను ఆధునికీకరిస్తున్నారు. తీరం పొడవునా విద్యుద్దీపాలు వెలిగేలా చర్యలు చేపట్టారు. ఈ పనులను జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్ ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నారు.



ఫుట్‌పాత్‌లకు రంగులు వేస్తున్న కార్మికులు



డివైడర్లలో మొక్కలను నాటుతున్న సిబ్బంది

తుపాను ప్రభావంతో తీరంలో దెబ్బతిన్న నిర్మాణాలు



అలల ధాటికి ధ్వంసమైన గోడ



వైఎంసీఏ కూడలి వద్ద ఏనుగు విగ్రహానికి విరిగిన దంతం

బీచ్ రోడ్డు, అక్టోబర్ 30, (ఆంధ్రజ్యోతి) : తుఫాన్ దాటికి ఆర్కే బీచ్ తీరం అల్లకల్లోలంగా మారింది. తీరం వెంబడి అలలు ఉవ్వెత్తున ఎగసిపడడంతో తీరంలో ఉన్న కొన్ని నిర్మాణాలు పాక్షికంగా దెబ్బతిన్నాయి. తుపాను తీరం దాటినా అలల ఉధృతి మాత్రం తగ్గలేదు. ఆర్కే బీచ్ తీరానికి ఆనుకొని ఉన్న పిల్లల పార్కు పూర్తిగా పాడైంది. తీరం వెంబడి రాకాసి అలలు దాడి చేయడంతో గోడలు, రహదారులు చాలా వరకు ధ్వంసమయ్యాయి. తీరంలో రాళ్ల గుట్ట ఉన్నప్పటికీ 8 నుంచి 10 అడుగులు ఎత్తున అలలు ఎగిసి పడడంతో ఆ ధాటికి రాళ్లు చెల్లాచెదురమయ్యాయి. ఈదురు గాలుల కారణంగా చాలా చోట్ల చెట్లు నేలకొరిగాయి. వాటిని ఎప్పటికప్పుడు తొలగించి రాకపోకలకు అంతరాయం ఎదురవకుండా జాగ్రత్తలు తీసుకొంటున్నారు. సముద్రపు అలల హోరు ఈసారి పెద్దగా ఉందని, ఇంతకుముందు ఎప్పుడూ ఇంత హోరు చూడలేదని మత్స్యకారులు అంటున్నారు. గత వారం రోజులుగా చేపల వేటకు వెళ్లకపోవడంతో జీవనోపాధి ఇబ్బందిగా ఉందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

నేటి నుంచి గౌరీపరమేశ్వరుల ఉత్సవాలు



ఉత్సవాల్లో కోలాటం చేసే మహిళలు, చిన్నారులకు కండువాలు పంపిణీ చేస్తున్న దృశ్యం

వెంకోజీపాలెం, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి) : పాత వెంకోజీపాలెంలోని శ్రీసీతారామ సేవా సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న గౌరీ పరమేశ్వరుల మహోత్సవాలు శుక్రవారం నుంచి ప్రారంభం కానున్నాయి. దశాబ్ద కాలానికి పైగా సంప్రదాయబద్ధంగా నిర్వహిస్తున్న ఈ ఉత్సవాలను ఈ ఏడాది కూడా అంగరంగ వైభవంగా నిర్వహించనున్నట్టు సంఘం అధ్యక్షుడు కర్రి వెంకటసూర్యఅప్పారావు తెలిపారు. గవర కులస్థులంతా ఇలవేల్పుగా, ఇష్టదైవంగా భావించే గౌరమ్మకు సంబరాలను తొమ్మిది రోజుల పాటు రామాలయం వద్ద నిర్వహించనున్నట్టు చెప్పారు. శుక్రవారం సాయంత్రం కొత్త వెంకోజీపాలెం భూలోకమాత అమ్మవారి ఆలయం వద్ద పూజలు నిర్వహించి, అనంతరం విగ్రహదాత కాళ్ల శ్రీనివాస్ దంపతులతో ఉత్సవ విగ్రహాన్ని తలపై మోస్తూ, దీంతో పాటు వరి తుబ్బులను కూడా మహిళలు తలపై మోస్తూ ఊరేగించి, రామాలయంకు తీసుకొచ్చి, ఇక్కడ పొందుపరచనున్నట్టు చెప్పారు. తొమ్మిది రోజుల ఉత్సవాల్లో భాగంగా నవంబరు 3న సాయంత్రం దీపాలపూజ, 7న మహిళలతో సామూహిక కుంకుమపూజ, అదే రోజు సాయంత్రం సారె పూజ (గ్రామ ప్రజలందరూ తమ వంతుగా అమ్మవారికి కేజీపావు చొప్పున మిఠాయి సారెగా తీసుకురావడం), 8న మధ్యాహ్నం అన్నదానం, సాయంత్రం ఊరేగింపు, నిమజ్జనం చేయనున్నట్టు కేవీఎస్ అప్పారావు తెలిపారు. గ్రామస్తులంతా పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ మేరకు గురువారం సాయంత్రం ఈ ఉత్సవాల్లో కోలాటం నిర్వహించి గ్రామంలోని మహిళలు, చిన్నారులకు సంఘం సభ్యులు యల్లపురాము కండువాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో సంఘం గౌరవాధ్యక్షుడు మళ్ల పోలిరాజు, ఇతర కార్యవర్గ సభ్యులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

పాలిథిన్ కవర్లు వినియోగిస్తే చర్యలు

- దుకాణాల్లో జీవీఎంసీ పారిశుధ్య సిబ్బంది విస్తృత తనిఖీలు



పండ్ల దుకాణం వద్ద తనిఖీలు నిర్వహిస్తున్న పారిశుధ్య సిబ్బంది

మద్దిలపాలెం, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి) : గ్రేటర్ విశాఖ 22వ వార్డులో గురువారం జీవీఎంసీ పారిశుధ్య, సచివాలయ సిబ్బంది పలు చిరు దుకాణదారుల వద్ద తనిఖీలు నిర్వహించారు. కళాభారతి రోడ్డులో తోపుడు బండ్లు, దుకాణాల వద్దకు వెళ్లి పాలిథిన్ కవర్లు వినియోగిస్తున్నారో, లేదో పరిశీలించారు. కొన్ని దుకాణాల్లో పాలిథిన్ కవర్లు లభ్యమవ్వడంతో స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా శానిటేషన్ సిబ్బంది మాట్లాడుతూ పాలిథిన్ బ్యాగులు వినియోగిస్తే జరిమానా విధిస్తామని హెచ్చరించారు. గుడ్డ సంచులే వినియోగించాలని సూచించారు. తనిఖీల్లో సచివాలయ శానిటేషన్ కార్యదర్శులు, సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

వెంకోజీపాలెంలో..

వెంకోజీపాలెం, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి) : తోపుడుబండ్లు, కూరగాయల వ్యాపారులు పాలిథిన్ కవర్లను వినియోగిస్తే కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని 15వ వార్డు శానిటరీ ఇన్‌స్పెక్టర్ కిషోర్ హెచ్చరించారు. గురువారం హెచ్‌బీ కాలనీలోని ఓ చికెన్ సెంటర్‌లో కిలో పాలిథిన్ కవర్లను స్వాధీనం చేసుకుని యజమానికి రూ.1000లు జరిమానా విధించారు. తక్కువ మైక్రాన్ ఉన్న కవర్లను వినియోగించరాదని, స్వచ్ఛ భారత్‌కు ప్రతి ఒక్కరూ సహకరించాలని ఆయన కోరారు. కార్యక్రమంలో సచివాలయం, జీవీఎంసీ పారిశుధ్య సిబ్బంది పాల్గొన్నారు.

హెన్రీ డ్యూనాంట్ సేవలు అమోఘం

మద్దిలపాలెం, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి) : మొదటి నోబెల్ శాంతి బహుమతి గెలుచుకున్న వ్యక్తి, రెడ్‌క్రాస్ వ్యవస్థాపకుడు హెన్రీ డ్యూనాంట్ అని, ఆయన ప్రపంచానికి అందించిన సేవలు అమోఘమని డాక్టర్ వీఎస్ కృష్ణా ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ఐ.విజయబాబు పేర్కొన్నారు. కళాశాలలో గురువారం నిర్వహించిన హెన్రీ డ్యూనాంగ్ స్మారక వార్షికోత్సవంలో ఆయన మాట్లాడుతూ స్విట్జర్లాండ్‌కు చెందిన హెన్రీ 1863లో రెడ్‌క్రాస్ సంస్థను స్థాపించి ప్రజలకు ఎన్నో సేవలు అందించారన్నారు. ఈనాటికీప్రపంచ వ్యాప్తంగా రెడ్‌క్రాస్ అనేక సేవలు అందిస్తోందన్నారు. అనంతరం హెన్రీ, రెడ్‌క్రాస్ సేవలను కొనియాడారు. కార్యక్రమంలో జాతీయ సేవా పథకం (ఎన్ఎస్ఎస్) అధికారి ఉమామహేశ్వరరావు, బి.లక్ష్మీ, రవీంద్రనాథ్, యూత్ రెడ్‌క్రాస్ కో-ఆర్డినేటర్ టి.రామకృష్ణ, విద్యార్థులు పాల్గొన్నారు.

వానరం సమస్యను పరిష్కరించండి



ఇబ్బందులకు గురి చేస్తున్న వానరం

ఆరిలోవ, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి) : తమ ప్రాంతంలో గత కొన్ని రోజులుగా ఓ కోతి వల్ల చాలా ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని జీవీఎంసీ 13వ వార్డు వాసులు వాపోతున్నారు. ఈ కోతి ఇంట్లోకి దూరి సామానులు ఎత్తుకొని వెళ్లిపోవడం లేదా పాడుచేయడం వంటి అల్లరి చేష్టలకు పాల్పడుతోందని, రోజూ ఇలా చేస్తుండడంతో చాలా ఇబ్బందిగా ఉందంటూ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీని గురించి అటవీ శాఖ అధికారులకు ఫిర్యాదు చేసినా వారు పట్టించుకోవడం లేదని మండిపడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి కోతి సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు.

రోడ్లు మూసివేస్తే ఎలా?



నిర్మాణం చేపడుతున్న ప్రాంతంలో మూసి వేసిన రహదారి (ఫైల్‌ఫోటో)

మద్దిలపాలెం, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి) : నిర్మాణ పనులతో మద్దిలపాలెం ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇళ్లు, కాలువలు, సీసీ రోడ్లు.. వంటి నిర్మాణాలు చేపడుతున్నప్పుడు రోడ్లను బ్లాక్ చేస్తున్నారు. జాతీయ రహదారి నుంచి మద్దిలపాలెం గ్రామానికి వెళ్లేందుకు మూడే మార్గాలు ఉన్నాయి. ఆయా మార్గాలు నిత్యం ఏదో సందర్భంతో మూసివేస్తున్నారు. అలాగే పూజలు లేదా ఫంక్షన్ల సమయంలోనూ రోడ్లపై రాకపోకలు సాగించకుండా మూసి వేస్తుండడంతో జనం ఇబ్బందులు పడుతున్నారు. కొన్నిసార్లు నిర్మాణాలు చేపడుతూ రోజుల తరబడి రోడ్లు మూసి వేస్తుండడంతో అనేక అవస్థలు ఎదురుకుంటున్నామని అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. దీనివల్ల కార్యాలయాలకు వెళ్లే ఉద్యోగులు, విద్యాసంస్థలకు వెళ్లే విద్యార్థులు, వీధుల్ల వ్యాపారాలు చేసుకునే తోపుడుబండ్ల వ్యాపారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

అలాగే ఇళ్ల నిర్మాణాలు చేపడుతున్న నిర్మాణదారులు నిర్మాణ సామగ్రిని రోడ్డుపైనే అడ్డదిడ్డంగా వేస్తుండడం కూడా పరిపాటిగా మారిందని, దీనిపై అధికారులకు ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఈ ప్రాంతంలో రోడ్లు మూసివేయడం, నిర్మాణ సామగ్రి రోడ్లను అక్రమిస్తూ వేయడం చేయకుండా చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

సినిమా గైడ్

- **బైసన్** : శారదా,
- **తమ్మా** : రమాదేవి
- **డూడ్** : శరత్, శ్రీరామా, లీలామహల్, శ్రీకన్య, ఎస్.వి.సి.లిఖిత (శ్రీహరిపురం), లక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), నరసింహ (గోపాలపట్నం), శ్రీకన్య (గాజువాక)
- **క్రాంప్** : సంగం, కామేశ్వరి, వెంకటేశ్వర-1, ఊర్వశి (కంచరపాలెం), మౌర్య (గోపాలపట్నం),
- **ఓజీ**: కిన్నెర, కామేశ్వరి, శ్రీకన్య హెవెన్-3, మినీ మోహిని (గాజువాక), శ్రీకాంతి, సుకన్య,
- **మిరాయి**: సౌజన్య (గోపాలపట్నం), నటరాజ్-1 (పెందుర్తి), కన్య (గాజువాక), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం)

రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 22, టమాటా 30, వంకాయలు (తెలుపు) 40, వంకాయలు (నలుపు) 44, బెండకాయలు 54, పచ్చిమిర్చి 40, కాకరకాయలు 36, బీరకాయలు 46, ఆనపకాయ 2, కాలీఫ్లవర్ 40, క్యాబేజి 24, క్యారెట్ 54, దొండకాయలు 42, బంగాళదుంపలు 20, అరటికాయ (పె)8, మునక్కాడలు (కిలో) 70, అల్లం (పాతది) 70, బరబాటి 48, ముల్లంగి 30, నిమ్మకాయలు (కిలో) 50, బద్దచిక్కుడు 66, దోస కాయలు 34, వెల్లుల్లి (పెద్దవి) 65, కొబ్బరికాయ (పెద్దది) 40, బీన్స్ (పెన్సిల్) 70, కీరదోస 22, కాప్సికమ్ 66, పొట్లకాయ (పెద్దది) 24, చేమదుంపలు 34, చిలగడదుంపలు 30, కంద 52, దేముడు చిక్కుడు 66, గోరు చిక్కుడు 42, కూర పెండలం 36, బ్రకోలి 45, పనస పొట్టు 200, కొండఉసిరి 64, కరివేపాకు (కిలో) 50, కొత్తిమీర (పెద్దకట్ట) 20, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 4, పాలకూర (కట్ట) 4, తోటకూర (కట్ట) 4, మామిడికాయలు 60, బూడిద గుమ్మడి కాయ 20, కర్రపెండలం 22, మామిడి అల్లం 90, బొప్పాయి 32, జామకాయలు (కిలో) 70.

కోడిగుడ్లు (నెక్) (వంద - రూ.లలో)

విశాఖపట్నం	570
విజయనగరం	574
శ్రీకాకుళం	574

చికెన్ ధరలు

బ్యాగ్	
రైతు ధర	110
లైవ్ ధర	130
విత్ స్కిన్	230
స్కిన్‌లెస్	240

పాఠశాలల సమీపంలో అపరిశుభ్రత

- దుర్గంధంతో విద్యార్థుల అవస్థలు

ఆరిలోవ, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి) : తోటగరువు ఉన్నత పాఠశాల మైదానానికి ఆనుకొని ఉన్న ఖాళీ స్థలం పూర్తిగా పిచ్చి మొక్కలతో నిండిపోయింది. దీంతో ఆ ప్రాంగణం అంతా చిట్టడవిలా తలపిస్తుండడంతో పాటు అపరిశుభ్రత నెలకొంది. దీనికితోడు పాఠశాలకు సమీపంలోని కల్యాణ మండపానికి సమీపంలో ఉన్న సందులో చెత్తాచెదారం పేరుకుపోయి ఉంది. ఇది వర్షాలకు తడిసి బాగా కుళ్లిపోయి దుర్వాసన వెదజల్లుతోంది. ఈ దుర్గంధాన్ని భరించలేక విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారు. అపరిశుభ్రత నెలకొనడంతో ఇక్కడ దోమలు విపరీతంగా ఉన్నాయి. దీంతో జ్వరాల బారిన పడుతున్నామని సమీపంలోని నివాసితులు, విద్యార్థుల తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. స్కూలు పరిసరాల్లో చెత్తాచెదారాలు, దోమల బెడద ఉండడంపై తల్లిదండ్రులు విస్మయం చెందుతున్నారు. దీనిపై అధికారులు దృషి సారించి స్కూలు పరిసరాల పరిశుభ్రతకు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.



తోటగరువు ఉన్నత పాఠశాల వద్ద అపరిశుభ్రంగా ఉన్న పరిసరాలు



రవీంద్రనగర్‌లోని ప్రాథమిక పాఠశాల గేటు వద్ద పడి ఉన్న చెత్త

రవీంద్రనగర్‌లో..

జీవీఎంసీ 10 వవార్డులో గల రవీంద్రనగర్‌లోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల స్కూలు సమీపంలో చెత్త పోగులు గుట్టలుగా పడి ఉన్నాయి. దీంతో వర్షానికి తడిసి కుళ్లిపోయి తీవ్ర దుర్గంధం వెదజల్లుతోంది. ఫలితంగా ఈ వైపు రాకపోకలు సాగించే పాదచారులు, వాహనదారులు ముక్కు మూసుకొని వెళ్లాల్సి వస్తోంది. స్కూలుకు సమీపంలోనే ఈ చెత్తకుప్పలు ఉండడంతో విద్యార్థులు సైతం ఇబ్బందులకు గురవుతున్నారు.

ఈ ప్రాంతంలో జీవీఎంసీ పారిశుధ్య సిబ్బంది చెత్త వేయడంతో ఇలా కుప్పలు పేరుకుపోతున్నాయని స్థానికులు అంటున్నారు. స్కూలు సమీపంలో చెత్త వేయకుండా జీవీఎంసీ పారిశుధ్య విభాగం ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని స్థానికులు, విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

సకాలంలో మాస్టర్ ప్లాన్ పనులు

- అధికారులకు వీఎంఆర్డీఏ చైర్మన్ ప్రణవ్ గోపాల్ ఆదేశం



అధికారులతో సమీక్షిస్తున్న ప్రణవ్‌గోపాల్

సిరిపురం, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): మాస్టర్ ప్లాన్ పనులు సకాలంలో పూర్తి చేసేలా ఇంజనీరింగ్ అధికారులు శ్రద్ధ తీసుకోవాలని వీఎంఆర్‌డీఏ చైర్మన్ ఎంవీ ప్రణవ్ గోపాల్ అన్నారు. గురువారం తన చాంబర్‌లో అభివృద్ధి పనుల పురోగతిపై ఇంజనీరింగ్ అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భోగాపురం ఎయిర్ పోర్టుకు అనుసంధానించే ప్రధాన రహదారులను గడువులోగా పూర్తి చేసేలా ఎప్పటికప్పుడు పరిశీలించాలని అధికారులకు సూచించారు. కైలాసగిరిపై చేపట్టిన త్రిశూల్ ప్రాజెక్టు జనవరి నెలాఖరుకు ఎట్టి పరిస్థితుల్లో పూర్తి చేయాలన్నారు. వుడా పార్కు ఆవరణలో స్కేట్ బోర్డు పనులు సకాలంలో పూర్తి చేయాలన్నారు. ఎల్ఆర్ఎస్‌కు సంబంధించి ఇప్పటి వరకు వచ్చిన దరఖాస్తుల పరిశీలన వేగవంతం చేయాలని ప్రణాళిక విభాగం అధికారులకు సూచించారు. వీటి కోసం దరఖాస్తు చేసేందుకు జనవరి 23 వరకు గడువు పొడిగించినందున కొనుగోలుదారులు సద్వినియోగం చేసుకునేలా విస్తృతంగా ప్రచారం చేయాలన్నారు. సమావేశంలో జాయింట్ కమిషనర్ రమేశ్, చీఫ్ అర్బన్ ప్లానర్ శిల్ప, ప్రధాన ఇంజనీర్ వినయ్‌కుమార్, పర్యవేక్షణ ఇంజనీర్లు భవానీశంకర్, మధుసూదనరావు తదితరులు పాల్గొన్నారు.

తుపాను బాధితులకు పరిహారం అందజేత



తుఫాను బాధితులకు పరిహారం చెక్కులు అందిస్తున్న ఎమ్మెల్యే వెలగపూడి

ఎంవీపీ కాలనీ, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి) : కూటమి ప్రభుత్వం పేద ప్రజలకు ఎప్పుడూ అండగా ఉంటుందని ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు అన్నారు. జీవీఎంసీ 15, 18 వార్డుల పరిధిలోని తుపాను బాధితులకు ప్రభుత్వం తరపున ప్రకటించిన పరిహారాన్ని ఎమ్మెల్యే గురువారం అందజేశారు. మొంథా తుపాను పరిస్థితిని ముందుగానే గుర్తించి, తగిన ఆదేశాలు జారీ చేసిన ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అభినందనీయులు అన్నారు. అలాగే అధికారులు కూడా నిరంతరం శ్రమించడం వల్ల ఎక్కడా ప్రాణాపాయం లేకుండా బయటపడ్డామన్నారు. బాధితులకు పునరావాస కేంద్రాల్లో ఆహారం పంపిణీ, ఇతర అవసరాలను సక్రమంగా అందించినట్టు తెలిపారు. ఈ సందర్భంగా 13 బాధిత కుటుంబాలకు పరిహారాన్ని అందించారు. కార్యక్రమంలో కార్పొరేటరు అప్పారి శ్రీవిద్య, గొలగాని పోలారావు, బుగత సత్యనారాయణ, మల్ల రవి తదితరులు పాల్గొన్నారు.

అదానీ కంపెనీల్లో ఎల్ఐసీ పెట్టుబడులా?

- గాంధీ విగ్రహం ఎదుట సీపీఐ ఆందోళన



ఆందోళన నిర్వహిస్తున్న సీపీఐ నేతలు

సిరిపురం, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి) : ఎల్ఐసీ సంస్థ నిధులను అదానీ కంపెనీల్లో పెట్టుబడి పెట్టడాన్ని వ్యతిరేకిస్తూ సీపీఐ జిల్లా సమితి ఆధ్వర్యంలో గురువారం జీవీఎంసీ విగ్రహం వద్ద ధర్నా నిర్వహించారు. జిల్లా సహాయ కార్యదర్శి పి.చంద్రశేఖర్ మాట్లాడుతూ ప్రభుత్వరంగ సంస్థల ఆస్తులను కార్పొరేట్, ప్రైవేటు వ్యక్తులకు కట్టబెట్టేందుకు ప్రధాన నరేంద్ర మోదీ ప్రభుత్వం కుట్రలు చేస్తోందని విమర్శించారు. జీవిత బీమా సంస్థ నిధులను ఆదానీ కంపెనీకు మళ్లించటం దుర్మార్గమైన చర్య అన్నారు. ఆదాని కంపెనీల్లో నిధులు మళ్లిస్తున్న తీరుపై అనేక అనుమానాలు ఉన్నాయని, దీనిపై సంయుక్త పార్లమెంటరీ కమిటీతో విచారణ చేపట్టాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ రంగ ఆస్తులను పరిరక్షించుకునేందుకు ప్రజానీకం ఉద్యమాలకు సిద్ధం కావాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. కలసి వచ్చే సంఘాలతో భవిష్యత్తులో పెద్ద ఎత్తున పోరాటాలు చేసేందుకు కార్యాచరణ సిద్ధం చేస్తున్నట్టు చెప్పారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు సత్యాంజనేయ, మన్మథరావు, శ్రీనివాసరావు, క్షేత్రపాలరెడ్డి, పడాల గోవింద్, ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు వై.రాంబాబు, నాగరాజు, మహిళా సమాఖ్య జిల్లా అధ్యక్షురాలు వనజాక్షి తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి గీతంలో రేడియాలజిస్టుల కాన్ఫరెన్స్



సదస్సు బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న వైద్యులు

విశాఖపట్నం, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 31 నుంచి నవంబరు 2వ తేదీ వరకు రేడియాలజిస్టుల 11వ వార్షిక కాన్ఫరెన్స్‌ను గీతం వర్సిటీలో నిర్వహిస్తున్నట్టు ఇండియన్ రేడియోలాజికల్ అండ్ ఇమేజింగ్ అసోసియేషన్ ఏపీ స్టేట్ చాప్టర్ ప్రెసిడెంట్ డాక్టర్ వి.సురేష్ పేర్కొన్నారు.జగదాంబలోని డాల్ఫిన్ డయాగ్నోస్టిక్స్‌లో గురువారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో వివరాలను వెల్లడించారు. గీతం మెడికల్ కళాశాలలో నిర్వహిస్తున్న ఈ మెడికల్ కాన్ఫరెన్స్‌కు రాష్ట్రంలోని అనేక ప్రాంతాల నుంచి 700 మంది రేడియాలజిస్టులు, పీజీ విద్యార్థులు హాజరవుతారన్నారు. దేశంలో అనేక ప్రాంతాల నుంచి మరో 30 మంది నిపుణులు వస్తారన్నారు. తొలి రోజు ఫీటల్ రేడియాలజీపై ప్రత్యేక వర్క్‌షాప్ నిర్వహిస్తామన్నారు. రాష్ట్రంలో తొలిసారిగా సిమిలేషన్ పద్ధతిలో భ్రూణదశలోని శిశువులపై ఇమేజింగ్ ఆధారిత ఇంటర్‌వెన్షన్ విధానాన్ని ప్రదర్శించనున్నట్టు తెలిపారు. ఇప్పటివరకు స్కానింగ్ చేసి గర్భంలో ఉన్న శిశువుకు ఉన్న ఇబ్బందులను మాత్రమే గుర్తిస్తున్నామని, నూతన విధానంలో గుర్తించిన అనారోగ్య సమస్యలకు వైద్య సేవలు అందించే అవకాశం ఉందన్నారు. సదస్సుకు ముఖ్య అతిథులుగా ఎంపీలు శ్రీభరత్, డాక్టర్ బైరెడ్డి శబరి హాజరుకానున్నారని తెలిపారు. కేజీహెచ్ రేడియాలజీ విభాగాధిపతి డాక్టర్ బుజ్జిబాబు మాట్లాడుతూ తొలి రోజు నిపుణుల ప్రసంగాలు, శాస్త్రీయ పత్రాల ప్రదర్శన ఉంటుందన్నారు. ఉత్తమ పరిశోధన పత్రాలను ఎంపిక చేసి ప్రశంస పత్రాలు, పురస్కారాలు అందిస్తామన్నారు. కార్యక్రమంలో అపోలో చీఫ్ రేడియాలజిస్టు డాక్టర్ వర్మ, కేజీహెచ్ రేడియాలజీ విభాగం ప్రొఫెసర్ డాక్టర్ ఉమామహేశ్వరరావు, గీతం రేడియాలజీ విభాగం ప్రొఫెసర్ డాక్టర్ రఘు పాల్గొన్నారు.

గోతులమయంగా రహదారులు



సర్వీసు రోడ్డులోని గుంతల్లో చేరిన వర్షం నీరు

మురళీనగర్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి) : తుపాను ప్రభావంతో కురిసిన భారీ వర్షాలకు రోడ్లు జలమయం అయ్యాయి. గురువారం సాయంత్రానికి వర్షాలు తగ్గినప్పటికీ రహదారులపై వర్షం నీరు ప్రవహిస్తూనే ఉంది. దీంతో రహదారుల పై నుంచి ప్రయాణం ఇబ్బందిగా మారిందని స్థానికులు, వాహనదారులు వాపోతున్నారు. ఉత్తర నియోజకవర్గంలోని జాతీయ రహదారి ఆర్ అండ్ బీ జంక్షన్‌లో ఇప్పటికే భూగర్భ విద్యుత్ కేబుళ్ల అమరిక పనుల కోసం చేపట్టిన తవ్వకాలతో ఉన్న రోడ్లు వారం రోజులుగా వీడని వానలతో బురదమయంగా మారాయి. ఇటీవలే మరమ్మతులు చేసిన హైవే సర్వీసు రోడ్డు మళ్లీ రాళ్లు, పిక్కలతో గోతులతమయంగా మారింది. ఆర్ అండ్ బీ ఆఫీస్ ఎదుటే వాన నీరు నిత్యం నిలిచి ఉంటోంది. బిర్లా జంక్షన్ పాస్‌పోర్టు ఆఫీసు ఎదుట ఎగువ కొండ ప్రాంతం నుంచి చేరిన నీటితో హైవే సర్వీసు రహదారి పూర్తిగా దెబ్బతింది. ఎగువ మాధవధార, ఎన్జీజీవోస్ కాలనీ 48ఎ బస్ రూట్ జంక్షన్లలో రోడ్లపై ఏర్పడ్డ గోతులు ప్రయాణలకు ఇబ్బందిగా పరిణమిస్తున్నాయి.

1న రాజ్యాంగ పరిరక్షణ సదస్సు



సదస్సు పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ప్రభాకర్

సీతంపేట, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి) : భారత రాజ్యాంగం ప్రమాదంలో పడిందని, దాన్ని రక్షించుకోవాల్సిన కర్తవ్యం అన్ని వర్గాలపై ఉందని దళిత హక్కుల పోరాట సమితి (డీహెచ్‌పీఎస్) రాష్ట్ర అధ్యక్షుడు జేవీ ప్రభాకర్ అన్నారు. రామాటాకీస్ రోడ్డులోగల అంబేడ్కర్ భవన్‌లో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాజ్యాంగం, దళిత హక్కులు, కేంద్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలపై నవంబరు 1న నగరంలోని ద్వారకానగర్‌లో గల పౌరగ్రంథాలయంలో రాజ్యాంగ పరిరక్షణ సదస్సును నిర్వహించనున్నట్లు తెలిపారు.

మొంథా దెబ్బకు కళ తప్పిన బుద్ధుడి పార్కు

» అసంపూర్తి పనులతో ఆహ్లాదం కరువు » తాజాగా తుపాను ప్రభావంతో నేలకొరిగిన చెట్లు, వంగిన విద్యుత్ స్తంభాలు

అక్కయ్యపాలెం, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి) : మొంథా తుపాను ధాటికి నాలుగులేన్ల జాతీయ రహదారికి ఆనుకుని ఉన్న గ్రీన్‌బెల్ట్ బుద్ధుడి పార్కు అధ్వానంగా తయారైంది. ఈ పార్కును లక్షలాది రూపాయలతో నిర్మాణం చేస్తున్నారు. అయితే, అందులోని చెట్లు, మొక్కలు ఎండిపోయి విరిగిపోయాయి. విద్యుత్ స్తంభం ఒంగిపోయింది. ఉద్యానవన శాఖ అధికారులు, విద్యుత్తు శాఖ సిబ్బంది పట్టించుకోకపోవడంపై స్థానికులు మండిపడుతున్నారు. ఈ పార్కులో మొక్కలు వేయడానికి ఒప్పందంతో కాంట్రాక్టుకు ఇచ్చారు. వాళ్ల వేసిన మొక్కలు ఎండిపోయినా పట్టించుకోకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని పలువురు అంటున్నారు. అంతేకాకుండా ఈ పార్కు నిర్మాణం పూర్తి కాలేదు. ఉదయం, సాయంత్రం ఈ పార్కులో సేద తీరేందుకు వస్తున్న వారికి విరిగిపోయిన చెట్లు, అధ్వానంగా ఉన్న పార్కు కనిపిస్తోంది. దీంతో అక్కడ ఆహ్లాదం కరువై వారు అసంతృప్తితో వెనక్కి తిరిగి వెళ్ళిపోతున్నారు. తాజాగా.. మొంథా తుఫాన్ కారణంగా వీచిన ఈదురు గాలులు, వర్షాల వల్ల పార్కులోని మరి కొన్ని చెట్లు కూలి విద్యుత్ స్తంభం మరింతగా ఒరిగింది. అలాగే అందులో ఉన్న మొక్కలు కూడా పూర్తిగా నాశనమయ్యాయి. అధికారులు స్పందించి అధ్వానంగా ఉన్న పార్కులో మొక్కలు వేసి చెత్తను తొలగించాలని స్థానికులు కోరుతున్నారు. పార్కు సుందరీకరణకు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.



తుపాను ధాటికి వంగిపోయిన పార్కులోని మొక్కలు, విద్యుత్ స్తంభం

జోగారావునగర్‌లో కూలిన ఇల్లు

» పరామర్శించిన టీడీపీ నేతలు » పరిహారం ఇప్పిస్తామని బాధితులకు భరోసా

కంచరపాలెం, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి) :తుపాను ప్రభావంలో కురిసిన భారీ వరాలు, ఈదురు గాలులకు జీవీఎంసీ 55 వార్డు పరిధి జోగారావునగర్‌లో ఓ రేకుల ఇల్లు కూలిపోయింది. జోగారావునగర్‌లో బత్తిన అకుల్ రేకుల షెడ్డుతో కుటుంబ సభ్యులతో నివాసం ఉంటున్నారు. నాలుగు రోజుల నుంచి ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షాలకు గోడలు నానిపోయి గురువారం ఉదయం ఇల్లు ఉన్నపళంగా కూలిపోయింది. ఘటనా సమయంలో ఇంట్లో ఎవరూ లేకపోవడంతో ఎటువంటి ప్రమాదం చోటుచేసుకోలేదు. ఇల్లు కూలిపోవడంతో బాధిత కుటుంబ సభ్యులు నిరాశ్రయులయ్యారు. సమాచారం తెలుసుకున్న టీడీపీ వార్డు అధ్యక్షుడు బండి రంజిత్ కమిటీ సభ్యులతో కలిసి ఇంటిని పరిశీలించి బాధితులకు భరోసా ఇచ్చారు. వీఆర్వోకు సమాచారం అందించి జరిగిన నష్టాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానన్నారు. అలాగే బాధిత కుటుంబ సభ్యులను క్లస్టర్ ఇన్‌చార్జి ఈతలపాక సుజాత పరామర్శించి భోజనాలను అందించారు. కార్యక్రమంలో ఎస్.అప్పారావు, రమణ అప్పారావు, యమున, వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.



బాధితులను పరామర్శిస్తున్న టీడీపీ 55వ వార్డు అధ్యక్షుడు రంజిత్

తుపాను బాధితులకు పరిహారం అందజేత



బాధితులకు నగదు అందజేస్తున్న ఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజు, పాల్గొన్న జీవీఎంసీ డెప్యూటీ మేయర్ సతీష్ తదితరులు

సీతమ్మధార, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ 46వ వార్డులో మొంథా తుపాను బాధితులను గుర్తించి పునరావాస కేంద్రాలకు తరలించడంతో పాటు రాష్ట్ర ప్రభుత్వ ప్రకటించిన ప్రతి కుటుంబానికి రూ.3 వేలతో పాటు నిత్యావసర సరుకులను బాలయ్యశాస్త్రి లే అవుట్‌లో గల బీజేపీ ఉత్తర నియోజకవర్గం కార్యాలయంలో ఎమ్మెల్యే పి.విష్ణుకుమార్ రాజు, జీవీఎంసీ డెప్యూటీ మేయర్ కట్టుమూరు సతీష్ అందజేశారు. తుపాను కష్టకాలంలో రాజకీయాలను పక్కన పెట్టి పార్టీలు బాధితులకు సహాయం చేయడం అభినందనీయమని ఎమ్మెల్యే విష్ణుకుమార్ రాజు అన్నారు. కార్యక్రమంలో టీడీపీ ప్రధాన కార్యదర్శి నజీర్, జిల్లా ఉపాధ్యక్షుడు సురేష్‌బాబు, తదితరులు పాల్గొన్నారు.

పాలిథిన్ బ్యాగులు వినియోగిస్తే చర్యలు తప్పదు

సీతమ్మధార, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి) : పరిశుభ్రత పాటించకుండా, ప్లాస్టిక్ గ్లాసులను మద్యం దుకాణం ఆవరణలో ఉండడంతో సీతమ్మధారలో క్రిసెంట్ టవర్స్‌లో గల గాయత్రి వైన్స్ దుకాణానికి 24వ వార్డు శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఎస్వీ వెంకటేశ్వరరావు రూ.5 వేలు జరిమానాను గురువారం విధించారు. జీవీఎంసీ కమిషనర్, జోనల్ కమిషనర్ శివప్రసాద్ ఆదేశాలతో వార్డులో పాలిథిన్ సంచులు వినియోగిస్తున్న వారిపై, అలాగే శుభ్రత పాటించకుండా ప్లాస్టిక్ వాడుతున్న వారిపై చర్యలు తీసుకోవడంతో పాటు అవగాహన కార్యక్రమాన్ని చేపట్టారు. వార్డు శానటరీ ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వరరావు, సచివాలయం సిబ్బంది, శానిటరీ సూపర్‌వైజర్ కోట రమణలు వార్డులో పాలు ప్రాంతాల్లో దుకాణాలను తనిఖీ చేసి, వారికి అవగాహన కల్పించి ప్లాస్టిక్ సంచులు వాడుతున్న వారికి జరిమానా విధించారు.



అవగాహన కల్పిస్తున్న శానటరీ ఇన్‌స్పెక్టర్

23వ వార్డులో..

పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని పాలిథిన్ బ్యాగులను వినియోగించ కూడదని, వాడితే జరిమానాలు తప్పదని గ్రేటర్ విశాఖ 23వ వార్డు శానిటరీ ఇన్‌స్పెక్టర్‌సత్యనారాయణ స్పష్టం చేశారు. వార్డులోని సీతమ్మధార, మద్దిలపాలెం, చైతన్యనగర్ తదితర ప్రాంతాల్లో దుకాణాలను తనిఖీలు నిర్వహించి పాలిథిన్ బ్యాగులు వినియోగించవద్దని సూచించారు. కార్యక్రమంలో జీవీఎంసీ సిబ్బంది పాల్గొన్నారు.

భాగస్వామ్య సదస్సుకు సిద్ధమవుతున్న వేదిక



ఏయూ ఇంజనీరింగ్ మైదానంలో భాగస్వామ్య సదస్సుకు ఏర్పాట్లు

విశాఖపట్నం, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి) : కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ఈ ఏడాది నవంబరు 14,15 తేదీల్లో ఆంధ్రవిశ్వవిద్యాలయం ఇంజనీరింగ్ కళాశాల మైదానంలో నిర్వహించనున్న భాగస్వామ్య సదస్సుకు ఏర్పాట్లు ముమ్మరంగా జరుగుతున్నాయి. జర్మన్ హేంగర్స్‌తో భారీ సమావేశమందిరం, మరో రెండు హాళ్లు, ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, కేంద్ర వాణిజ్యశాఖామంత్రి పీయూష్‌గోయల్‌కు వేర్వేరుగా రెండు చాంబర్లు నిర్మిస్తున్నారు. పలు కంపెనీలు, ప్రభుత్వ శాఖలు స్టాల్స్ ఏర్పాటు చేస్తున్నాయి. తుఫాన్‌ల కాలం కావడంతో వర్షం, గాలులు తట్టుకునేలా ప్రధాన వేదిక, సమావేశ మందిరం, ఇతర హాళ్లు నిర్మిస్తున్నారు. తుఫాన్ ప్రభావంతో నాలుగు రోజులుగా నిలిచిపోయిన పనులు గురువారం ప్రారంభమయ్యాయి. ప్రతి హాల్లో ప్రతినిధులకు సౌకర్యవంతంగా ఉండేలా సీటింగ్, బారికేడ్లు, వాష్‌రూమ్స్, పార్కింగ్ ఏరియా, వీవీఐపీ గ్యాలరీలు, లాంజ్‌లు నిర్మిస్తున్నారు.

సింహాద్రినాథుడికి స్వర్ణ పుష్పార్చన

సింహాచలం, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి) :సింహాద్రినాథునికి ఆర్జిత సేవల్లో భాగంగా స్వర్ణ పుష్పార్చన గురువారం వైభవం గా నిర్వహించారు. వేకువజామున సుప్రభాతసేవతో స్వామివారి ని మేల్కొలిపి ప్రభాతారాధనలు పూర్తిచేశారు.ఉత్సవమూర్తి గోవింద రాజస్వామి, ఉభయ దేవేరులను స్వర్ణాభరణాలు, పుష్పమాలికలతో శోభాయమానంగా అలంకరించి వేదికపై అధిష్ఠింపజేశారు. ఆలయ పద్మనిధి నుంచి స్వర్ణ పుష్పాలు తీసి భక్తులతో స్పృశింపజేసి బేడా మండపంలో ప్రదక్షిణ చేశారు. విశ్వక్సేనారాధన, పుణ్యాహవచనములు చేసి షోడశోపచారాలు సమర్పించారు. అనంతరం నారసింహ అష్టోత్తర శతనామార్చన పఠిస్తూ స్వర్ణ పుష్పాలతో అర్చన చేశారు. మంత్ర పుష్పం, కర్పూర నీరాజనాలిచ్చిన తరువాత భక్తులకు వేదాశీర్వచనాలు, ప్రసాదాలు అందజేశారు.



స్వామికి పూజ చేస్తున్న అర్చకుడు

గుర్తు తెలియని వాహనం ఢీకొని వృద్ధుడికి గాయాలు

ఎంవీపీ కాలనీ, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి) : టీటీడీ కల్యాణ మండపం ఎదురుగా గుర్తు తెలియని ద్విచక్ర వాహనం ఢీకొనడంతో నడుచుకుంటూ వెళుతున్న వృద్ధుడు గాయపడ్డారు. ఈ నెల 27న ఉదయం పది గంటల సమయంలో దలిపర్తి సూర్యనారాయణ(75) నడచుకుంటూ వెళ్తుండగా. వెనుక నుంచి వేగంగా వచ్చిన మోటారు సైకిల్ ఢీ కొనడంతో సూర్యనారాయణకు నడుము విరిగిపోయింది. మోటార్ సైక్లిస్ పరారీ అయ్యాడు. దీనిపై ఎంవీపీ పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

డీసీపీ-1గా జగదీశ్

... 5వ పేజీ తరువాయి

ఉత్తర్వులు జారీచేశారు. 2020 ఐపీఎస్ బ్యాచ్‌కు చెందిన జగదీశ్ ప్రస్తుతం అల్లూరి సీతారామరాజు జిల్లా అడిషనల్ ఎస్పీ(ఆపరేషన్స్)గా విధులు నిర్వర్తిస్తున్నారు. డీసీపీ-1గా పనిచేసిన అజితా వేజెండ్లకు గత నెలలో బదిలీ కావడంతో ఆ పోస్టు ఖాళీ అయిన విషయం తెలిసిందే. డీసీపీ-2 మేరీప్రశాంతి ప్రస్తుతం డీసీపీ-1గా ఇన్‌చార్జి బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు.

స్టార్ హోటళ్లతో పోలీస్ శాఖ ఎంఓయూ

... 5వ పేజీ తరువాయి

ఖర్చుపెట్టాలని సీపీ నిర్ణయించారు. దీనికి సంబంధించిన పనులకు డీజీపీ అదేరోజు ప్రారంభించనున్నారు. అలాగే నగర పోలీస్ కమిషనరేట్ పరిధిలోని వివిధ కేసుల్లో సీజ్ చేసిన పది వేల కిలోలకుపైగా గంజాయిని కాపులుప్పాడలోని డంపింగ్‌యార్డులో డీజీపీ, జిల్లా అధికారుల సమక్షంలో అదేరోజు దహనం చేయనున్నారు. ఈ కార్యక్రమాలు పూర్తయిన తర్వాత వచ్చే నెల 14,15 తేదీల్లో నగరంలో జరిగే పెట్టుబడుల సదస్సుకు సంబంధించిన బందోబస్తు ఏర్పాట్లపై పోలీస్ ఉన్నతాధికారులతో డీజీపీ సమీక్ష నిర్వహించనున్నారు.

జడ్పీకి రూ.4.37 కోట్ల నష్టం

... 5వ పేజీ తరువాయి

పునరావాస కేంద్రాల్లో తలదాచుకున్న 177 కుటుంబాలకు చెందిన 497 మందికి తాత్కాలిక సాయం కింద రూ.4.06 లక్షలు ఆయా తహశీల్దార్ల ఖాతాలకు జమ చేశారు. సీతమ్మధార తహశీల్దార్ కార్యాలయం పరిధిలో గురువారం కొంతమందికి సాయం అందించారు. వీరితోపాటు 13 వేల మంది మత్స్యకారులకు నిత్యావసర సరుకులు కొనుగోలుకు రూ.6.58 లక్షలు మార్కెటింగ్ శాఖ అధికారులకు బదలాయించారు. సరుకులు కొనుగోలు చేసిన అధికారులు వాటిని కిలోల వంతున ప్యాకింగ్ చేసే పనిలో ఉన్నారు. బహుశా శుక్రవారం లేదాశనివారం బియ్యంతో పాటు నిత్యావసర సరుకులు పంపిణీ చేస్తారు.

ఎస్.కోటపై తర్జనభర్జన

... 5వ పేజీ తరువాయి

అనకాపల్లి డివిజన్‌లో ఉన్నాయి. దీంతో పాలనాపరంగా ఇబ్బందులు ఎదురవుతున్నాయి. జిల్లాల పునర్విభజన సమయంలో పెందుర్తి నియోజకవర్గం మొత్తాన్ని అనకాపల్లి జిల్లా పరిధిలో చేర్చాలనే ప్రతిపాదనపై వ్యతిరేకత వచ్చింది. దీంతో మధ్యేమార్గంగా పెందుర్తి మండలాన్ని విశాఖ జిల్లాలో కొనసాగించి, సబ్బవరం, పరవాడ మండలాలను అనకాపల్లి జిల్లాలో కలిపారు. కాగా అసెంబ్లీ నియోజకవర్గం మొత్తం ఒకే రెవెన్యూ డివిజన్‌లో ఉండాలని ప్రభుత్వం తాజాగా నిర్ణయం తీసుకుంది. ఈ నేపథ్యంలో పరవాడ, సబ్బవరం మండలాలను విశాఖ డివిజన్‌లో చేర్చుతారా?, లేక పెందుర్తి మండలాన్ని కూడా అనకాపల్లి విలీనం చేస్తారా?...అనేది చూడాలి. ఈ రెండింటిలో ఏ నిర్ణయం తీసుకున్నా పెందుర్తి నియోజకవర్గం మొత్తం ఒకే జిల్లా పరిధిలోకి వస్తుంది.

జీవీఎంసీలో కొత్త జోన్‌లకు సిబ్బంది

... 5వ పేజీ తరువాయి

రెండు జోన్‌లుగా విభజించడంతో పెందుర్తి జోన్ కార్యాలయంగా ప్రస్తుతం ఉన్న జోన్-8 (వేపగుంట) కార్యాలయాన్ని వినియోగిస్తారు. కొత్తగా 'అగనంపూడి జోన్' ఏర్పాటుచేయనున్నారు. అగనంపూడి లేదా దువ్వాడలో ఏదైనా ప్రైవేటు భవనంలో కార్యాలయం ఏర్పాటుచేయాలని అధికారులు భావిస్తున్నారు. కొత్తగా ఏర్పడిన ఉత్తర, అగనంపూడి జోన్‌లకు యూసీడీ ఏపీడీ, ఏఎంహెచ్‌ఓ, సూపరింటెండెంట్‌లు, సీనియర్ అసిస్టెంట్లు, జూనియర్ అసిస్టెంట్లు, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, సూపర్‌వైజర్లు, మజ్దూర్‌లు, రికార్డు అసిస్టెంట్లు, కంప్యూటర్ ఆపరేటర్లను కేటాయిస్తూ కమిషనర్ గురువారం ఉత్తర్వులు జారీచేశారు. ఉత్తర్వులను సంబంధిత ఉద్యోగులకు గురువారం సీ సెక్షన్ సిబ్బంది స్వయంగా చేరవేశారు. దీనిని బట్టి త్వరలోనే కొత్తజోన్‌ల కార్యకలాపాలు ప్రారంభమవుతాయని అధికారులు అభిప్రాయపడుతున్నారు.



కలెక్టర్‌కు ఆహ్వానం పలుకుతున్న ఆలయ అధికారులు

మార్గశిర మాసోత్సవాలకు ఆహ్వానం

మహారాణిపేట, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి) : వచ్చే నెల 21వ తేదీ నుంచి వన్‌టౌన్ బురుజుపేటలోని కనకమహాలక్ష్మి ఆలయంలో మార్గశిర మాసోత్సవాలు ప్రారంభం కానున్నాయి. ఈ సందర్భంగా నవంబరు ఒకటో తేదీన ఉత్సవాలకు అంకురార్పణగా రాట వేయనున్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొనాలని కలెక్టర్ ఎంఎన్ హరేంధిరప్రసాద్, దక్షిణ ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్‌లను గురువారం దేవస్థానం అధికారులు ఆహ్వానించారు.

వ్యాపార అభివృద్ధిపై అవగాహన



సదస్సుకు హాజరైన మహిళా పారిశ్రామికవేత్తలు

మహారాణిపేట, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి) : మహిళా పారిశ్రామికవేత్తలు వ్యాపార, వాణిజ్య రంగంలో అభివృద్ధి సాధించాలని విశాఖపట్నం ఛాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ మహిళా విభాగం చైర్‌పర్సన్ సంధ్యా గోడే అన్నారు. వన్‌టౌన్‌లో వైజాగ్ పటం ఛాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ మహిళా విభాగం ఆధ్వర్యంలో ఇన్‌స్పైర్ ఫర్ హేర్ పేరిట మహిళా పారిశ్రామికవేత్తలకు వ్యాపార, వాణిజ్య అంశాలపై గురువారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళలు వ్యాపారం రంగంలో రాణించి, పది మందికి ఉపాధి చూపించాలన్నారు. ఈ రంగంలో అనేక అవకాశాలు ఉన్నాయని, వాటిని సద్వినియోగం చేసుకోవాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో మధురా దాస్ గుప్తా, నవ్యాన వేలీ నందా, తదితరులు పాల్గొన్నారు.

9 మంది పేకాటరాయుళ్లపై కేసు నమోదు

కూర్మన్నపాలెం, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): పేకాట ఆడుతున్న వారిపై దాడి చేసి పోలీసులు కేసు నమోదు చేశారు. 88వ వార్డు మంగళపాలెం తోటలో పేకాట ఆడుతున్నారన్న సమాచారంతో దువ్వాడ పోలీసులు దాడి చేశారు. 9 మందిని అదుపులోకి తీసుకొని, వారి నుంచి రూ.95వేల నగదు, 9 మొబైల్ ఫోన్లును స్వాధీనం చేసుకున్నారు.

సింహాద్రినాథునికి వైభవంగా స్వర్ణ పుష్పార్చన

సింహాచలం, అక్టోబరు 30 (ఆంధ్ర జ్యోతి) : సింహాద్రినాథునికి ఆర్జిత సేవల్లో భాగంగా స్వర్ణ పుష్పార్చన గురువారం వైభవంగా నిర్వహించారు. వేకువజామున సుప్రభాతసేవతో స్వామివారిని మేల్కొలిపి ప్రభాతారాధనలు పూర్తిచేశారు. ఉత్సవమూర్తి గోవిందరాజస్వామి, ఉభయ దేవేరులను స్వర్ణాభరణాలు, పుష్పమాలికలతో శోభాయమానంగా అలంకరించి వేదికపై అధిష్ఠింపజేశారు.ఆలయ పద్మనిధి నుంచి స్వర్ణ పుష్పాలు తీసి భక్తులతో స్పృశింపజేసి బేడా మండపంలో ప్రదక్షిణ చేశారు. అనంతరం నారసింహ అష్టోత్తర శతనామార్చన పఠిస్తూ స్వర్ణ పుష్పాలతో అర్చన చేశారు.

ఈ రోడ్లపై ప్రయాణం నరకం

» అధ్వానంగా డాబాగార్డెన్స్ రహదారులు
» ఎక్కడికక్కడే గోతులు » పట్టించుకోని అధికారులు

డాబాగార్డెన్స్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ 31వ వార్డు డాబాగార్డెన్స్‌లో పలు రహదారులు గోతులతో అధ్వానంగా ఉన్నాయి. వీటిపై రాకపోకలు సాగించాలంటే ప్రజలు, వాహనదారులు భయపడుతున్నారు. ముఖ్యంగా డాబాగార్డెన్స్ జంక్షన్ నుంచి ప్రకాశరావుపేటకు వెళ్లే మార్గంలో సుధా నర్సింగ్ హోమ్, డ్వాక్రా బజార్ మీదుగా వెళ్లే రహదారి రాళ్లు తేలి దారుణంగా ఉంది.గత మూడు రోజులుగా కురిసిన వర్షాలకు ఆయా రోడ్లు మరింత ఛిద్రంగా తయారయ్యాయి.అలాగే లలితాకాలనీ నుంచి అల్లూరి విజ్ఞాన కేంద్రం రోడ్డు, మాజీ ఎమ్మెల్యే తైనాల విజయకుమార్ నివాసం నుంచి ఉన్న రోడ్డు ఎక్కడికక్కడే గోతులతో నిండిపోయాయి. నిత్యం ఈ మా ర్గంలో వేలాది మంది వాహనదారులు, పాదచారులు రాకపోకలు సాగిస్తుంటారు. కానీ అధికారులు ఈ రోడ్ల మరమ్మతుపై దృష్టిసారించడం లేదు. ఇటీవల రాత్రి వేళ సుధా నర్సింగ్ రోడ్డులో తరుచూ ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. పల్లపు ప్రాంతం కావడంతో వాహనదారులు వేగంగా వచ్చి గోతుల్లో పడి ప్రమాదాల బారిన పడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి రోడ్ల మరమ్మతుకు చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.



సుధా నర్సింగ్ హోమ్ డౌన్‌లో గోతులు

డివైడర్లకు గ్రిల్స్ ఏర్పాటు



ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద డివైడర్లకు ఏర్పాటు చేసిన గ్రిల్స్

డాబాగార్డెన్స్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ 31వ వార్డు పరిధిలోని డాబాగార్డెన్స్ అంబేడ్కర్ సర్కిల్ నుంచి ఆర్టీసీ కాంప్లెక్స్ బస్టాప్ వరకు డివైడర్లకు గ్రిల్స్ ఏర్పాటు చేస్తున్నారు. అంబేడ్కర్ సర్కిల్ నుంచి ఎల్ఐసీ బిల్డింగ్ మీదుగా కాంప్లెక్స్‌కు వెళ్లే రహదారి మధ్యలో డివైడర్ల మధ్య గతంలో గ్రిల్స్ ఉండేవి కావు. డివైడర్ ఉన్నప్పటికీ వాటిని పాదచారులు అటు, ఇటు ఎక్కేస్తూ ప్రమాదాలకు గురయ్యేవారు. విద్యార్థులు అయితే సాయంత్రం వేళ బస్సుల కోసం ఆతృతతో ఎన్నో సందర్భాల్లో ఇక్కడ పడిపోయి గాయాలపాలైన సంఘటనలు కూడా ఉన్నాయి. ఈ నేపథ్యంలో గత కొన్ని రోజులుగా డివైడర్ల పనులు చురుగ్గా సాగడంతో పాటు మధ్యలో గ్రిల్స్ ఏర్పాటు చేస్తుండడంతో ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ఇచ్చిన డబ్బులు అడిగినందుకు దాడి

కంచరపాలెం, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి) : ఇంటి తాళాలు పగులగొట్టి బలవంతంగా చొరబడి నివాసితులను బయటకు తోసేసి దౌర్జన్యానికి పాల్పడిన వ్యక్తులపై కంచరపాలెం పోలీసులు గురువారం కేసు నమోదు చేశారు. సీఐ కె.రవికుమార్ తెలిపిన వివరాలు ప్రకారం.. కంచరపాలెం జాతీయ రహదారి ఊర్వశి జంక్షన్ సమీపంలో ఉన్న కామాక్షినగర్‌లో ఎర్రా పుష్ప కుటుంబ సభ్యులతో కలిసి నివాసం ఉంటున్నారు. పుష్ప తండ్రి సుబ్రహ్మణ్యం పోర్టులో రిటైరయ్యాక వచ్చిన డబ్బులు రూ. 2.5 లక్షలతో 1997లో ఇల్లు గాని స్థలం గాని కొనుగోలు చేయాలని ప్రయత్నించారు. పుష్ప పిన్ని త్రివేణి కొనడం ఎందుకని చెప్పి ఆ డబ్బులు తీసుకొని తన ఇంట్లో కొంతభాగాన్ని పుష్ప కుటుంబ సభ్యులు ఉండడానికి ఇచ్చింది. తరువాత తాము సొంతంగా ఇల్లు కొనుక్కుంటామని చెప్పి పుష్ప ఎన్నిసార్లు త్రివేణికి ఆ డబ్బులు అడిగినా ఇవ్వలేదు.

ఈమేరకు ఇటీవల త్రివేణి తన ఇంటి పోర్షన్ ఖాళీ చేయమని పుష్పపై ఒత్తిడి చేసింది. త్రివేణి బంధువు మీనా, కుమార్తె నిర్మల, కుమారుడు పవన్, మరి కొంతమందితో కలిసి పుష్ప ఇంటి తాళాలు పగులగొట్టి సామాన్లు చిందర వందర చేసి భయభ్రాంతులకు గురిచేశారు. బాధితురాలు పుష్ప ఫిర్యాదు మేరకు సీఐ రవికుమార్ ఆధ్వర్యంలో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



నేలకొరిగిన సరుగుడు తోటలు

గాలులకు ధ్వంసమైన సరుగుడు తోటలు

విశాఖపట్నం, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): తుఫాన్ ప్రభావంతో వీచిన గాలులకు ఆనందపురం మండలంలోని రామవరంలో 80 ఎకరాల విస్తీర్ణంలో సరుగుడు తోటలు దెబ్బతిన్నాయి. రెండు మూడు నెలల్లో కోతకు సిద్ధంగా ఉన్న తోటలు గాలుల ధాటికి విరిగిపోయి నేలకొరిగాయి. 80 ఎకరాల్లో సగానికిపైగా చెట్లు విరిగిపోవడంతో రైతులు ఆవేదన వ్యక్తంచేశారు. విరిగిపోయిన చెట్లు తక్కువ ధరకు విక్రయించాల్సి వస్తోందని వాపోయారు. సగటున ఎకరాకు రూ. 25 వేల వరకు నష్టం వాటిల్లిందన్నారు.గాలులకు నేలకొరిగిన తోటలను పరిశీలించాలని ఉద్యానశాఖాధికారులను కోరారు.

అప్పన్న సన్నిధిలో నటుడు ప్రవీణ్‌కుమార్



సింహాచలం, అక్టోబరు 30 (ఆంధ్ర జ్యోతి) : టాలీవుడ్ నటుడు ప్రవీణ్‌కుమార్ అప్పన్న స్వామిని గురువారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ 2008లో సినీ రంగ ప్రవేశం చేసిన తాను ఇప్పటివరకు ప్రేమ కథా చిత్రం, శంభోశివశంభో, రామ రామ కృష్ణ కృష్ణ, మిరపకాయ్ తదితర సినిమాల్లో నటించానని చెప్పారు.

భాగస్వామ్య సదస్సుకు బీచ్ రోడ్డు ముస్తాబు

» వర్షాలు పడుతున్నా చకచకా సుందరీకరణ పనులు » డివైడర్ల మధ్యలో కొత్త మొక్కలు » కూడళ్లలో ఫౌంటెన్లు, విద్యుద్దీపాలు

బీచ్ రోడ్డు, అక్టోబర్ 30 (ఆంధ్రజ్యోతి) : నవంబర్ రెండో వారంలో నగరంలో జరిగే భాగస్వామ్యసదస్సుకు ఏర్పాట్లు చకచకా సాగుతున్నాయి. ఇందులో భాగంగా ఆర్కే బీచ్‌లో సుందరీకరణ పనులు చేపడుతున్నారు. గురువారం ఉదయం వర్షం కురుస్తున్నప్పటికీ పనులను ఆపకుండా డివైడర్ల మధ్యలో కూలీలుమొక్కలను నాటారు.

ప్రధానంగా.. పార్క్ హోటల్ నుంచి ఆర్కే బీచ్ వరకు పనులు ఊపందుకున్నాయి. బీచ్ రోడ్డును ముస్తాబు చేస్తున్నారు. పాత మట్టిని తొలగించి కొత్తది వేసి మొక్కలను నాటుతున్నారు. డివైడర్ల గ్రిల్స్‌కు పెయింటింగ్ వేస్తున్నారు. రహదారులపై పేరుకుపోయిన మట్టిని తొలగిస్తున్నారు.తీరంలో ఇసుకను యంత్ర పరికరాలతో చదును చేస్తున్నారు. భాగస్వామ్య సదస్సుకు సంబంధించిన నమూనాలు ఏర్పాటు చేశారు. పాడైన ఫుట్‌పాత్‌లను పునర్నిర్మిస్తున్నారు. పలు కూడళ్లలో ఫౌంటెన్లు, అందమైన పూల మొక్కలను ఏర్పాటు చేసి ఆకర్షణీయంగా తీర్చిదిద్దుతున్నారు. పార్కు హోటల్, అల్లూరి సీతారామరాజు, వైఎస్ఆర్ కూడళ్లను ఆధునీకరిస్తున్నారు. తీరం పొడవునా విద్యుద్దీపాలు వెలిగేలా చర్యలు చేపట్టారు. ఈ పనులను జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్ ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నారు.


ఫుట్‌పాత్‌లకు రంగులు వేస్తున్న కార్మికులు


డివైడర్లలో మొక్కలను నాటుతున్న సిబ్బంది

గెడ్డల్లోకి భారీగా వరద నీరు


వాసవానిపాలెం గెడ్డలో భారీగా ప్రవహిస్తున్న వరద నీరు

ఎంవీపీ కాలనీ, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి) : గత మూడు రోజులుగా భారీగా కురిసిన వర్షానికి గెడ్డ ప్రవాహం భారీగా పెరిగింది. ముడసర్లోవ నుంచి హనుమంతువాక మీదుగా వెంకోజీపాలెం, ఎంవీపీ కాలనీలోని పలు సెక్టర్ల మధ్య నుంచి, వాసవానిపాలెం వద్ద బీచ్‌లో గెడ్డ ప్రవాహం కలుస్తుంది. వర్షాల నేపథ్యంలో బుధ, గురువారాల్లో బురద నీరు భారీగా ప్రవహించింది. గెడ్డలోని చెత్తాచెదారం పూర్తిగా కొట్టుకుపోయింది. అంతకు ముందే గెడ్డల్లో పూడిక తొలగించడంతో ప్రవాహానికి అడ్డు లేకుండా, ఏ ప్రాంతమూ ముంపునకు గురయ్యే ప్రమాదం ఎదురు కాలేదు.

ఆరిలోవలో..


రామకృష్ణాపురంలో ప్రవహిస్తున్న గెడ్డ

ఆరిలోవ, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి) : మొంథా తుపాను నేపథ్యంలో కురిసిన భారీ వర్షాలకు ఆరిలోవ ప్రాంతంలోని గెడ్డలు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. గెడ్డలకు ఆనుకొని రక్షణ గోడలు నిర్మించడంతో వరద నీరుఇళ్లల్లోకి చేరే ప్రమాదం తప్పిందని రామకృష్ణాపురంవాసులు తెలిపారు. చాలా రోజుల తర్వాత గెడ్డలు నిండాయని, ఇలా ప్రవహిస్తుండడం ఆనందంగా ఉందని స్థానికులు ఆనందం వ్యక్తంచేస్తున్నారు.

తుపాను ప్రభావంతో తీరంలో దెబ్బతిన్న నిర్మాణాలు


అలల ధాటికి ధ్వంసమైన గోడ


వైఎంసీఏ కూడలి వద్ద ఏనుగు విగ్రహానికి విరిగిన దంతం

బీచ్ రోడ్డు, అక్టోబర్ 30, (ఆంధ్రజ్యోతి) : తుఫాన్ దాటికి ఆర్కే బీచ్ తీరం అల్లకల్లోలంగా మారింది. తీరం వెంబడి అలలు ఉవ్వెత్తున ఎగసిపడడంతో తీరంలో ఉన్న కొన్ని నిర్మాణాలు పాక్షికంగా దెబ్బతిన్నాయి. తుపాను తీరం దాటినా అలల ఉధృతి మాత్రం తగ్గలేదు. ఆర్కే బీచ్ తీరానికి ఆనుకొని ఉన్న పిల్లల పార్కు పూర్తిగా పాడైంది. తీరం వెంబడి రాకాసి అలలు దాడి చేయడంతో గోడలు, రహదారులు చాలా వరకు ధ్వంసమయ్యాయి. తీరంలో రాళ్ల గుట్ట ఉన్నప్పటికీ 8 నుంచి 10 అడుగులు ఎత్తున అలలు ఎగిసి పడడంతో ఆ ధాటికి రాళ్లు చెల్లాచెదురమయ్యాయి. ఈదురు గాలుల కారణంగా చాలా చోట్ల చెట్లు నేలకొరిగాయి. వాటిని ఎప్పటికప్పుడు తొలగించి రాకపోకలకు అంతరాయం ఎదురవకుండా జాగ్రత్తలు తీసుకొంటున్నారు. సముద్రపు అలల హోరు ఈసారి పెద్దగా ఉందని, ఇంతకుముందు ఎప్పుడూ ఇంత హోరు చూడలేదని మత్స్యకారులు అంటున్నారు. గత వారం రోజులుగా చేపల వేటకు వెళ్లకపోవడంతో జీవనోపాధి ఇబ్బందిగా ఉందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

నేటి నుంచి గౌరీపరమేశ్వరుల ఉత్సవాలు


ఉత్సవాల్లో కోలాటం చేసే మహిళలు, చిన్నారులకు కండువాలు పంపిణీ చేస్తున్న దృశ్యం

వెంకోజీపాలెం, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి) : పాత వెంకోజీపాలెంలోని శ్రీసీతారామ సేవా సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న గౌరీ పరమేశ్వరుల మహోత్సవాలు శుక్రవారం నుంచి ప్రారంభం కానున్నాయి. దశాబ్ద కాలానికి పైగా సంప్రదాయబద్ధంగా నిర్వహిస్తున్న ఈ ఉత్సవాలను ఈ ఏడాది కూడా అంగరంగ వైభవంగా నిర్వహించనున్నట్టు సంఘం అధ్యక్షుడు కర్రి వెంకటసూర్యఅప్పారావు తెలిపారు. గవర కులస్థులంతా ఇలవేల్పుగా, ఇష్టదైవంగా భావించే గైరమ్మకు సంబరాలను తొమ్మిది రోజుల పాటు రామాలయం వద్ద నిర్వహించనున్నట్టు చెప్పారు. శుక్రవారం సాయంత్రం కొత్త వెంకోజీపాలెం భూలోకమాత అమ్మవారి ఆలయం వద్ద పూజలు నిర్వహించి, అనంతరం విగ్రహదాత కాళ్ల శ్రీనివాస్ దంపతులతో ఉత్సవ విగ్రహాన్ని తలపై మోస్తూ, దీంతో పాటు వరి తుబ్బులను కూడా మహిళలు తలపై మోస్తూ ఊరేగించి, రామాలయంకు తీసుకొచ్చి, ఇక్కడ పొందుపరచనున్నట్టు చెప్పారు. తొమ్మిది రోజుల ఉత్సవాల్లో భాగంగా నవంబరు 3న సాయంత్రం దీపాలపూజ, 7న మహిళలతో సామూహిక కుంకుమపూజ, అదే రోజు సాయంత్రం సారె పూజ (గ్రామ ప్రజలందరూ తమ వంతుగా అమ్మవారికి కేజీపావు చొప్పున మిఠాయి సారెగా తీసుకురావడం), 8న మధ్యాహ్నం అన్నదానం, సాయంత్రం ఊరేగింపు, నిమజ్జనం చేయనున్నట్టు కేవీఎస్ అప్పారావు తెలిపారు. గ్రామస్తులంతా పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ మేరకు గురువారం సాయంత్రం ఈ ఉత్సవాల్లో కోలాటం నిర్వహించి గ్రామంలోని మహిళలు, చిన్నారులకు సంఘం సభ్యులు యల్లపురాము కండువాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో సంఘం గౌరవాధ్యక్షుడు మళ్ల పోలిరాజు, ఇతర కార్యవర్గ సభ్యులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

పాలిథిన్ కవర్లు వినియోగిస్తే చర్యలు

» దుకాణాల్లో జీవీఎంసీ పారిశుధ్య సిబ్బంది విస్తృత తనిఖీలు


పండ్ల దుకాణం వద్ద తనిఖీలు నిర్వహిస్తున్న పారిశుధ్య సిబ్బంది

మద్దిలపాలెం, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి) : గ్రేటర్ విశాఖ 22వ వార్డులో గురువారం జీవీఎంసీ పారిశుధ్య, సచివాలయ సిబ్బంది పలు చిరు దుకాణదారుల వద్ద తనిఖీలు నిర్వహించారు. కళాభారతి రోడ్డులో తోపుడు బండ్లు, దుకాణాల వద్దకు వెళ్లి పాలిథిన్ కవర్లు వినియోగిస్తున్నారో, లేదో పరిశీలించారు. కొన్ని దుకాణాల్లో పాలిథిన్ కవర్లు లభ్యమవ్వడంతో స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా శానిటేషన్ సిబ్బంది మాట్లాడుతూ పాలిథిన్ బ్యాగులు వినియోగిస్తే జరిమానా విధిస్తామని హెచ్చరించారు. గుడ్డ సంచులే వినియోగించాలని సూచించారు. తనిఖీల్లో సచివాలయ శానిటేషన్ కార్యదర్శులు, సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

వెంకోజీపాలెంలో..

వెంకోజీపాలెం, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి) : తోపుడుబండ్లు, కూరగాయల వ్యాపారులు పాలిథిన్ కవర్లను వినియోగిస్తే కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని 15వ వార్డు శానిటరీ ఇన్‌స్పెక్టర్ కిషోర్ హెచ్చరించారు. గురువారం హెచ్‌బీ కాలనీలోని ఓ చికెన్ సెంటర్‌లో కిలో పాలిథిన్ కవర్లను స్వాధీనం చేసుకుని యజమానికి రూ.1000లు జరిమానా విధించారు. తక్కువ మైక్రాన్ ఉన్న కవర్లను వినియోగించరాదని, స్వచ్ఛ భారత్‌కు ప్రతి ఒక్కరూ సహకరించాలని ఆయన కోరారు. కార్యక్రమంలో సచివాలయం, జీవీఎంసీ పారిశుధ్య సిబ్బంది పాల్గొన్నారు.

హెన్రీ డ్యూనాంట్ సేవలు అమోఘం

మద్దిలపాలెం, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి) : మొదటి నోబెల్ శాంతి బహుమతి గెలుచుకున్న వ్యక్తి, రెడ్‌క్రాస్ వ్యవస్థాపకుడు హెన్రీ డ్యూనాంట్ అని, ఆయన ప్రపంచానికి అందించిన సేవలు అమోఘమని డాక్టర్ వీఎస్ కృష్ణా ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ఐ.విజయబాబు పేర్కొన్నారు. కళాశాలలో గురువారం నిర్వహించిన హెన్రీ డ్యూనాంగ్ స్మారక వార్షికోత్సవంలో ఆయన మాట్లాడుతూ స్విట్జర్లాండ్‌కు చెందిన హెన్రీ 1863లో రెడ్‌క్రాస్ సంస్థను స్థాపించి ప్రజలకు ఎన్నో సేవలు అందించారన్నారు. ఈనాటికీప్రపంచ వ్యాప్తంగా రెడ్‌క్రాస్ అనేక సేవలు అందిస్తోందన్నారు. అనంతరం హెన్రీ, రెడ్‌క్రాస్ సేవలను కొనియాడారు. కార్యక్రమంలో జాతీయ సేవా పథకం (ఎన్ఎస్ఎస్) అధికారి ఉమామహేశ్వరరావు, బి.లక్ష్మి, రవీంద్రనాథ్, యూత్ రెడ్‌క్రాస్ కో-ఆర్డినేటర్ టి.రామకృష్ణ, విద్యార్థులు పాల్గొన్నారు.

వానరం సమస్యను పరిష్కరించండి


ఇబ్బందులకు గురి చేస్తున్న వానరం

ఆరిలోవ, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి) : తమ ప్రాంతంలో గత కొన్ని రోజులుగా ఓ కోతి వల్ల చాలా ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని జీవీఎంసీ 13వ వార్డు వాసులు వాపోతున్నారు. ఈ కోతి ఇంట్లోకి దూరి సామానులు ఎత్తుకొని వెళ్లిపోవడం లేదా పాడుచేయడం వంటి అల్లరి చేష్టలకు పాల్పడుతోందని, రోజూ ఇలా చేస్తుండడంతో చాలా ఇబ్బందిగా ఉందంటూ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీని గురించి అటవీ శాఖ అధికారులకు ఫిర్యాదు చేసినా వారు పట్టించుకోవడం లేదని మండిపడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి కోతి సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు.

రోడ్లు మూసివేస్తే ఎలా?


నిర్మాణం చేపడుతున్న ప్రాంతంలో మూసి వేసిన రహదారి (ఫైల్‌ఫొటో)

మద్దిలపాలెం, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి) : నిర్మాణ పనులతో మద్దిలపాలెం ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇళ్లు, కాలువలు, సీసీ రోడ్లు.. వంటి నిర్మాణాలు చేపడుతున్నప్పుడు రోడ్డులను బ్లాక్ చేస్తున్నారు. జాతీయ రహదారి నుంచి మద్దిలపాలెం గ్రామానికి వెళ్లేందుకు మూడే మార్గాలు ఉన్నాయి. ఆయా మార్గాలు నిత్యం ఏదో సందర్భంతో మూసివేస్తున్నారు. అలాగే పూజలు లేదా ఫంక్షన్ల సమయంలోనూ రోడ్లపై రాకపోకలు సాగించకుండా మూసి వేస్తుండడంతో జనం ఇబ్బందులు పడుతున్నారు. కొన్నిసార్లు నిర్మాణాలు చేపడుతూ రోజుల తరబడి రోడ్లు మూసివేస్తుండడంతో అనేక అవస్థలు ఎదురుకుంటున్నామని అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. దీనివల్ల కార్యాలయాలకు వెళ్లే ఉద్యోగులు, విద్యాసంస్థలకు వెళ్లే విద్యార్థులు, వీధుల్ల వ్యాపారాలు చేసుకునే తోపుడుబండ్ల వ్యాపారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

అలాగే ఇళ్ల నిర్మాణాలు చేపడుతున్న నిర్మాణదారులు నిర్మాణ సామగ్రిని రోడ్డుపైనే అడ్డదిడ్డంగా వేస్తుండడం కూడా పరిపాటిగా మారిందని, దీనిపై అధికారులకు ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఈ ప్రాంతంలో రోడ్లు మూసివేయడం, నిర్మాణ సామగ్రి రోడ్లను అక్రమిస్తూ వేయడం చేయకుండా చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

సినిమా గైడ్

- **బైసన్** : శారదా,
- **తమ్మా** : రమాదేవి
- **డూడ్** : శరత్, శ్రీరామా, లీలామహల్, శ్రీకన్య, ఎస్.వి.సి.లిఖిత (శ్రీహరిపురం), లక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), నరసింహ (గోపాలపట్నం), శ్రీకన్య (గాజువాక)
- **క్రాంప్** : సంగం, కామేశ్వరి, వెంకటేశ్వర-1, ఊర్వశి (కంచరపాలెం), మౌర్య (గోపాలపట్నం),
- **ఓజీ** : కిన్నెర, కామేశ్వరి, శ్రీకన్య హెవెన్-3, మినీ మోహిని (గాజువాక), శ్రీకాంతి, సుకన్య,
- **మిరాయి**: సౌజన్య (గోపాలపట్నం), నటరాజ్-1 (పెందుర్తి), కన్య (గాజువాక), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం)

రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 22, టమాటా 30, వంకాయలు (తెలుపు) 40, వంకాయలు (నలుపు) 44, బెండకాయలు 54, పచ్చిమిర్చి 40, కాకరకాయలు 36, బీరకాయలు 46, ఆనపకాయ 2, కాలీఫ్లవర్ 40, క్యాబేజి 24, క్యారెట్ 54, దొండకాయలు 42, బంగాళదుంపలు 20, అరటికాయ (పె)8, మునక్కాడలు (కిలో) 70, అల్లం (పాతది) 70, బరబాటి 48, ముల్లంగి 30, నిమ్మకాయలు (కిలో) 50, బద్దచిక్కుడు 66, దోస కాయలు 34, వెల్లుల్లి (పెద్దవి) 65, కొబ్బరికాయ (పెద్దది) 40, బీన్స్ (పెన్సిల్) 70, కీరదోస 22, కాప్సికమ్ 66, పొట్లకాయ (పెద్దది) 24, చేమదుంపలు 34, చిలగడదుంపలు 30, కంద 52, దేముడు చిక్కుడు 66, గోరు చిక్కుడు 42, కూర పెండలం 36, బ్రకోలి 45, పనస పొట్టు 200, కొండఉసిరి 64, కరివేపాకు (కిలో) 50, కొత్తిమీర (పెద్దకట్ట) 20, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 4, పాలకూర (కట్ట) 4, తోటకూర (కట్ట) 4, మామిడికాయలు 60, బూడిద గుమ్మడికాయ 20, కర్రపెండలం 22, మామిడి అల్లం 90, బొప్పాయి 32, జామకాయలు (కిలో) 70.

కోడిగుడ్లు (నెక్)

(వంద - రూ.లలో)

విశాఖపట్నం	570
విజయనగరం	574
శ్రీకాకుళం	574

చికెన్ ధరలు

బ్యాగ్

రైతు ధర	110
లైవ్ ధర	130
విత్ స్కిన్	230
స్కిన్‌లెస్	240

పాఠశాలల సమీపంలో అపరిశుభ్రత

» దుర్గంధంతో విద్యార్థుల అవస్థలు

ఆరిలోవ, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి) : తోటగరువు ఉన్నత పాఠశాల మైదానానికి ఆనుకొని ఉన్న ఖాళీ స్థలం పూర్తిగా పిచ్చి మొక్కలతో నిండిపోయింది. దీంతో ఆ ప్రాంగణం అంతా చిట్టడవిలా తలపిస్తుండడంతో పాటు అపరిశుభ్రత నెలకొంది. దీనికితోడు పాఠశాలకు సమీపంలోని కల్యాణ మండపానికి సమీపంలో ఉన్న సందులో చెత్తాచెదారం పేరుకుపోయి ఉంది. ఇది వర్షాలకు తడిసి బాగా కుళ్లిపోయి దుర్వాసన వెదజల్లుతోంది. ఈ దుర్గంధాన్ని భరించలేక విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారు. అపరిశుభ్రత నెలకొనడంతో ఇక్కడ దోమలు విపరీతంగా ఉన్నాయి. దీంతో జ్వరాల బారిన పడుతున్నామని సమీపంలోని నివాసితులు, విద్యార్థుల తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. స్కూలు పరిసరాల్లో చెత్తాచెదారాలు, దోమల బెడద ఉండడంపై తల్లిదండ్రులు విస్మయం చెందుతున్నారు. దీనిపై అధికారులు దృషి సారించి స్కూలు పరిసరాల పరిశుభ్రతకు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.


తోటగరువు ఉన్నత పాఠశాల వద్ద అపరిశుభ్రంగా ఉన్న పరిసరాలు

రవీంద్రనగర్‌లో..

జీవీఎంసీ 10 వవార్డులో గల రవీంద్రనగర్‌లోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల స్కూలు సమీపంలో చెత్త పోగులు గుట్టలుగా పడి ఉన్నాయి. దీంతో వర్షానికి తడిసి కుళ్లిపోయి తీవ్ర దుర్గంధం వెదజల్లుతోంది. ఫలితంగా ఈ వైపు రాకపోకలు సాగించే పాదచారులు, వాహనదారులు ముక్కు మూసుకొని వెళ్లాల్సి వస్తోంది. స్కూలుకు సమీపంలోనే ఈ చెత్తకుప్పలు ఉండడంతో విద్యార్థులు సైతం ఇబ్బందులకు గురవుతున్నారు.

ఈ ప్రాంతంలో జీవీఎంసీ పారిశుధ్య సిబ్బంది చెత్త వేయడంతో ఇలా కుప్పలు పేరుకుపోతున్నాయని స్థానికులు అంటున్నారు. స్కూలు సమీపంలో చెత్త వేయకుండా జీవీఎంసీ పారిశుధ్య విభాగం ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని స్థానికులు, విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.


రవీంద్రనగర్‌లోని ప్రాథమిక పాఠశాల గేటు వద్ద పడి ఉన్న చెత్త

సకాలంలో మాస్టర్ ప్లాన్ పనులు

» అధికారులకు వీఎంఆర్డీఏ చైర్మన్ ప్రణవ్ గోపాల్ ఆదేశం


అధికారులతో సమీక్షిస్తున్న ప్రణవ్‌గోపాల్

సిరిపురం, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): మాస్టర్ ప్లాన్ పనులు సకాలంలో పూర్తి చేసేలా ఇంజనీరింగ్ అధికారులు శ్రద్ధ తీసుకోవాలని వీఎంఆర్డీఏ చైర్మన్ ఎంవీ ప్రణవ్ గోపాల్ అన్నారు. గురువారం తన చాంబర్‌లో అభివృద్ధి పనుల పురోగతిపై ఇంజనీరింగ్ అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భోగాపురం ఎయిర్ పోర్టుకు అనుసంధానించే ప్రధాన రహదారులను గడువులోగా పూర్తి చేసేలా ఎప్పటికప్పుడు పరిశీలించాలని అధికారులకు సూచించారు. కైలాసగిరిపై చేపట్టిన త్రిశూల్ ప్రాజెక్టు జనవరి నెలాఖరుకు ఎట్టి పరిస్థితుల్లో పూర్తి చేయాలన్నారు. వుడా పార్కు ఆవరణలో స్కేట్ బోర్డు పనులు సకాలంలో పూర్తి చేయాలన్నారు. ఎల్ఆర్ఎస్‌కు సంబంధించి ఇప్పటి వరకు వచ్చిన దరఖాస్తుల పరిశీలన వేగవంతం చేయాలని ప్రణాళిక విభాగం అధికారులకు సూచించారు. వీటి కోసం దరఖాస్తు చేసేందుకు జనవరి 23 వరకు గడువు పొడిగించినందున కొనుగోలుదారులు సద్వినియోగం చేసుకునేలా విస్తృతంగా ప్రచారం చేయాలన్నారు. సమావేశంలో జాయింట్ కమిషనర్ రమేశ్, చీఫ్ అర్బన్ ప్లానర్ శిల్ప, ప్రధాన ఇంజనీర్ వినయ్‌కుమార్, పర్యవేక్షణ ఇంజనీర్లు భవానీశంకర్, మధుసూదనరావు తదితరులు పాల్గొన్నారు.

తుపాను బాధితులకు పరిహారం అందజేత


తుఫాను బాధితులకు పరిహారం చెక్కులు అందిస్తున్న ఎమ్మెల్యే వెలగపూడి

ఎంవీపీ కాలనీ, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి) : కూటమి ప్రభుత్వం పేద ప్రజలకు ఎప్పుడూ అండగా ఉంటుందని ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు అన్నారు. జీవీఎంసీ 15, 18 వార్డుల పరిధిలోని తుఫాను బాధితులకు ప్రభుత్వం తరఫున ప్రకటించిన పరిహారాన్ని ఎమ్మెల్యే గురువారం అందజేశారు. మొంథా తుపాను పరిస్థితిని ముందుగానే గుర్తించి, తగిన ఆదేశాలు జారీ చేసిన ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అభినందనీయులు అన్నారు. అలాగే అధికారులు కూడా నిరంతరం శ్రమించడం వల్ల ఎక్కడా ప్రాణాపాయం లేకుండా బయటపడ్డామన్నారు. బాధితులకు పునరావాస కేంద్రాల్లో ఆహారం పంపిణీ, ఇతర అవసరాలను సక్రమంగా అందించినట్టు తెలిపారు. ఈ సందర్భంగా 13 బాధిత కుటుంబాలకు పరిహారాన్ని అందించారు. కార్యక్రమంలో కార్పొరేటరు అప్పారి శ్రీవిద్య, గొలగాని పోలారావు, బుగత సత్యనారాయణ, మల్ల రవి తదితరులు పాల్గొన్నారు.

అదానీ కంపెనీల్లో ఎల్ఐసీ పెట్టుబడులా?

» గాంధీ విగ్రహం ఎదుట సీపీఐ ఆందోళన



ఆందోళన నిర్వహిస్తున్న సీపీఐ నేతలు

సిరిపురం, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి) : ఎల్ఐసీ సంస్థ నిధులను అదానీ కంపెనీల్లో పెట్టుబడి పెట్టడాన్ని వ్యతిరేకిస్తూ సీపీఐ జిల్లా సమితి ఆధ్వర్యంలో గురువారం జీవీఎంసీ విగ్రహం వద్ద ధర్నా నిర్వహించారు. జిల్లా సహాయ కార్యదర్శి పి.చంద్రశేఖర్ మాట్లాడుతూ ప్రభుత్వరంగ సంస్థల ఆస్తులను కార్పొరేట్, ప్రైవేటు వ్యక్తులకు కట్టబెట్టేందుకు ప్రధాన నరేంద్ర మోదీ ప్రభుత్వం కుట్రలు చేస్తోందని విమర్శించారు. జీవిత బీమా సంస్థ నిధులను ఆదానీ కంపెనీకు మళ్లించటం దుర్మార్గమైన చర్య అన్నారు. ఆదాని కంపెనీల్లో నిధులు మళ్లిస్తున్న తీరుపై అనేక అనుమానాలు ఉన్నాయని, దీనిపై సంయుక్త పార్లమెంటరీ కమిటీతో విచారణ చేపట్టాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ రంగ ఆస్తులను పరిరక్షించుకునేందుకు ప్రజానీకం ఉద్యమాలకు సిద్ధం కావాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. కలిసి వచ్చే సంఘాలతో భవిష్యత్తులో పెద్ద ఎత్తున పోరాటాలు చేసేందుకు కార్యాచరణ సిద్ధం చేస్తున్నట్టు చెప్పారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు సత్యాంజనేయ, మన్మథరావు, శ్రీనివాసరావు, క్షేత్రపాలరెడ్డి, పడాల గోవింద్, ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు వై.రాంబాబు, నాగరాజు, మహిళా సమాఖ్య జిల్లా అధ్యక్షురాలు వనజాక్షి తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి గీతంలో రేడియాలజిస్టుల కాన్ఫరెన్స్


సదస్సు బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న వైద్యులు

విశాఖపట్నం, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 31 నుంచి నవంబరు 2వ తేదీ వరకు రేడియాలజిస్టుల 11వ వార్షిక కాన్ఫరెన్స్‌ను గీతం వర్సిటీలో నిర్వహిస్తున్నట్టు ఇండియన్ రేడియోలాజికల్ అండ్ ఇమేజింగ్ అసోసియేషన్ ఏపీ స్టేట్ చాప్టర్ ప్రెసిడెంట్ డాక్టర్ వి.సురేష్ పేర్కొన్నారు.జగదాంబలోని డాల్ఫిన్ డయాగ్నోస్టిక్స్‌లో గురువారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో వివరాలను వెల్లడించారు. గీతం మెడికల్ కళాశాలలో నిర్వహిస్తున్న ఈ మెడికల్ కాన్ఫరెన్స్‌కు రాష్ట్రంలోని అనేక ప్రాంతాల నుంచి 700 మంది రేడియాలజిస్టులు, పీజీ విద్యార్థులు హాజరవుతారన్నారు. దేశంలో అనేక ప్రాంతాల నుంచి మరో 30 మంది నిపుణులు వస్తారన్నారు. తొలి రోజు ఫీటల్ రేడియాలజీపై ప్రత్యేక వర్క్‌షాప్ నిర్వహిస్తామన్నారు. రాష్ట్రంలో తొలిసారిగా సిమిలేషన్ పద్ధతిలో భ్రూణదశలోని శిశువులపై ఇమేజింగ్ ఆధారిత ఇంటర్‌వెన్షన్ విధానాన్ని ప్రదర్శించనున్నట్టు తెలిపారు. ఇప్పటివరకు స్కానింగ్ చేసి గర్భంలో ఉన్న శిశువుకు ఉన్న ఇబ్బందులను మాత్రమే గుర్తిస్తున్నామని, నూతన విధానంలో గుర్తించిన అనారోగ్య సమస్యలకు వైద్య సేవలు అందించే అవకాశం ఉందన్నారు. సదస్సుకు ముఖ్య అతిథులుగా ఎంపీలు శ్రీభరత్, డాక్టర్ బైరె డ్డి శబరి హాజరుకానున్నారని తెలిపారు. కేజీహెచ్ రేడియాలజీ విభాగాధిపతి డాక్టర్ బుజ్జిబాబు మాట్లాడుతూ తొలి రోజు నిపుణుల ప్రసంగాలు, శాస్త్రీయ పత్రాల ప్రదర్శన ఉంటుందన్నారు. ఉత్తమ పరిశోధన పత్రాలను ఎంపిక చేసి ప్రశంస పత్రాలు, పురస్కారాలు అందిస్తామన్నారు. కార్యక్రమంలో అపోలో చీఫ్ రేడియాలజిస్టు డాక్టర్ వర్మ, కేజీహెచ్ రేడియాలజీ విభాగం ప్రొఫెసర్ డాక్టర్ ఉమామహేశ్వరరావు, గీతం రేడియాలజీ విభాగం ప్రొఫెసర్ డాక్టర్ రఘు పాల్గొన్నారు.

గోతులమయంగా రహదారులు



సర్వీసు రోడ్డులోని గుంతల్లో చేరిన వర్షం నీరు

మురళీనగర్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి) : తుపాను ప్రభావంతో కురిసిన భారీ వర్షాలకు రోడ్లు జలమయం అయ్యాయి. గురువారం సాయంత్రానికి వర్షాలు తగ్గినప్పటికీ రహదారులపై వర్షం నీరు ప్రవహిస్తూనే ఉంది. దీంతో రహదారుల పై నుంచి ప్రయాణం ఇబ్బందిగా మారిందని స్థానికులు, వాహనదారులు వాపోతున్నారు. ఉత్తర నియోజకవర్గంలోని జాతీయ రహదారి ఆర్ అండ్ బీ జంక్షన్‌లో ఇప్పటికే భూగర్భ విద్యుత్ కేబుళ్ల అమరిక పనుల కోసం చేపట్టిన తవ్వకాలతో ఉన్న రోడ్లు వారం రోజులుగా వీడని వానలతో బురదమయంగా మారాయి. ఇటీవలే మరమ్మతులు చేసిన హైవే సర్వీసు రోడ్డు మళ్లీ రాళ్లు, పిక్కలతో గోతులతమయంగా మారింది. ఆర్ అండ్ బీ ఆఫీస్ ఎదుటే వాన నీరు నిత్యం నిలిచి ఉంటోంది. బిర్లా జంక్షన్ పాస్‌పోర్టు ఆఫీసు ఎదుట ఎగువ కొండ ప్రాంతం నుంచి చేరిన నీటితో హైవే సర్వీసు రహదారి పూర్తిగా దెబ్బతింది. ఎగువ మాధవధార, ఎన్జీజీవోస్ కాలనీ 48ఎ బస్ రూట్ జంక్షన్లలో రోడ్లపై ఏర్పడ్డ గోతులు ప్రయాణలకు ఇబ్బందిగా పరిణమిస్తున్నాయి.

1న రాజ్యాంగ పరిరక్షణ సదస్సు



సదస్సు పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ప్రభాకర్

సీతంపేట, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి) : భారత రాజ్యాంగం ప్రమాదంలో పడిందని, దాన్ని రక్షించుకోవాల్సిన కర్తవ్యం అన్ని వర్గాలపై ఉందని దళిత హక్కుల పోరాట సమితి (డీహెచ్‌పీఎస్) రాష్ట్ర అధ్యక్షుడు జేవీ ప్రభాకర్ అన్నారు. రామాటాకీస్ రోడ్డులోగల అంబేడ్కర్ భవన్‌లో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాజ్యాంగం, దళిత హక్కులు, కేంద్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలపై నవంబరు 1న నగరంలోని ద్వారకానగర్‌లో గల పౌరగ్రంథాలయంలో రాజ్యాంగ పరిరక్షణ సదస్సును నిర్వహించనున్నట్టు తెలిపారు.

మొంథా దెబ్బకు కళ తప్పిన బుద్ధుడి పార్కు

» అసంపూర్తి పనులతో ఆహ్లాదం కరువు » తాజాగా తుపాను ప్రభావంతో నేలకొరిగిన చెట్లు, వంగిన విద్యుత్ స్తంభాలు

అక్కయ్యపాలెం, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి) : మొంథా తుపాను ధాటికి నాలుగు లేన్ల జాతీయ రహదారికి ఆనుకుని ఉన్న గ్రీన్‌బెల్ట్ బుద్ధుడి పార్కు అధ్వానంగా తయారైంది. ఈ పార్కును లక్షలాది రూపాయలతో నిర్మాణం చేస్తున్నారు. అయితే, అందులోని చెట్లు, మొక్కలు ఎండిపోయి విరిగిపోయాయి. విద్యుత్ స్తంభం ఒంగిపోయింది. ఉద్యానవన శాఖ అధికారులు, విద్యుత్తు శాఖ సిబ్బంది పట్టించుకోకపోవడంపై స్థానికులు మండిపడుతున్నారు. ఈ పార్కులో మొక్కలు వేయడానికి ఒప్పందంతో కాంట్రాక్టుకు ఇచ్చారు. వాళ్లు వేసిన మొక్కలు ఎండిపోయినా పట్టించుకోకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని పలువురు అంటున్నారు. అంతేకాకుండా ఈ పార్కు నిర్మాణం పూర్తి కాలేదు. ఉదయం, సాయంత్రం ఈ పార్కులో సేద తీరేందుకు వస్తున్న వారికి విరిగిపోయిన చెట్లు, అధ్వానంగా ఉన్న పార్కు కనిపిస్తోంది. దీంతో అక్కడ ఆహ్లాదం కరువై వారు అసంతృప్తితో వెనక్కి తిరిగి వెళ్ళిపోతున్నారు. తాజాగా.. మొంథా తుఫాన్ కారణంగా వీచిన ఈదురు గాలులు, వర్షాల వల్ల పార్కులోని మరి కొన్ని చెట్లు కూలి విద్యుత్ స్తంభం మరింతగా ఒరిగింది. అలాగే అందులో ఉన్న మొక్కలు కూడా పూర్తిగా నాశనమయ్యాయి. అధికారులు స్పందించి అధ్వానంగా ఉన్న పార్కులో మొక్కలు వేసి చెత్తను తొలగించాలని స్థానికులు కోరుతున్నారు. పార్కు సుందరీకరణకు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.



తుపాను ధాటికి వంగిపోయిన పార్కులోని మొక్కలు, విద్యుత్ స్తంభం

జోగారావునగర్‌లో కూలిన ఇల్లు

» పరామర్శించిన టీడీపీ నేతలు »పరిహారం ఇప్పిస్తామని బాధితులకు భరోసా

కంచరపాలెం, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి) :తుపాను ప్రభావంలో కురిసిన భారీ వరాలు, ఈదురు గాలులకు జీవీఎంసీ 55 వార్డు పరిధి జోగారావునగర్‌లో ఓ రేకుల ఇల్లు కూలిపోయింది. జోగారావునగర్‌లో బత్తిన అకుల్ రేకుల షెడ్డుతో కుటుంబ సభ్యులతో నివాసం ఉంటున్నారు. నాలుగు రోజుల నుంచి ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షాలకు గోడలు నానిపోయి గురువారం ఉదయం ఇల్లు ఉన్నపళంగా కూలిపోయింది. ఘటనా సమయంలో ఇంట్లో ఎవరూ లేకపోవడంతో ఎటువంటి ప్రమాదం చోటుచేసుకోలేదు. ఇల్లు కూలిపోవడంతో బాధిత కుటుంబ సభ్యులు నిరాశ్రయులయ్యారు. సమాచారం తెలుసుకున్న టీడీపీ వార్డు అధ్యక్షుడు బండి రంజిత్ కమిటీ సభ్యులతో కలిసి ఇంటిని పరిశీలించి బాధితులకు భరోసా ఇచ్చారు. వీఆర్వోకు సమాచారం అందించి జరిగిన నష్టాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానన్నారు. అలాగే బాధిత కుటుంబ సభ్యులను క్లస్టర్ ఇన్‌చార్జి ఈతలపాక సుజాత పరామర్శించి భోజనాలను అందించారు. కార్యక్రమంలో ఎస్.అప్పారావు, రమణ అప్పారావు, యమున, వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.



బాధితులను పరామర్శిస్తున్న టీడీపీ 55వ వార్డు అధ్యక్షుడు రంజిత్

తుపాను బాధితులకు పరిహారం అందజేత



బాధితులకు నగదు అందజేస్తున్న ఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజు, పాల్గొన్న జీవీఎంసీ డెప్యూటీ మేయర్ సతీష్ తదితరులు

సీతమ్మధార, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ 46వ వార్డులో మొంథా తుపాను బాధితులను గుర్తించి పునరావాస కేంద్రాలకు తరలించడంతో పాటు రాష్ట్ర ప్రభుత్వ ప్రకటించిన ప్రతి కుటుంబానికి రూ.3 వేలతో పాటు నిత్యావసర సరుకులను బాలయ్యశాస్త్రి లే అవుట్‌లో గల బీజేపీ ఉత్తర నియోజకవర్గం కార్యాలయంలో ఎమ్మెల్యే పి.విష్ణుకుమార్ రాజు, జీవీఎంసీ డెప్యూటీ మేయర్ కట్టుమూరు సతీష్ అందజేశారు. తుపాను కష్టకాలంలో రాజకీయాలను పక్కన పెట్టి పార్టీలు బాధితులకు సహాయం చేయడం అభినందనీయమని ఎమ్మెల్యే విష్ణుకుమార్ రాజు అన్నారు. కార్యక్రమంలో టీడీపీ ప్రధాన కార్యదర్శి నజీర్, జిల్లా ఉపాధ్యక్షుడు సురేష్‌బాబు, తదితరులు పాల్గొన్నారు.

పాలిథిన్ బ్యాగులు వినియోగిస్తే చర్యలు తప్పదు

సీతమ్మధార, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి) : పరిశుభ్రత పాటించకుండా, ప్లాస్టిక్ గ్లాసులను మద్యం దుకాణం ఆవరణలో ఉండడంతో సీతమ్మధారలో క్రిసెంట్ టవర్స్‌లో గల గాయత్రి వైన్స్ దుకాణానికి 24వ వార్డు శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఎస్వీ వెంకటేశ్వరరావు రూ.5 వేలు జరిమానాను గురువారం విధించారు. జీవీఎంసీ కమిషనర్, జోనల్ కమిషనర్ శివప్రసాద్ ఆదేశాలతో వార్డులో పాలిథిన్ సంచులు వినియోగిస్తున్న వారిపై, అలాగే శుభ్రత పాటించకుండా ప్లాస్టిక్ వాడుతున్న వారిపై చర్యలు తీసుకోవడంతో పాటు అవగాహన కార్యక్రమాన్ని చేపట్టారు. వార్డు శానటరీ ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వరరావు, సచివాలయం సిబ్బంది, శానిటరీ సూపర్‌వైజర్ కోట రమణలు వార్డులో పాలు ప్రాంతాల్లో దుకాణాలను తనిఖీ చేసి, వారికి అవగాహన కల్పించి ప్లాస్టిక్ సంచులు వాడుతున్న వారికి జరిమానా విధించారు.



అవగాహన కల్పిస్తున్న శానటరీ ఇన్‌స్పెక్టర్

23వ వార్డులో..

పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని పాలిథిన్ బ్యాగులను వినియోగించ కూడదని, వాడితే జరిమానాలు తప్పదని గ్రేటర్ విశాఖ 23వ వార్డు శానిటరీ ఇన్‌స్పెక్టర్‌సత్యనారాయణ స్పష్టం చేశారు. వార్డులోని సీతమ్మధార, మద్దిలపాలెం, చైతన్యనగర్ తదితర ప్రాంతాల్లో దుకాణాలను తనిఖీలు నిర్వహించి పాలిథిన్ బ్యాగులు వినియోగించవద్దని సూచించారు. కార్యక్రమంలో జీవీఎంసీ సిబ్బంది పాల్గొన్నారు.

భాగస్వామ్య సదస్సుకు సిద్ధమవుతున్న వేదిక



ఏయూ ఇంజనీరింగ్ మైదానంలో భాగస్వామ్య సదస్సుకు ఏర్పాట్లు

విశాఖపట్నం, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి) : కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ఈ ఏడాది నవంబరు 14,15 తేదీల్లో ఆంధ్రవిశ్వవిద్యాలయం ఇంజనీరింగ్ కళాశాల మైదానంలో నిర్వహించనున్న భాగస్వామ్య సదస్సుకు ఏర్పాట్లు ముమ్మరంగా జరుగుతున్నాయి. జర్మన్ హేంగర్స్‌తో భారీ సమావేశమందిరం, మరో రెండు హాళ్లు, ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, కేంద్ర వాణిజ్యశాఖామంత్రి పీయూష్‌గోయల్‌కు వేర్వేరుగా రెండు చాంబర్లు నిర్మిస్తున్నారు. పలు కంపెనీలు, ప్రభుత్వ శాఖలు స్టాల్స్ ఏర్పాటు చేస్తున్నాయి. తుఫాన్‌ల కాలం కావడంతో వర్షం, గాలులు తట్టుకునేలా ప్రధాన వేదిక, సమావేశ మందిరం, ఇతర హాళ్లు నిర్మిస్తున్నారు. తుఫాన్ ప్రభావంతో నాలుగు రోజులుగా నిలిచిపోయిన పనులు గురువారం ప్రారంభమయ్యాయి. ప్రతి హాల్లో ప్రతినిధులకు సౌకర్యవంతంగా ఉండేలా సీటింగ్, బారికేడ్లు, వాష్‌రూమ్స్, పార్కింగ్ ఏరియా, వీవీఐపీ గ్యాలరీలు, లాంజ్‌లు నిర్మిస్తున్నారు.

సింహాద్రినాథుడికి స్వర్ణ పుష్పార్చన

సింహాచలం, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి) :సింహాద్రినాథునికి అర్జిత సేవల్లో భాగంగా స్వర్ణ పుష్పార్చన గురువారం వైభవం గా నిర్వహించారు. వేకువజామున సుప్రభాతసేవతో స్వామివారిని మేల్కొలిపి ప్రభాతారాధనలు పూర్తిచేశారు.ఉత్సవమూర్తి గోవింద రాజస్వామి, ఉభయ దేవేరులను స్వర్ణాభరణాలు, పుష్పమాలికలతో శోభాయమానంగా అలంకరించి వేదికపై అధిష్టింపజేశారు. ఆలయ పద్మనిధి నుంచి స్వర్ణ పుష్పాలు తీసి భక్తులతో స్పృశింపజేసి బేడా మండపంలో ప్రదక్షిణ చేశారు. విశ్వక్సేనారాదన, పుణ్యాహవచనములు చేసి షోడశోపచారాలు సమర్పించారు. అనంతరం నారసింహ అష్టోత్తర శతనామార్చన పఠిస్తూ స్వర్ణ పుష్పాలతో అర్చన చేశారు. మంత్రపుష్పం, కర్పూర నీరాజనాలిచ్చిన తరువాత భక్తులకు వేదాశీర్వచనాలు, ప్రసాదాలు అందజేశారు.



స్వామికి పూజ చేస్తున్న అర్చకుడు

గుర్తు తెలియని వాహనం ఢీకొని వృద్ధుడికి గాయాలు

ఎంవీపీ కాలనీ, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి) : టీటీడీ కల్యాణ మండపం ఎదురుగా గుర్తు తెలియని ద్విచక్ర వాహనం ఢీకొనడంతో నడుచుకుంటూ వెళుతున్న వృద్ధుడు గాయపడ్డారు. ఈ నెల 27న ఉదయం పది గంటల సమయంలో దలిపర్తి సూర్యనారాయణ(75) నడచుకుంటూ వెళ్తుండగా. వెనుక నుంచి వేగంగా వచ్చిన మోటారు సైకిల్ ఢీ కొనడంతో సూర్యనారాయణకు నడుము విరిగిపోయింది. మోటార్ సైక్లిస్ పరారీ అయ్యాడు. దీనిపై ఎంవీపీ పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

డీసీపీ-1గా జగదీశ్

... 5వ పేజీ తరువాయి

ఉత్తర్వులు జారీచేశారు. 2020 ఐపీఎస్ బ్యాచ్‌కు చెందిన జగదీశ్ ప్రస్తుతం అల్లూరి సీతారామరాజు జిల్లా అడిషనల్ ఎస్పీ(ఆపరేషన్స్)గా విధులు నిర్వర్తిస్తున్నారు. డీసీపీ-1గా పనిచేసిన అజితా వేజెండ్లకు గత నెలలో బదిలీ కావడంతో ఆ పోస్టు ఖాళీ అయిన విషయం తెలిసిందే. డీసీపీ-2 మేరీప్రశాంతి ప్రస్తుతం డీసీపీ-1గా ఇన్‌చార్జి బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు.

స్టార్ హోటళ్లతో పోలీస్ శాఖ ఎంఓయూ

... 5వ పేజీ తరువాయి

ఖర్చుపెట్టాలని సీపీ నిర్ణయించారు. దీనికి సంబంధించిన పనులకు డీజీపీ అదేరోజు ప్రారంభించనున్నారు. అలాగే నగర పోలీస్ కమిషనరేట్ పరిధిలోని వివిధ కేసుల్లో సీజ్ చేసిన పది వేల కిలోలకుపైగా గంజాయిని కాపులుప్పాడలోని డంపింగ్‌యార్డులో డీజీపీ, జిల్లా అధికారుల సమక్షంలో అదేరోజు దహనం చేయనున్నారు. ఈ కార్యక్రమాలు పూర్తయిన తర్వాత వచ్చే నెల 14,15 తేదీల్లో నగరంలో జరిగే పెట్టుబడుల సదస్సుకు సంబంధించిన బందోబస్తు ఏర్పాట్లపై పోలీస్ ఉన్నతాధికారులతో డీజీపీ సమీక్ష నిర్వహించనున్నారు.

జడ్పీకి రూ.4.37 కోట్ల నష్టం

... 5వ పేజీ తరువాయి

పునరావాస కేంద్రాల్లో తలదాచుకున్న 177 కుటుంబాలకు చెందిన 497 మందికి తాత్కాలిక సాయం కింద రూ.4.06 లక్షలు ఆయా తహశీల్దార్ల ఖాతాలకు జమ చేశారు. సీతమ్మధార తహశీల్దార్ కార్యాలయం పరిధిలో గురువారం కొంతమందికి సాయం అందించారు. వీరితోపాటు 13 వేల మంది మత్స్యకారులకు నిత్యావసర సరుకులు కొనుగోలుకు రూ.6.58 లక్షలు మార్కెటింగ్ శాఖ అధికారులకు బదలాయించారు. సరుకులు కొనుగోలు చేసిన అధికారులు వాటిని కిలోల వంతున ప్యాకింగ్ చేసే పనిలో ఉన్నారు. బహుశా శుక్రవారం లేదాశనివారం బియ్యంతో పాటు నిత్యావసర సరుకులు పంపిణీ చేస్తారు.

ఎస్.కోటపై తర్జనభర్జన

... 5వ పేజీ తరువాయి

అనకాపల్లి డివిజన్‌లో ఉన్నాయి. దీంతో పాలనాపరంగా ఇబ్బందులు ఎదురవుతున్నాయి. జిల్లాల పునర్విభజన సమయంలో పెందుర్తి నియోజకవర్గం మొత్తాన్ని అనకాపల్లి జిల్లా పరిధిలో చేర్చాలనే ప్రతిపాదనపై వ్యతిరేకత వచ్చింది. దీంతో మధ్యేమార్గంగా పెందుర్తి మండలాన్ని విశాఖ జిల్లాలో కొనసాగించి, సబ్బవరం, పరవాడ మండలాలను అనకాపల్లి జిల్లాలో కలిపారు. కాగా అసెంబ్లీ నియోజకవర్గం మొత్తం ఒకే రెవెన్యూ డివిజన్‌లో ఉండాలని ప్రభుత్వం తాజాగా నిర్ణయం తీసుకుంది. ఈ నేపథ్యంలో పరవాడ, సబ్బవరం మండలాలను విశాఖ డివిజన్‌లో చేర్చుతారా?, లేక పెందుర్తి మండలాన్ని కూడా అనకాపల్లి విలీనం చేస్తారా?...అనేది చూడాలి. ఈ రెండింటిలో ఏ నిర్ణయం తీసుకున్నా పెందుర్తి నియోజకవర్గం మొత్తం ఒకే జిల్లా పరిధిలోకి వస్తుంది.

జీవీఎంసీలో కొత్త జోన్‌లకు సిబ్బంది

... 5వ పేజీ తరువాయి

రెండు జోన్‌లుగా విభజించడంతో పెందుర్తి జోన్ కార్యాలయంగా ప్రస్తుతం ఉన్న జోన్-8 (వేపగుంట) కార్యాలయాన్ని వినియోగిస్తారు. కొత్తగా 'అగనంపూడి జోన్' ఏర్పాటుచేయనున్నారు. అగనంపూడి లేదా దువ్వాడలో ఏదైనా ప్రైవేటు భవనంలో కార్యాలయం ఏర్పాటుచేయాలని అధికారులు భావిస్తున్నారు. కొత్తగా ఏర్పడిన ఉత్తర, అగనంపూడి జోన్‌లకు యూసీడీ ఏపీడీ, ఏఎంహెచ్‌ఓ, సూపరింటెండెంట్‌లు, సీనియర్ అసిస్టెంట్లు, జూనియర్ అసిస్టెంట్లు, శానిటర్ ఇన్‌స్పెక్టర్లు, సూపర్‌వైజర్లు, మజ్దూర్‌లు, రికార్డు అసిస్టెంట్లు, కంప్యూటర్ ఆపరేటర్లను కేటాయిస్తూ కమిషనర్ గురువారం ఉత్తర్వులు జారీచేశారు. ఉత్తర్వులను సంబంధిత ఉద్యోగులకు గురువారం సీ సెక్షన్ సిబ్బంది స్వయంగా చేరవేశారు. దీనిని బట్టి త్వరలోనే కొత్తజోన్‌ల కార్యకలాపాలు ప్రారంభమవుతాయని అధికారులు అభిప్రాయపడుతున్నారు.



కలెక్టర్‌కు ఆహ్వానం పలుకుతున్న ఆలయ అధికారులు

మార్గశిర మాసోత్సవాలకు ఆహ్వానం

మహారాణిపేట, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి) : వచ్చే నెల 21వ తేదీ నుంచి వన్‌టౌన్ బురుజుపేటలోని కనకమహాలక్ష్మి ఆలయంలో మార్గశిర మాసోత్సవాలు ప్రారంభం కానున్నాయి. ఈ సందర్భంగా నవంబరు ఒకటో తేదీన ఉత్సవాలకు అంకురార్పణగా రాట వేయనున్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొనాలని కలెక్టర్ ఎంఎన్ హరేంధిరప్రసాద్, దక్షిణ ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్‌లను గురువారం దేవస్థానం అధికారులు ఆహ్వానించారు.

వ్యాపార అభివృద్ధిపై అవగాహన



సదస్సుకు హాజరైన మహిళా పారిశ్రామికవేత్తలు

మహారాణిపేట, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి) : మహిళా పారిశ్రామికవేత్తలు వ్యాపార, వాణిజ్య రంగంలో అభివృద్ధి సాధించాలని విశాఖపట్నం ఛాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ మహిళా విభాగం చైర్‌పర్సన్ సంధ్యా గోడే అన్నారు. వన్‌టౌన్‌లో వైజాగ్ పటం ఛాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ మహిళా విభాగం ఆధ్వర్యంలో ఇన్‌స్పైర్ ఫర్ హేర్ పేరిట మహిళా పారిశ్రామికవేత్తలకు వ్యాపార, వాణిజ్య అంశాలపై గురువారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళలు వ్యాపారం రంగంలో రాణించి, పది మందికి ఉపాధి చూపించాలన్నారు. ఈ రంగంలో అనేక అవకాశాలు ఉన్నాయని, వాటిని సద్వినియోగం చేసుకోవాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో మధురా దాస్ గుప్తా, నవ్యాన వేలీ నందా, తదితరులు పాల్గొన్నారు.

9 మంది పేకాటరాయుళ్లపై కేసు నమోదు

కూర్మన్నపాలెం, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): పేకాట ఆడుతున్న వారిపై దాడి చేసి పోలీసులు కేసు నమోదు చేశారు. 88వ వార్డు మంగళపాలెం తోటలో పేకాట ఆడుతున్నారన్న సమాచారంతో దువ్వాడ పోలీసులు దాడి చేశారు. 9 మందిని అదుపులోకి తీసుకొని, వారి నుంచి రూ.95వేల నగదు, 9 మొబైల్ ఫోన్లును స్వాధీనం చేసుకున్నారు.

సింహాద్రినాథునికి వైభవంగా స్వర్ణ పుష్పార్చన

సింహాచలం, అక్టోబరు 30 (ఆంధ్ర జ్యోతి) : సింహాద్రినాథునికి అర్జిత సేవల్లో భాగంగా స్వర్ణ పుష్పార్చన గురువారం వైభవంగా నిర్వహించారు. వేకువజామున సుప్రభాతసేవతో స్వామివారిని మేల్కొలిపి ప్రభాతారాధనలు పూర్తిచేశారు. ఉత్సవమూర్తి గోవిందరాజస్వామి, ఉభయ దేవేరులను స్వర్ణాభరణాలు, పుష్పమాలికలతో శోభాయమానంగా అలంకరించి వేదికపై అధిష్టింపజేశారు.ఆలయ పద్మనిధి నుంచి స్వర్ణ పుష్పాలు తీసి భక్తులతో స్పృశింపజేసి బేడా మండపంలో ప్రదక్షిణ చేశారు. అనంతరం నారసింహ అష్టోత్తర శతనామార్చన పఠిస్తూ స్వర్ణ పుష్పాలతో అర్చన చేశారు.

ఈ రోడ్లపై ప్రయాణం నరకం

» అధ్వానంగా డాబాగార్డెన్స్ రహదారులు
» ఎక్కడికక్కడే గోతులు » పట్టించుకోని అధికారులు

డాబాగార్డెన్స్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ 31వ వార్డు డాబాగార్డెన్స్‌లో పలు రహదారులు గోతులతో అధ్వానంగా ఉన్నాయి. వీటిపై రాకపోకలు సాగించాలంటే ప్రజలు, వాహనదారులు భయపడుతున్నారు. ముఖ్యంగా డాబాగార్డెన్స్ జంక్షన్ నుంచి ప్రకాశరావుపేటకు వెళ్లే మార్గంలో సుధా నర్సింగ్ హోమ్, డ్వాక్రా బజార్ మీదుగా వెళ్లే రహదారి రాళ్లు తేలి దారుణంగా ఉంది.గత మూడు రోజులుగా కురిసిన వర్షాలకు ఆయా రోడ్లు మరింత ఛిద్రంగా తయారయ్యాయి.అలాగే లలితాకాలనీ నుంచి అల్లూరి విజ్ఞాన కేంద్రం రోడ్డు, మాజీ ఎమ్మెల్యే తైనాల విజయకుమార్ నివాసం నుంచి ఉన్న రోడ్డు ఎక్కడికక్కడే గోతులతో నిండిపోయాయి. నిత్యం ఈ మా ర్గంలో వేలాది మంది వాహనదారులు, పాదచారులు రాకపోకలు సాగిస్తుంటారు. కానీ అధికారులు ఈ రోడ్ల మరమ్మతుపై దృష్టిసారించడం లేదు. ఇటీవల రాత్రి వేళ సుధా నర్సింగ్ రోడ్డులో తరుచూ ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. పల్లపు ప్రాంతం కావడంతో వాహనదారులు వేగంగా వచ్చి గోతుల్లో పడి ప్రమాదాల బారిన పడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి రోడ్ల మరమ్మతుకు చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.



సుధా నర్సింగ్ హోమ్ డౌన్‌లో గోతులు

డివైడర్లకు గ్రిల్స్ ఏర్పాటు



ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద డివైడర్లకు ఏర్పాటు చేసిన గ్రిల్స్

డాబాగార్డెన్స్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ 31వ వార్డు పరిధిలోని డాబాగార్డెన్స్ అంబేడ్కర్ సర్కిల్ నుంచి ఆర్టీసీ కాంప్లెక్స్ బస్టాప్ వరకు డివైడర్లకు గ్రిల్స్ ఏర్పాటు చేస్తున్నారు. అంబేడ్కర్ సర్కిల్ నుంచి ఎల్ఐసీ బిల్డింగ్ మీదుగా కాంప్లెక్స్‌కు వెళ్లే రహదారి మధ్యలో డివైడర్ల మధ్య గతంలో గ్రిల్స్ ఉండేవి కావు. డివైడర్ ఉన్నప్పటికీ వాటిని పాదచారులు అటు, ఇటు ఎక్కేస్తూ ప్రమాదాలకు గురయ్యేవారు. విద్యార్థులు అయితే సాయంత్రం వేళ బస్సుల కోసం ఆతృతతో ఎన్నో సందర్భాల్లో ఇక్కడ పడిపోయి గాయాలపాలైన సంఘటనలు కూడా ఉన్నాయి. ఈ నేపథ్యంలో గత కొన్ని రోజులుగా డివైడర్ల పనులు చురుగ్గా సాగడంతో పాటు మధ్యలో గ్రిల్స్ ఏర్పాటు చేస్తుండడంతో ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ఇచ్చిన డబ్బులు అడిగినందుకు దాడి

కంచరపాలెం, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి) : ఇంటి తాళాలు పగులగొట్టి బలవంతంగా చొరబడి నివాసితులను బయటకు తోసేసి దౌర్జన్యానికి పాల్పడిన వ్యక్తులపై కంచరపాలెం పోలీసులు గురువారం కేసు నమోదు చేశారు. సీఐ కె.రవికుమార్ తెలిపిన వివరాలు ప్రకారం.. కంచరపాలెం జాతీయ రహదారి ఊర్వశి జంక్షన్ సమీపంలో ఉన్న కామాక్షినగర్‌లో ఎర్రా పుష్ప కుటుంబ సభ్యులతో కలిసి నివాసం ఉంటున్నారు. పుష్ప తండ్రి సుబ్రహ్మణ్యం పోర్టులో రిటైరయ్యాక వచ్చిన డబ్బులు రూ. 2.5 లక్షలతో 1997లో ఇల్లు గాని స్థలం గాని కొనుగోలు చేయాలని ప్రయత్నించారు. పుష్ప పిన్ని త్రివేణి కొనడం ఎందుకని చెప్పి ఆ డబ్బులు తీసుకొని తన ఇంట్లో కొంతభాగాన్ని పుష్ప కుటుంబ సభ్యులు ఉండడానికి ఇచ్చింది. తరువాత తాము సొంతంగా ఇల్లు కొనుక్కుంటామని చెప్పి పుష్ప ఎన్నిసార్లు త్రివేణికి ఆ డబ్బులు అడిగినా ఇవ్వలేదు.

ఈమేరకు ఇటీవల త్రివేణి తన ఇంటి పోర్షన్ ఖాళీ చేయమని పుష్పపై ఒత్తిడి చేసింది. త్రివేణి బంధువు మీనా, కుమార్తె నిర్మల, కుమారుడు పవన్, మరి కొంతమందితో కలిసి పుష్ప ఇంటి తాళాలు పగులగొట్టి సామాన్లు చిందర వందర చేసి భయభ్రాంతులకు గురిచేశారు. బాధితురాలు పుష్ప ఫిర్యాదు మేరకు సీఐ రవికుమార్ ఆధ్వర్యంలో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



నేలకొరిగిన సరుగుడు తోటలు

గాలులకు ధ్వంసమైన సరుగుడు తోటలు

విశాఖపట్నం, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): తుఫాన్ ప్రభావంతో వీచిన గాలులకు ఆనందపురం మండలంలోని రామవరంలో 80 ఎకరాల విస్తీర్ణంలో సరుగుడు తోటలు దెబ్బతిన్నాయి. రెండు మూడు నెలల్లో కోతకు సిద్ధంగా ఉన్న తోటలు గాలుల ధాటికి విరిగిపోయి నేలకొరిగాయి. 80 ఎకరాల్లో సగానికిపైగా చెట్లు విరిగిపోవడంతో రైతులు ఆవేదన వ్యక్తంచేశారు. విరిగిపోయిన చెట్లు తక్కువ ధరకు విక్రయించాల్సి వస్తోందని వాపోయారు. సగటున ఎకరాకు రూ. 25 వేల వరకు నష్టం వాటిల్లిందన్నారు.గాలులకు నేలకొరిగిన తోటలను పరిశీలించాలని ఉద్యానశాఖాధికారులను కోరారు.

అప్పన్న సన్నిధిలో నటుడు ప్రవీణ్‌కుమార్



సింహాచలం, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి) : టాలీవుడ్ నటుడు ప్రవీణ్‌కుమార్ అప్పన్న స్వామిని గురువారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ 2008లో సినీ రంగ ప్రవేశం చేసిన తాను ఇప్పటివరకు ప్రేమ కథా చిత్రం, శంభోశివశంభో, రామ రామ కృష్ణ కృష్ణ, మిరపకాయ్ తదితర సినిమాల్లో నటించానని చెప్పారు.



అన్న క్యాంటీన్ వద్ద కూలిన చెట్టును పరిశీలిస్తున్న పశ్చిమ ఎమ్మెల్యే గణబాబు

కూలిన చెట్ల తొలగింపు

గోపాలపట్నం, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): తుఫాన్ ప్రభావంతో గోపాలపట్నం స్థానిక ఉడాకాలనీ, అన్న క్యాంటీన్ పరిసర ప్రాంతాల్లో కొన్ని చెట్లు విరిగిపడ్డాయి. ఈ మేరకు కూలిన చెట్లను తొలగింపు చర్యలను జీవీఎంసీ సిబ్బంది గురువారం చేపట్టారు.

2న వైద్య శిబిరం

ఉక్కుటౌన్‌షిప్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): సత్యసాయి జన్మదినోత్సవాలను పురస్కరించుకుని నవంబరు 2వ తేదీన మదీనాబాగ్‌లో ఉచితంగా కంటి, గుండె వైద్య శిబిరం నిర్వహించనున్నామని సత్యసాయి సమితి ప్రతినిధులు తెలిపారు. స్టీల్ డాక్టర్ ట్రస్టు, ఉక్కునగరం సమితి ఆధ్వర్యంలో వైద్య శిబిరం నిర్వహిస్తున్నామని తెలిపారు.

శ్మశానవాటికలో పనుల పరిశీలన

మల్కాపురం, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): మల్కాపురం శ్మశానవాటికలో జరుగుతున్న అభివృద్ధి పనులను జీవీఎంసీ జీవీఎంసీ జోన్ 5 ఈఈ ప్రసన్న గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పనులను త్వరగా పూర్తి చేయాలని సూచించారు. పనులలో నాణత్య పాటించాలని అన్నారు. అలాగే ఇక్కడ పనులు జరుగుతున్న తీరును స్థానిక పబ్లిక్ వర్క్స్ ఏఈ ఈఈకి వివరించారు. ఈ పర్యాటనలో జీవీఎంసీ జోన్ 5 అధికారులు పాల్గొన్నారు.

'విశాఖ ఇంజనీరింగ్' విద్యార్థులకు ఉద్యోగాలు


కొలువులకు ఎంపికైన విద్యార్థులతో అధ్యాపకులు

గోపాలపట్నం, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): స్థానిక విశాఖ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ కళాశాల(అటానమస్) విద్యార్థులు క్యాంపస్ ఇంటర్వ్యూల్లో ప్రతిభను కనబరిచారు. కళాశాలలో కెర్నెక్స్ సంస్థ ఇటీవల నిర్వహించిన ఇంటర్వ్యూల్లో పాలిటెక్నిక్ కళాశాలకు చెందిన 19 మంది విద్యార్థులు కొలువులు సాధించారు. ఈ మేర కొలువులు పొందిన విద్యార్థులను కళాశాల చైర్మెన్ జి.సత్యనారాయణ, అధ్యాపకులు అభినందనలు తెలిపారు.

వరద బాధితులకు భోజనాల పంపిణీ

పెందుర్తి, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): వరద బాధితులకు వైసీపీ రూరల్ జిల్లా మాజీ అధ్యక్షుడు శరగడం, చినఅప్పలనాయుడు గురువారం భోజనాన్ని పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఏకలవ్య కాలనీ వాసులు, జేఎన్ఎన్ఎమ్ఆర్‌యూఎం కాలనీ వాసులు ఈ భోజన ప్యాకెట్లను అందుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వరద బాధితులను అన్ని విధాలుగా ఆదుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో వైసీపీ నాయకుడు గొర్లె రామునాయుడు పాల్గొన్నారు.

సినిమా గైడ్

- **బైసన్** : శారదా,
- **తమ్మా** : రమాదేవి
- **డూడ్** : శరత్, శ్రీరామా, లీలామహల్, శ్రీకన్య, ఎస్.వి.సి.లిఖిత (శ్రీహరిపురం), లక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), నరసింహ (గోపాలపట్నం), శ్రీకన్య (గాజువాక)
- **క్రాంప్** : సంగం, కామేశ్వరి, వెంకటేశ్వర-1, ఊర్వశి (కంచరపాలెం), మౌర్య (గోపాలపట్నం),
- **ఓజీ**: కిన్నెర, కామేశ్వరి, శ్రీకన్య హెవెన్-3, మినీ మోహిని (గాజువాక), శ్రీకాంతి, సుకన్య,
- **మిరాయి**: సౌజన్య (గోపాలపట్నం), నటరాజ్-1 (పెందుర్తి), కన్య (గాజువాక), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం)

రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 22, టమాటా 30, వంకాయలు (తెలుపు) 40, వంకాయలు (నలుపు) 44, బెండకాయలు 54, పచ్చిమిర్చి 40, కాకరకాయలు 36, బీరకాయలు 46, ఆనపకాయ 2, కాలీఫ్లవర్ 40, క్యాబేజి 24, క్యారెట్54, దొండకాయలు 42, బంగాళదుంపలు 20, అరటికాయ (పె)8, మునక్కాడలు (కిలో) 70, అల్లం (పాతది)70, బరబాటి 48, ముల్లంగి 30, నిమ్మకాయలు (కిలో) 50 ,బద్దచిక్కుడు 66, దోసకాయలు 34, వెల్లుల్లి (పెద్దవి)65, కొబ్బరికాయ (పెద్దది) 40, బీన్స్(పెన్సిల్)70, కీరదోస 22, కాప్సికమ్ 66, పొట్లకాయ(పెద్దది) 24, చేమదుంపలు 34, చిలగడదుంపలు 30, కంద 52, గోరుచిక్కుడు 42, కూరపెం డలం 36, బ్రకోలీ 45, పనసపొట్టు 200, కొండఉసిరి 64, కరివేపాకు (కిలో) 50, కొత్తిమీర (పెద్దకట్ట) 20, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 4, పాలకూర (కట్ట) 4, తోటకూర (కట్ట) 4, మామిడికాయలు 60, బూడిద గుమ్మడి కాయ 20, కర్రపెండలం 22, మామిడి అల్లం 90, బొప్పాయి 32, జామకాయలు (కిలో) 70.

కోడిగుడ్లు (నెక్) (వంద - రూ.లలో)	
విశాఖపట్నం	570
విజయనగరం	574
శ్రీకాకుళం	574

చికెన్ ధరలు	
బ్యాగ్	
రైతు ధర	110
లైవ్ ధర	130
విత్ స్కిన్	230
స్కిన్‌లెస్	240


గాజువాక: దుర్గానగర్ జంక్షన్ వద్ద ఏర్పడిన భారీ గుంత


కూర్మన్నపాలెం: కాపు జగ్గరాజుపేట ప్రధాన రహదారిలో ఏర్పడ్డ గొయ్యి

ఈ రహదారుల్లో ప్రయాణమంటే హడల్

- జగ్గు జంక్షన్ నుంచి స్టీల్‌ప్లాంటుకు వెళ్లాలంటే నిత్యం నరకమే
- వీధి దీపాలు లేకపోవడంతో రాత్రి సమయంలో మరిన్ని ఇబ్బందులు పడుతున్నాం: వాహనదారులు

గాజువాక, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): జగ్గు జంక్షన్ నుంచి స్టీల్‌ప్లాంట్‌కు వెళ్లే రహదారిలో దుర్గానగర్ జంక్షన్‌లో ఏర్పడ్డ భారీ గుంత వాహనదారుల్లో హడలు పుట్టిస్తోంది. ఈ రోడ్డులో స్టీల్‌ప్లాంట్ ఉద్యోగులతో పాటు పరిసర ప్రాంతాల్లో కంపెనీల్లో పనిచేసే కార్మికుల రాకపోకలతో నిత్యం రద్దీగా ఉంటోంది. ఈ క్రమంలో దుర్గానగర్ జంక్షన్ వద్ద గుంత ఏర్పడడంతో రాకపోకలకు తీవ్ర ఇబ్బందిగా మారింది. వర్షాకాలంలో ఈ గొయ్యి వర్షం నీటితో నిండిపోవడంతో వాహనదారులు ఏ మాత్రం ఆదమరిచినా గుంతలో పడుతున్నారు. దీంతో భారీ ప్రమాదాలు జరుగుతున్నాయి. రాత్రి వేళల్లో విద్యుత్ లైట్లు లేకపోవటంతో వాహనదారులు మరిన్ని ఇబ్బందులు పడుతున్నారు. ఈ మార్గంలో భారీ వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం కలుగుతుంది. ఈ రోడ్డు స్థలం కోర్టు వివాదంలో ఉండడం వల్ల అభివృద్ధి చేయలేమంటూ జీవీఎంసీ అధికారులు తెలిపారు. కొన్నేళ్లగా ఇదే పరిస్థితి ఉండడంతో వాహనదారలు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు తగు చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

మొంథా తీవ్రతకు మరింత ఛిద్రమైన రోడ్డు

పెదగంట్యాడ, (ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ కారణంగా మూడు రోజుల పాటు ఎడతెరిపి లేకుండా కురిసిన భారీ వర్షాలకు పెదగంట్యాడ ప్రాంతంలోని పలు రోడ్లు ఛిద్రమయ్యాయి. ప్రధానంగా పారిశ్రామిక వాడలోని ప్రధాన రహదారితో పాటు ఇంటర్నల్ రోడ్లు కూడా గోతులమయంగా మారాయి. రోడ్లమీదే వర్షం నీరు నిలిచి పోవడం, వాటినుంచి భారీ వాహనాలు రాకపోకలు సాగించడం వల్ల రోడ్లు పూర్తిగా పాడయ్యాయి. నిరంతరం వర్షం కురుస్తుండటంతో తారురోడ్డుకు, డ్రైనేజీకి మధ్య ఉన్న స్థలంలో మట్టి పూర్తిగా నానిపోయి వాటి మీద నుంచి భారీ వాహనాలు వెళ్లడంతో కొన్ని చోట్ల రోడ్డు కిందకు కుంగి పోయింది. ఆ రోడ్డు మీదే వాహనాల రాకపోకలు సాగించడంతో గుంతలు ఏర్పడ్డాయి. పారిశ్రామిక వాడ రోడ్ల పరిస్థితే ఇలా ఉంటే ఇక హౌసింగ్ బోర్డు కాలనీ నుంచి బీసీ రోడ్డు కలిసే రోడ్డు బురదమయంగా మారింది. దాని నుంచే వాహనాలు రాకపోకలు జరుగుతున్నాయి. మూడు రోజుల పాటు కురిసిన వర్షానికి కొత్త దిబ్బపాలెంలోని వీధి రోడ్లు ఎక్కువగా పాడయ్యాయి. తారు రోడ్డులోని పైలేయర్ లేచిపోయింది. దీంతో గంగవరం, పల్లిపాలెం, జాలరిపల్లి పాలెం కాలనీల వీధి రోడ్లు బాగా నాశనమయ్యాయి. పెదగంట్యాడ మహాత్మ గాంధీ జంక్షన్ నుంచి గంగవరం నిర్వాసిత కాలనీ వరకు ఉన్న ప్రధాన రహదారి కూడా అనేక చోట్ల గుంతలు పడింది.


గుంతలు పడిన పెదగంట్యాడ పారిశ్రామికవాడ రోడ్డు

రాకపోకలకు అవస్థలు

కూర్మన్నపాలెం, (ఆంధ్రజ్యోతి): మూడు రోజులుగా కురిసిన వర్షాలకు పలు రహదారులు మరింత దెబ్బతిన్నాయి. ఉడానగర్, కాపు జగ్గరాజు పేట, ఆటోనగర్, పకీరుతఖ్యా వెళే రోడ్డులు పూర్తిగా ఛిద్రమయ్యాయి. ప్రస్తుతం వర్షాలతో రోడ్ల రూపురేఖలు మారిపోయాయి. ఈ రహదారిలో పూర్తి స్థాయిలో రోడ్లు వేయక పోవడంతో వర్షాల కారణంగా పెద్ద గుంతలు ఏర్పడి పాదచారులు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఐదేళ్ల వైసీపీ పాలనలో కనీస మరమ్మతులు చేపట్టలేదని, ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం స్పందించి రహదారులకు మరమ్మతులు చేయించాలని వాహనదారులు, పాదచారులు, స్థానికులు కోరుతున్నారు.

59వ వార్డులో ఎమ్మెల్యే గణబాబు పర్యటన


శాంతిస్వరూప్ కాలనీలో పర్యటిస్తున్న పశ్చిమ ఎమ్మెల్యే పి.గణబాబు

మల్కాపురం, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ 59వ వార్డు శాంతి స్వరూప్ కాలనీలో ఉన్న రోడ్డు మొంథా తుఫాన్ కారణంగా కుంగి పోయిందని టీడీపీ స్థానిక నాయకులు రాష్ట్ర ప్రభుత్వ విప్, పశ్చిమ నియోజకవర్గం ఎమ్మెల్యే పి. గణబాబు దృష్టికి తీసుకువెళ్లారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గురువారం కాలనీలో సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొండ ప్రాంతాలలో రక్షణ గోడలు, రహదారుల నిర్మాణానికి వెంటనే చర్యలు తీసుకుంటామని తెలిపారు. ప్రభావిత ప్రాంతాలను గుర్తించి ముందగా రక్షణ గోడలు నిర్మించే విధంగా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. మొంథా తుఫాన్ వల్ల పశ్చిమ నియోజకవర్గంలో పెద్ద నష్టాలు ఏమీ జరగలేదని, ముందుగానే అధికారులను అప్రమత్తం చేయడం వల్ల ఎక్కడికక్కడ పునరావాస కేంద్రాలను ఏర్పాటు చేశామని తెలిపారు. మల్కాపురం పోలీస్ స్టేషన్ ఎదురుగా భారీగా నీరు నిలిచిపోయిన సమయంలో తగు నిర్ణయాలు తీసుకోవడం వల్ల పెద్ద ముప్పు తప్పిందని పేర్కొన్నారు. ప్రజలకు ఇబ్బంది లేకుండా చర్యలు చేపట్టడమే ప్రభుత్వ లక్ష్యమని అన్నారు. ఈ కార్యక్రమంలో జీవీఎంసీ జోన్-5 ఈఈ ప్రసన్న, పలువురు అధికారులు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

దువ్వాడలో రోడ్డుపై నిలుస్తున్న వాడకం నీరు


రోడ్డుపై నిలిచిపోయిన వాడకం నీరు

అగనంపూడి, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): అగనంపూడి ఆంజనేయస్వామి కూడలి నుంచి దువ్వాడ రైల్వే స్టేషన్‌కు వెళ్లే ప్రధాన రహదారిలో వాడకం నీరు నిలిచిపోయి అస్తవ్యస్తంగా తయారైంది. మొంథా తుఫాన్ కారణంగా కురిసిన భారీ వర్షాలు రహదారి పరిస్థితి మరింతగా మారింది. ఎనిమిదేళ్ల క్రితం టీడీపీ హయాంలో ఈ రహదారికి మరమ్మతులు చేపట్టి విస్తరించారు. ప్రస్తుతం ఉన్న రహదారి గోతులతో నిండిపోయింది. దీంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యమంగా తలారివాని పాలెం శశ్మాన వాటిక, లక్కరాజుపాలెం కూడలి వద్ద రహదారి పూర్తిగా దెబ్బతిన్నది. దీంతో నిత్యం రహదారిపై నీరు నిల్వ ఉంటోంది. దీంతో వాహనాల రాకపోకలతో రహదారి అధ్వానంగా తయారైంది. ఫార్మాసిటీ పునరావాస కాలనీలతో పాటు అగనంపూడి పరిసర ప్రాంత గ్రామాలకు చెందిన వారు దువ్వాడ రైల్వే స్టేషన్‌కు ఈ మార్గంలోనే వెళ్లాలి. రహదారి ఛిద్రంగా మారడంతో వాహనదారలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ రహదారిలో లైట్లు లేకపోవడంతో రాత్రి సమయంలో ప్రయాణించాలంటే భయంతో వెళ్లాల్సి వస్తోందని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. 'దువ్వాడ రైల్వే స్టేషన్‌కు వెళ్లే ప్రధాన రహదారిపై నిత్యం వాడకం నీరు నిల్వ ఉండిపోతోంది. దీంతో వాహనాల రాకపోకల వల్ల రహదారి పూర్తిగా దెబ్బతింది. దీని కారణంగా ఈ రహదారిలో ప్రయాణించాలంటే భయపడుతున్నాం' అని స్థానికులు తెలిపారు.

పెట్టుబడులు అడ్డుకునేందుకు వైసీపీ నీచ రాజకీయాలు

- టీడీపీ సమన్వయకర్త ప్రసాదుల శ్రీనివాస్


సమావేశంలో మాట్లాడుతున్న ప్రసాదుల శ్రీనివాస్

గాజువాక, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ స్థాయిలో విశాఖకు వస్తున్న పెట్టుబడులను అడ్డుకునేందుకు వైసీపీ నీచ రాజకీయాలు చేస్తోందని ఏపీఐఐసీ డైరెక్టర్, టీడీపీ సమన్వయకర్త ప్రసాదుల శ్రీనివాస్ అన్నారు. గాజువాక పార్టీ కార్యాలయంలో గురువారం విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. విశాఖను అంతర్జాతీయ స్థాయిలో నిలబెట్టేందుకు సీఎం చంద్రబాబు విశేష కృషి చేస్తున్నారని పేర్కొన్నారు. విశాఖ అభివృద్ధి జరగడం వైసీపీకి ఇష్టం లేదని ఆరోపించారు. అదే విధంగా అంబుజా సిమెంటు ఫ్యాక్టరీ విషయంలో ప్రజాభిప్రాయమే ఎమ్మెల్యే పల్లా అభిప్రాయమని అన్నారు. మొంథా తుఫాన్ విషయంలో అధికారులు, సిబ్బంది సమర్థవంతంగా విధులు నిర్వహించారని, అదే విధంగా పార్టీ కార్యకర్తలు సహాయ కార్యక్రమాల్లో పాల్గొనడం మంచి విషయమన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు పాల్గొన్నారు.

నేటి నుంచి గీతంలో రేడియాలజిస్టుల కాన్ఫరెన్స్


రేడియాలజీ సదస్సు బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న వైద్యులు

విశాఖపట్నం, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 31 నుంచి నవంబరు 2వ తేదీ వరకు రేడియాలజిస్టుల 11వ వార్షిక కాన్ఫరెన్స్ ను గీతం వర్సిటీలో నిర్వహిస్తున్నట్టు ఇండియన్ రేడియోలాజికల్ అండ్ ఇమేజింగ్ అసోసియేషన్ ఏపీ స్టేట్ చాప్టర్ ప్రెసిడెంట్ డాక్టర్ వి.సురేష్ పేర్కొన్నారు.జగదాంబలోని డాల్ఫిన్ డయాగ్నోస్టిక్స్‌లో గురువారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో వివరాలను వెల్లడించా రు. గీతం మెడికల్ కళాశాలలో నిర్వహిస్తున్న ఈ మెడికల్ కాన్ఫరెన్స్‌కు రాష్ట్రంలోని అనేక ప్రాంతాల నుంచి 700 మంది రేడియాలజిస్టు లు, పీజీ విద్యార్థులు హాజరవుతారన్నారు. దే శంలో అనేక ప్రాంతాల నుంచి మరో 30 మం ది నిపుణులు వస్తారన్నారు. తొలి రోజు ఫీటల్ రేడియాలజీపై ప్రత్యేక వర్క్‌షాప్ నిర్వహిస్తామన్నారు. రాష్ట్రంలో తొలిసారిగా సిమిలేషన్ పద్ధతిలో భ్రూణ దశలోని శిశువులపై ఇమేజిం గ్ ఆధారిత ఇంటర్‌వెన్షన్ విధానాన్ని ప్రదర్శించనున్నట్టు తెలిపారు. ఇప్పటి వరకు స్కానింగ్ చేసి గర్భంలో ఉన్న శిశువుకు ఉన్న ఇబ్బందులను మాత్రమే గుర్తిస్తున్నామని, నూతన విధానంలో గుర్తించిన అనా రోగ్య సమస్యలకు వైద్య సేవలు అందించే అవకాశం ఉందన్నారు. సదస్సుకు ముఖ్య అతిథులుగా ఎంపీలు శ్రీభరత్, డాక్టర్ బైరెడ్డి శబరి హాజరుకానున్నారని తెలిపారు. కేజీహెచ్ రేడియాలజీ విభాగాధిపతి డాక్టర్ బుజ్జిబాబు మాట్లాడుతూ తొలి రోజు నిపుణుల ప్రసంగాలు, శాస్త్రీయ పత్రాల ప్రదర్శన ఉంటుందన్నారు. ఉత్తమ పరిశోధన పత్రాలను ఎంపిక చేసి ప్రశంస పత్రాలు, పురస్కారాలు అందిస్తామన్నారు. కార్యక్రమంలో అపోలో చీఫ్ రేడియాలజిస్టు డాక్టర్ వర్మ, కేజీహెచ్ రేడియాలజీ విభాగం ప్రొఫెసర్ డాక్టర్ ఉమామహేశ్వర రావు, గీతం రేడియాలజీ విభాగం ప్రొఫెసర్ డాక్టర్ రఘు పాల్గొన్నారు.

జోనల్ కార్యాలయంలో పెచ్చులూడిన శ్లాబ్

గాజువాక, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): గాజువాక జోనల్ కార్యాలయం యూసీడీ విభాగంలో భవనం శ్లాబు పెచ్చులూడి పడ్డాయి. విధి నిర్వహణలో ఉన్న సిబ్బందిపై పడకపోవడంతో ఎవరికీ ఏం కాలేదు. భారీ వర్షాల కారణంగా ఇదే కార్యాలయంలోని పలు విభాగాల గదుల్లో వర్షపు నీరు కారుతోంది. 20 ఏళ్ల క్రితం నిర్మించిన భవనం కావడంతో శ్లాబ్ బలహీనపడి వర్షం నీరు కారుతూ పలు చోట్ల పెచ్చులూడుతోందని పలువురు సిబ్బంది పేర్కొన్నారు. ఇలాంటి సంఘటనలు ఎప్పటికప్పుడు జరుగుతుండడంతో ఉన్నతాధికారులు దృష్టి సారించి భవనానికి మరమ్మతులు చేపట్టాలని సిబ్బంది కోరుతున్నారు.

శబరిమలకు ప్రత్యేక రైళ్లు నడపాలని వినతి

కూర్మన్నపాలెం,అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): శబరిమలకు వెళ్లే భక్తులకు సౌకర్యం కోసం విశాఖ నుంచి కొల్లాంకు వెళ్లే 18567 సర్వీసును రెగ్యులర్‌గా నడపాలని, ప్రత్యేక రైళ్లు నడపాలని జెడ్‌ఆర్‌సీసీ సభ్యుడు కంచుమూర్తి ఈశ్వర్ వాల్తేరు డీఆర్‌ఎంకు, జీఎమ్‌కు, ఎంపీ శ్రీభరత్‌కు గురువారం వినతి పత్రాలు అందజేశారు. వినతిలో భాగంగా శబరిమలైలో జరిగే మండల దీక్షలు నుంచి సంక్రాంతి జ్యోతి దర్శనం వరకూ ఆంధ్రా నుంచి అధిక సంఖ్యలో అయ్యప్పస్వామి భక్తులు వెళుతుంటారని ఇప్పటికే పలు రైళ్లు నిండిపోవడంతో భక్తులు ఆందోళన వ్యక్తం చేస్తాన్నారని తెలిపారు. ఓ వైపు క్రిస్మస్, నూతన సంవత్సరం, సంక్రాంతి పండుగలకు పెద్ద ఎత్తున ప్రయాణికులు తరలి వెళుతుంటారని తెలిపారు. ఈ సందర్భంగా విశాఖ నుంచి కొల్లాం వెళ్లే వివేక్, గురుదేవ్ రైళ్లను రెండు నెలలు ముందుగా రిజర్వేషన్లు చేసుకోవడంతో ప్రయాణికుల రద్దీ, డిమాండ్‌ను బట్టి ప్రత్యేక రైళ్లను నడపాలని కోరారు. ఇప్పటికే ఏపీఎస్ ఆర్టీసీ విశాఖ నుంచి శబరిమలకు పలు రాయితీలు, ప్యాకేజీలతో బస్సులను నడుపుతున్నట్టు ప్రకటించారని తెలిపారు. ఉన్నతాధికారులు స్పందించి శబరిమలకు ప్రత్యేక రైళ్లను నడపాలని కోరారు.

స్వగ్రామానికి ఏకలవ్య కాలనీవాసులు

పెందుర్తి, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): పెందుర్తిలో ఉన్న తాండ్రపాపారాయుడు వెలమభవన్‌లో ఏర్పటు చేసిన పునరావాస కేంద్రంలో ఆశ్రయం పొందుతున్న ఏకలవ్యకాలనీ వాసులు గురువారం వారి సొంత గ్రామానికి చేరుకున్నారు. తుఫాను ప్రభావంతో కాలనీ ముంపునకు గురికావడంతో మంగళవారం అర్ధరాత్రి 52 మందిని పునరావాస కేంద్రానికి అధికారులు తరలించారు. తుఫాన్ తీరం దాటడడంతో ఏకలవ్య కాలనీ వాసులు వారి గ్రామానికి చేరుకున్నారు.

జగ్గయ్యపాలెంలో మందుల పంపిణీ

అక్కిరెడ్డిపాలెం, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ 69 వార్డులో లోతట్టు ప్రాంతమైన హరిజన జగ్గయ్యపాలెం కాలనీలో బాధితులకు రోగ నిరోధక మందులను టీడీపీ మహిళా విభాగం గురువారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత మూడు రోజుల్లో కురిసిన వర్షాలకు ముంపు ప్రాంతంలో ఉన్నవారికి ఆరోగ్య సమస్యలు రాకుండా మందులు పంపిణీ చేశామన్నారు. ఈ కార్యక్రమంలో కోరుకొండ పద్మ, ఎం శ్వేతాకుమారి, రాజీ, రాజేశ్వరి, తదితరులు పాల్గొన్నారు.

చురుగ్గా పైపులైన్ మరమ్మతులు


పైపులైన్ కవరింగ్ పనులు చేస్తున్న దృశ్యం

వేపగుంట, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): నాయుడుతోట బీఆర్‌టీఎస్ సర్వీస్ రోడ్డు, దుర్గానగర్ రోడ్డులో ఏడీబీ ప్రాజెక్టు పైపులైన్ పనులు చురుగ్గా సాగుతున్నాయి. ఈ ప్రాజెక్ట్ ద్వారా నగరంలో 24 గంటల మంచినీటి సరఫరాను కల్పించనున్నారు. ప్రస్తుతం ఈ పనులు తుది దశకు చేరుకున్నాయి. ఈ పనుల్లో భాగంగా బీఆర్‌టీఎస్ కల్వర్టు వద్ద ఏడీబీ పైపులైన్‌కు కవరింగ్ పనులు చేపడుతున్నారు. వీలైనంత త్వరగా ఈ పనులను పూర్తి చేసేందుకు చర్యలు చేపడుతున్నట్టు సంబంధిత అధికారులు తెలిపారు.


గాజువాకలో పర్యటిస్తున్న జీవీఎంసీ కమిషనర్ కేతన్‌గార్గ్

ప్రతి ఇంటి ముందు క్లాప్ వాహనాలు ఆగాలి

- జీవీఎంసీ కమిషనర్ కేతన్‌గార్గ్

గాజువాక, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): క్లాప్ వాహనాలు ప్రతి ఇంటి నుంచి తప్పనిసరిగా వ్యర్థాలను సేకరించాలని జీవీఎంసీ కమిషనర్ కేతన్‌గార్గ్ పేర్కొన్నారు. గాజువాక జోనల్ పరిధిలో 73,74,75,76వార్డుల్లోని సనత్‌నగర్, సమతానగర్, పెదగంట్యాడ, గంగవరం, బీసీ రోడ్డు, హెచ్‌బీ కాలనీ తదితర ప్రాంతాల్లో గురువారం పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్లాప్ వాహనాల ద్వారా మైక్ అనౌన్స్‌మెంట్ చేసి ప్రజలను అప్రమత్తం చేయాలని అన్నారు. ప్రతి ఇంటి నుంచి చెత్తను తప్పనిసరిగా సేకరించాలని, నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. క్లాప్ వాహనాల పనితీరుపై అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షణ ఉండాలన్నారు. ఈ సందర్భంగ ప్రధాన గెడ్డలను పరిశీలించి అధికారులకు, సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఆయన వెంట జోనల్ కమిషనర్ శేషాద్రి, ఏఎంహెచ్‌వో కిరణ్‌కుమార్, తదితరులు ఉన్నారు.

రైతులకు పూర్తి సహకారం అందిస్తాం

- పీఏసీఎస్ చైర్మన్ అయితి సింహాచలం


సమావేశంలో మాట్లాడుతున్న అయితి సింహాచలం

పెందుర్తి, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): దళారీ వ్యవస్థను నిర్మూలించి, ఉత్పత్తిదారులకు ప్రయోజనాలు పరిరక్షణ కల్పించి రైతులకు సహకారం అందజేస్తామని పీఏసీఎస్ చైర్మన్ అయితి సింహాచలం అన్నారు. పీఏసీఎస్ కార్యాలయంలో జిల్లా కో ఆపరేటివ్ మార్కెటింగ్ సొసైటీ (డీసీఎమ్ఎస్) ఆధ్వర్యంలో రైతు ప్రయోజన కార్యక్రమాలపై గురువారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పంటకాలంలో రైతులకు రుణాలు, ఎరువులు, యూరియా, క్రిమి సంహారక మందులను సహకార సంఘం నుంచి అందేలా కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేశామని తెలిపారు. ఈ క్రమంలో దళారీల ప్రమేయం లేకుండా మార్కెట్‌తో అనుసంధానించి పీఏసీఎస్ పర్యవేక్షణలో డీసీఎమ్ఎస్ అనుసంధానంతో రైతులకు మెరుగైన సేవలు అందేలా కృషి చేస్తామని తెలిపారు. రైతుల ఉత్పత్తులకు ప్రత్యక్ష మార్కెట్ సౌకర్యం కల్పించి మెరుగైన ధర లభించేలా చూస్తామన్నారు. ఉత్పత్తిదారుల బలోపేతానికి రైతులను ఏకతాటిపై నిలిచేలా పీఏసీఎస్ శ్రమిస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ అధికారులు పాల్గొన్నారు.

నిండుకుండల్లా చెరువులు


నీటితో కళకళలాడుతున్న పెందుర్తి చెరువు

పెందుర్తి, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ ప్రభావంతో ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షాలకు పెందుర్తిలో చురువులు నిండుకుండల్లా మారి చూపరులకు కనువిందు కలిగిస్తున్నాయి. పెందుర్తి మండలంలో సుమారు 105కి పైగా చెరువులున్నాయి. వీటిలో 90 శాతంపైగా చెరువులు నిండాయి. ముఖ్యంగా పెందుర్తి పాతూరు, సరిపల్లి, ముదపాక, పినగాడి, రాంపురం, ఎస్ఆర్‌పురం, రాజయ్యపేట, గొరపల్లి గ్రామాల్లో ఉన్న చెరువులు ఎగువ ప్రాంతం నుంచి వచ్చిన నీటితో సమృద్ధిగా ఉన్నాయి. ఈ సందర్భంగా పలువురు చెక్‌డ్యామ్‌ల వద్ద వలలు వేసి చేపలు పట్టేందుకు పోటీ పడుతున్నారు.

కార్మికులకు పూర్తి వేతనాలు చెల్లించరూ!

- ఇంటక్ చీఫ్ ప్యాట్రన్ మంత్రి రాజశేఖర్

ఉక్కుటౌన్‌షిప్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): ఉక్కు ఉద్యోగులకు బకాయిలతో కూడిన వేతనాన్ని చెల్లించాలని ఇంటక్ చీఫ్ ప్యాటన్ మంత్రి రాజశేఖర్ గురువారం ప్రకటనలో తెలిపారు. గతంలో ఎప్పుడూ లేని విధంగా జీతాల కోసం ఎదురు చూడాల్సిన పరిస్థితి ఏర్పడిందని, కార్మికుల జీతాల చెల్లింపులో యాజమాన్యం నిర్లక్ష్యం తగదని ప్రకటనతో పేర్కొన్నారు. ఏడాది తరువాత గత నెల 1వ తేదీన ఉద్యోగులు పూర్తి వేతనం అందుకున్నారని అన్నారు. ఇప్పుడు మాత్రం సకాలంలో బకాయిలతో కూడిన వేతనం చెల్లించాలని అన్నారు. సంస్థ ప్రగతి కోసం శ్రమిస్తున్న ఉద్యోగులకు ఆర్థిక ప్రయోజనాలు కల్పించాలని కోరారు.

శ్రీవారికి ప్రత్యేక పూజలు

వేపగుంట/ఎన్ఏడీ అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): నాయడుతోట రవినగర్ శేషాద్రి కొండపై కొలవైన కల్యాణ వెంకటేశ్వర స్వామి ఆలయంలో కార్తీకమాసం సందర్భంగా గురువారం శ్రవణా నక్షత్ర పూజలు నిర్వహించారు. ఈసందర్భంగా వేకువజామునే స్వామివారికి ప్రత్యేక అభిషేకాలు, పూజలు, అలంరణ చేశారు. మధ్యాహ్నం దాదాపు 500 మంది భక్తులకు అన్నసమారాధన నిర్వహించారు. ఈ అన్న సమారాధనకు నాయుడుతోటకు చెందిన రాజేశ్‌కుమార్, శ్రావణి దంపతులు ఆర్థిక సాయం చేశారు. వీరికి ఆలయ అర్చకుడు కల్యాణ వెంకటేశ్వరుని జ్ఞాపికను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు. అలాగే 90వ వార్డు ఎన్ఏడీ విమాన్‌నగర్‌లో కొలువైన వైకుంఠ వెంకటేశ్వర స్వామి ఆలయంలో శ్రవణా నక్షత్ర పూజలు వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారికి ప్రత్యేక అలంకరణ, పూజలు నిర్వహించారు. భక్తులకు ఎటువంటి ఇబ్బంది కలగకుండా ఆలయ కమిటీ సభ్యులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

వేంకటేశుడికి పవిత్రాల సమర్పణ

పెందుర్తి,(ఆంధ్రజ్యోతి):పెందుర్తిలో ఉన్న వెంకటాద్రి శిఖరంపై కొలువైన వెంకటేశ్వర స్వామి ఆలయంలో నిర్వహిస్తున్న పవిత్రోత్సవాల్లో భాగంగా గురువారం సుప్రభాత సేవ, దివ్యప్రబంధం, తిరువాయుమూజు, నిత్యహోమాలు నిర్వహించి స్వామివారికి పవిత్ర సమర్పణ చేశారు. శుక్రవారం పవిత్ర విసర్జనతో పవిత్రోత్సవాలు ముగుస్తాయని ఆయల ప్రధాన అర్చకుడు తెలిపారు.

పార్కుపై ప్రైవేటు పెత్తనం!

- జనం ప్రవేశించకుండా గేట్లకు తాళం
- రీడింగ్ రూమ్‌ను వ్యాపారానికి వాడుకుంటున్న వైనం
- ఫిర్యాదు చేసినా పట్టించుకోని జీవీఎంసీ అధికారులు

ఎంవీపీ కాలనీ, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): ప్రజల ఆహ్లాదం కోసం నిర్మించిన పార్కు గేట్లకు తాళాలు వేసినా, ఎమ్మెల్యే నిధులతో నిర్మించిన రీడింగ్ రూమ్‌ను ప్రైవేటు వ్యక్తులు సొంతానికి వాడుకుంటున్నా జీవీఎంసీ అధికారులు స్పందించడం లేదు.

గ్రేటర్ 19వ వార్డు ఎంవీపీకాలనీ పన్నెండో సెక్టార్ ఉషోదయకాలనీలో విశాలమైన పార్కు ఉంది. కానీ అందులోకి ఎవరూ వెళ్లేందుకు అవకాశం లేదు. ప్రధాన ద్వారం గేట్లకు నిత్యం తాళం వేసి ఉంటుంది. పేరుకే పార్కు. కానీ అందులో చెత్తా చెదారం పేరుకుపోయాయి. నిర్వహణ ఊసేలేదు. అందులోనే తూర్పు ఎమ్మెల్యే వెలగపూడి నిధులతో రీడింగ్ రూమ్ నిర్మించారు. కానీ అందులో అడుగుపెట్టడానికి కూడా అవకాశం లేదు. ప్రస్తుతం అది ప్రైవేటు ఆదీనంలో ఉంది.


ప్రవేశ మార్గం వద్ద గేటుకు తాళం


రీడింగ్‌రూమ్ వద్ద వంట సామగ్రి

ఉషోదయ కూడలి నుంచి బీచ్ రోడ్డుకు వెళ్లే దారిలో ఈ చోద్యం జరుగుతోంది.

శిథిలావస్థలో పార్కు

నగరాన్ని అందంగా తీర్చిదిద్దేందుకు జీవీఎంసీ రూ.కోట్లు వెచ్చిస్తోంది. ఉద్యానవనాలను అభివృద్ధి చేస్తోంది. కానీ ఇక్కడి పార్కును ఉద్దేశపూర్వకంగానే వదిలేశారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. పార్కులో నిర్వహణ పనులు చేపడుతున్న జాడ లేదు. చెత్తా చెదారంతో నిండి ఉంది. ప్రధాన ప్రవేశమార్గం గేట్లకు నిత్యం తాళం వేసి ఉంటోంది.

ప్రభుత్వ భవనంలో వ్యాపారం

కాగా ఇక్కడ జీవీఎంసీ నిర్మించిన రీడింగ్ రూమ్‌ను ఓ వ్యక్తి తన వ్యాపారానికి వినియోగించుకుంటున్నాడు. హోటల్, కేటరింగ్ పనులకోసం వాడుకుంటూ, సామగ్రి నిల్వ చేసుకుంటున్నాడు. అయితే ఈ తతంగమంతా జీవీఎంసీ ఉన్నతాధికారుల సహకారంతోనే జరుగుతోందని స్థానికులు ఆరోపిస్తున్నారు. దీనిపై అధికారులకు ఫిర్యాదు చేసినా కనీస స్పందన కనిపించడం లేదంటున్నారు.


పార్కులో పేరుకుపోయిన చెత్త



జీవీఎంసీ నిర్మించిన రీడింగ్ రూమ్

పలు ప్రాంతాలకు ప్రత్యేక రైళ్లు

విశాఖపట్నం, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): ప్రయాణికుల సౌకర్యార్థం వివిధ ప్రాంతాలకు ప్రత్యేక రైళ్లను ప్రవేశపెడుతున్నామని సీనియర్ డీసీఎం కె.పవన్‌కుమార్ తెలిపారు.

శ్రీకాకుళంరోడ్డు-బెంగళూరు

08553 నంబరు గల రైలు నవంబరు 21న మధ్యాహ్నం 3.30 గంటలకు శ్రీకాకుళం రోడ్డులో బయలుదేరి సాయంత్రం 5.25 గంటలకు విశాఖ, మరుసటిరోజు మధ్యాహ్నం 2.45 గంటలకు బెంగళూరు చేరుతుంది. తిరుగు ప్రయాణంలో నవంబరు 24న మధ్యాహ్నం 2 గంటలకు బెంగళూరులో బయలుదేరి మరుసటిరోజు మధ్యాహ్నం 2.30 గంటలకు విశాఖ, సాయంత్రం 5 గంటలకు శ్రీకాకుళం రోడ్డు చేరుతుంది.

అరకు-యలహంక-అరకు

08551 నంబరు గల రైలు నవంబరు 13, 23న మధ్యాహ్నం 12 గంటలకు అరకులో బయలుదేరి మధ్యాహ్నం 3.28 గంటలకు దువ్వాడ, మరుసటి రోజు ఉదయం 10.15 యలహంక చేరుతుంది. తిరుగు ప్రయాణంలో నవంబరు 14, 24న మధ్యాహ్నం 1.30 గంటలకు యలహంకలో బయలుదేరి మరుసటి రోజు ఉదయం 10 గంటలకు దువ్వాడ, మధ్యాహ్నం 2.30 గంటలకు అరకు చేరుతుంది. 08555 నంబరు గల రైలు నవంబరు 17, 24న మధ్యాహ్నం 12 గంటలకు అరకులో బయలుదేరి మధ్యాహ్నం 3.28 గంటలకు దువ్వాడ, మరుసటి రోజు ఉదయం 10.15 యలహంక చేరుతుంది. తిరుగు ప్రయాణంలో 18, 25న మధ్యాహ్నం 2 గంటలకు యలహంకలో బయలుదేరి మరుసటి రోజుఉదయం 10 గంటలకు దువ్వాడ, మధ్యా హ్నం 2.30గంటలకు అరకు చేరుతుంది.

భువనేశ్వర్-బెంగళూరు

08463 నంబరు గల రైలు నవంబరు 16న ఉదయం 6.15 గంటలకు భువనేశ్వర్‌లో బయలుదేరి మధ్యాహ్నం 3.28 గంటలకు దువ్వాడ, మరుసటి రోజు ఉదయం 11.55 గంటలకు బెంగళూరు చేరుతుంది. తిరుగు ప్రయాణంలో 20న ఉదయం 5.30 గంటలకు బెంగళూరులో బయలుదేరి మరుసటిరోజు తెల్లవారుజాము 2గంటలకు దువ్వాడ,ఉదయం 10.15 గంటలకు భువనేశ్వర్ చేరుతుంది.

షెడ్యూల్ ప్రకారం బస్సులు నడపాలి: ఆర్‌ఎం


స్టీల్ సిటీ డిపో డీఎం, ఇతర అధికారులతో మాట్లాడుతున్న ఆర్‌ఎం అప్పలనాయుడు

ద్వారకాబస్‌స్టేషన్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): తుపాన్ ప్రభావం తొలగిపోవడంతో శుక్రవారం నుంచి అన్ని బస్సులు షెడ్యూల్ మేరకు నడపాలని ఆర్టీసీ విశాఖ రీజనల్ మేనేజర్ బి.అప్పలనాయుడు డిపో మేనేజర్లను ఆదేశించారు. స్టీల్‌సిటీ, వాల్తేరు, మద్దిలపాలెం, విశాఖపట్నం డిపోలను గురువారం సందర్శించారు. బస్సులన్నీ నడిచేలా సిబ్బందిని సమాయత్తం చేయాలన్నారు.

ఐఆర్‌సీటీసీ ఎయిర్ ప్యాకేజీ

అక్కయ్యపాలెం, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): ఇండియన్ రైల్వే క్యాటరింగ్, టూరిజం కార్పొరేషన్ లిమిటెడ్ (ఐఆర్‌సీటీసీ) అండమాన్ దీవులకు ప్రత్యేక విమానం ప్యాకేజీని ప్రారంభించినట్టు సంస్థ టూరిజం ఎగ్జిక్యూటివ్ సంఘ మిత్ర రౌల్ తెలిపారు. ఈ ఏడాది నవంబరు 20 నుంచి 25 వరకు పోర్ట్ బ్లెయిర్,రాస్,నార్త్‌బేఐలాండ్, హావ్‌లాక్,నీల్ ఐలాండ్ ప్రాంతాలకు ప్యాకేజీ ఉంటుందన్నారు. టికెట్ ఒకరికి రూ. 67,165గా నిర్ణయించామన్నారు. రెండు టికెట్లుకొంటే ఒక్కొక్కరికి రూ.50,570 చొప్పున, మూడు టికెట్లు తీసుకుంటే ఒక్కొక్కరికి రూ.48,999గా నిర్ణయించామన్నారు. ఇండిగో ఎయిర్‌లైన్స్ ఎకానమీ క్లాస్ టికెట్టు, హోటల్ వసతి, అల్పాహారం, భోజనం ఉంటాయన్నారు. 9281030748, 9281495847, 9550166168 నంబర్లలోసంప్రతించాలన్నారు.

వెలవెలబోతున్న పర్యాటక ప్రాంతాలు

విశాలాక్షినగర్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి) : తుఫాన్ తీరం దాటినా పర్యాటక ప్రాంతాల్లోకి సందర్శకులను అనుమతించడం లేదు. భద్రతా కార ణాల దృష్ట్యా గురువారం కూడా కైలాసగిరి, తెన్నేటీ పార్కు, జోడుగుళ్లపాలెం తీరంతో పాటు సీతకొండ టర్నింగ్‌లోకి పర్యాటకులను అనుమతించలేదు. దీంతో ఇతర రాష్ట్రాల నుంచి వచ్చిన వారు నిరాశతో వెనుతిరిగారు.

చందన మోహనరావుకు ప్రముఖుల ఘన నివాళి

విశాఖపట్నం, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ వ్యాపారవేత్త చందన మోహనరావు చిత్రపటానికి పూలమాలలు వేసి పలువురు ప్రముఖులు నివాళులు అర్పించారు. సీఎంఆర్ వ్యవస్థాపకులైన మావూరి వెంకటరమణ మామయ్య చందన మోహనరావు ఈ నెల 20వ తేదీన పరమపదించిన సంగతి తెలిసిందే. ఈ మేరకు గురువారం దసపల్లా హోటల్‌లో పెద్ద కర్మ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి శాసనసభ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు, భీమిలి, ఉత్తర, పశ్చిమ, దక్షిణ, పెందుర్తి నియోజకవర్గ ఎమ్మెల్యేలు గంటా శ్రీనివాసరావు, విష్ణుకుమార్‌రాజు, గణబాబు, వంశీకృష్ణ శ్రీనివాస్, పంచకర్ల రమేశ్‌బాబు, మాజీ ఎమ్మెల్యేలు వాసుపల్లి గణేశ్‌కుమార్, తైనాల విజయకుమార్, మాజీ మేయర్ గొలగాని హరి వెంకటకుమారి, రాజ్యసభ మాజీ సభ్యుడు యార్లగడ్డ లక్ష్మీప్రసాద్ తదితరులు హాజరై సీఎంఆర్ చిత్రపటానికి పూలమాలలు వేశారు. ఆయన సేవలను, వ్యాపార దక్షతను గుర్తుచేసుకున్నారు. అతని పవిత్ర ఆత్మకు శాంతి కలగాలని కోరుతూ నివాళులు అర్పించారు.


చందన మోహనరావు చిత్ర పటం వద్ద నివాళులర్పిస్తున్న స్పీకర్ అయ్యన్నపాత్రుడు, ఎమ్మెల్యేలు గంటా, గణబాబు, వంశీకృష్ణ, పంచకర్ల, సీఎంఆర్ అధినేత మావూరి వెంకటరమణ తదితరులు

ఆత్మవిశ్వాసంతో ఉన్నత లక్ష్యాలు చేరాలి: ఎంపీ శ్రీభరత్

విశాఖపట్నం, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): మేనేజ్‌మెంట్ కోర్సు చదివే విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసం, సమయానుకూలంగా నిర్ణయాలు తీసుకునే చురుకుదనం ఉంటే ఉన్నత లక్ష్యాలను చేరుకుంటారని ఎంపీ ఎం.శ్రీభరత్ అన్నారు. గంభీరంలోని ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ (ఐఐఎం)ను గురువారం సందర్శించారు. ముందుగా అధ్యాపకులకు నూతనంగా నిర్మించిన గృహసముదాయాన్ని ప్రారంభించి, మొక్కలు నాటారు. ఈసందర్భంగా విద్యార్థులు, అధ్యాపకులనుద్దేశించి మాట్లాడుతూ విద్యార్థులు వృత్తిపరంగా నైతిక విలువలు, కొత్త అంశాలను తెలుసుకునేందుకు కృషి చేయాలన్నారు. విశాఖ అభివృద్ధికి అనేక అవకాశాలున్నాయని, నగరంలో పెరుగుతున్న ట్రాఫిక్, జనావాసాలు, జనాభాకు అనువుగా పచ్చదనం పెంచాల్సిన అవసరం ఉందన్నారు. ప్రస్తుత రాజకీయాలు, రియల్‌ఎస్టేట్, యువత తమ శక్తిని వినియోగించుకోవడం, కార్మిక చట్టాలు, పనితీరు ఆధారంగా వ్యవస్థలు అభివృద్ధి వంటి అంశాలపై విద్యార్థులు అడిగిన ప్రశ్నలకు సమాధానాలిచ్చారు. కార్యక్రమానికి ఐఐఎం డైరెక్టర్ చంద్రశేఖర్ అధ్యక్షత వహించి సంస్థ పనితీరును నివేదించారు. కార్యక్రమంలో పలు విభాగాల డీన్లు, ఆచార్యులు పాల్గొన్నారు.



విద్యార్థులనుద్దేశించి మాట్లాడుతున్న ఎంపీ శ్రీభరత్

వ్యక్తి మృతిపై కేసు నమోదు

పద్మనాభం, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): మద్యం సేవించి వర్షం నీటిలో పడి ఓ వ్యక్తి మృతి చెందిన ఘటనపై కేసు నమోదు చేసినట్టు పోలీసులు తెలిపారు. చిన్నాపురం గ్రామానికి చెందిన బొట్ట రమణ (57) ఈనెల 28న ఇంటి నుంచి వెళ్లిపోయాడు. మద్యం సేవించి రెండు, మూడు రోజులు ఇంటికి రాకపోవడం సాధారణమే కావడంతో కుటుంబసభ్యులు పట్టించుకోలేదు. కాగా ఈనెల గురువారం చిన్నాపురం సచివాలయం సమీపంలో మృతదేహాన్ని గుర్తించారు. మృతుడి భార్య రమణమ్మ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

బెట్టింగ్‌కు పాల్పడుతున్న ఇద్దరి అరెస్టు

ఎండాడ, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): నగరంలో ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ బెట్టింగ్ నిర్వహిస్తున్న ఇద్దరు నిందితులను సైబర్ క్రైం పోలీసులు అరెస్టు చేశారు. ఎక్స్చేంజ్ 666, బ్లాక్ డైమండ్.కామ్ యాప్‌ల ద్వారా క్రికెట్ బెట్టింగ్ నిర్వహిస్తున్నట్టు సమాచారం అందడంతో దాడులు చేశారు. బెట్టింగ్ ఆడేవారి కోసం లింక్‌లను పంపిస్తున్న అనకాపల్లి జిల్లా అచ్యుతాపురం మండలానికి చెందిన పెయ్యిల త్రినాథ్ (29), కశిరెడ్డి బాల సంజీవరావు(39) లను అరెస్టు చేసి వారి నుంచి బెట్టింగ్‌కు వినియోగిస్తున్న మొబైల్ ఫోన్‌లను స్వాధీనం చేసుకున్నారు.

తునిపాలెం గెడ్డలో బాలిక గల్లంతు

- ఎస్‌డీఆర్‌ఎఫ్, అగ్నిమాపక దళం ఆధ్వర్యంలో గాలింపు చర్యలు


గెడ్డలో గాలిస్తున్న ఎస్‌డీఆర్‌ఎఫ్ సభ్యులు. గల్లంతైన ధనుశ్రీ (ఫైల్ ఫొటో)

పద్మనాభం, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): ప్రమాదశాత్తు గెడ్డలో కాలుజారి పడిపోయిన బాలిక గల్లంతయింది. ఈ సంఘటన పద్మనాభం మండలం మద్ది పంచాయతీ తునిపాలెంలో గురువారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. గ్రామానికి చెందిన కాళ్ల శ్రీనివాసరావు, గౌరి దంపతుల కుమార్తె ధనుశ్రీ (12). తునిపాలెం-అనంతవరం రోడ్డులో ఉన్న గెడ్డపై ఉన్న కాజువే వద్దకు దుస్తులు ఉతకడానికి వెళ్లింది. ప్రమాదవశాత్తు కాలు జారి పడిపోయింది. ఇటీవల వర్షాలకు గెడ్డ ఉధృతంగా ప్రవహిస్తుండడంతో కొట్టుకుపోయింది. సానికులు గమనించి ఆమె తల్లి గౌరికి చెప్పడంతో ఆమె ఘటనా స్థలానికి చేరుకుంది. వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేయగా అగ్నిమాపక దళానికి సమాచారం అందించారు. వారు ఘటనా స్థలానికి చేరుకుని బాలిక కోసం గాలించారు. ఈలోగా ఎస్‌డీఆర్‌ఎఫ్ బృందం రంగంలోకి దిగి బోట్లతో గాలింపు చర్యలు చేపట్టారు. రాత్రి వరకు వెతికినా ఫలితం కనిపించకపోవడంతో శుక్రవారం మరోసారి గాలిస్తామన్నారు. భీమిలి ఆర్డీవో కె.సంగీత్‌మాథుర్,మండల ప్రత్యేకాధికారి కె.జ్ఞానవేణి పరిస్థితిని సమీక్షించారు. తహసీల్దారు కె.ఆనందరావు, ఎంపీడీవో కె.రూపేష్, సీఐ సీహెచ్ శ్రీధర్ పర్యవేక్షిస్తున్నారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేశారు.


గాలింపు చర్యలు పరిశీలిస్తున్న ఆర్డీవో సంగీత్ మాథుర్

వ్యక్తి ఆత్మహత్యా యత్నం

- చోటా నాయకుల దందాతో విరక్తి
- ఇంటి నిర్మాణాన్ని అడ్డుకుంటున్నారని విమర్శ
- ముగ్గురిపై కేసు నమోదు చేసిన పోలీసులు

కంచరపాలెం, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): ఇల్లు నిర్మించుకునేందుకు జీవీఎంసీ నుంచి అన్ని అనుమతులు పొందినా, స్థానిక చోటా నేతలు డబ్బులు డిమాండ్ చేసి, పనులు అడ్డుకుంటుండడంతో ఓ వ్యక్తి జీవితంపై విరక్తి చెంది ఆత్మహత్యకు యత్నించాడు. ఈ సంఘటన జీవీఎంసీ 48వ వార్డు రాంజీ ఎస్టేట్ ప్రాంతంలో జరిగింది. ఈ ప్రాంతానికి చెందిన కె.దుర్గాప్రసాద్ తన స్థలంలో ఇంటి నిర్మాణానికి జీవీఎంసీ నుంచి అనుమతి తీసుకున్నాడు. స్థానిక చోటా నాయకులు శంకరరావు, అరుణ్‌బాబు, నరసింహారావు దుర్గాప్రసాద్‌ను పిలిపించి ఇంటి నిర్మాణం పూర్తికావాలంటే తమకు రూ.2లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. తాను అంత డబ్బు ఇవ్వలేనని రూ.20వేలు ఇచ్చాడు. దీంతో వారు ఇంటి నిర్మాణానికి అడ్డుపడుతున్నారు. జీవీఎంసీ పీజీఆర్ఎస్‌లో పదే పదే ఫిర్యాదులు చేసి వేధిస్తున్నారు. ఈ నేపథ్యంలో దుర్గాప్రసాద్ ఆత్మహత్య చేసుకుంటున్నానంటూ సెల్ఫీ వీడియోను సామాజిక మాధ్యమంలో పోస్టు చేశాడు. ఇంట్లో ఫ్యాన్‌కు చున్నీతో ఉరి వేసుకోవడానికి ప్రయత్నించగా, కుటుంబసభ్యులు రక్షించారు. అనంతరం కంచరపాలెం పోలీసులకు ఫిర్యాదు చేయగా వారు ముగ్గు రు నిందితులపై కేసునమోదుచేసి, సీఐ కె.రవికుమార్ ఆధ్వర్యంలో దర్యాప్తు చేస్తున్నారు.

రైలు ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి మృతి

గోపాలపట్నం, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): రైలు ఢీ కొని గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందాడు. ఈ సంఘటన గోపాలపట్నం ఆర్ఆర్ఐ కేబిన్ సమీపంలో జరిగింది. రైల్వే పోలీసులు ట్రాక్‌పై మృతదేహాన్ని గుర్తించారు. ఆధారాలు లభించలేదు. మృతుడికి 35 ఏళ్ల వయసు ఉంటుంది. నీలంరంగు టీ షర్ట్, కాకీ రంగు షార్ట్ ధరించి ఉన్నాడు. మృతదేహాన్ని కేజీహెచ్ మార్చురీలో భద్రపరిచారు. వివరాలు తెలిస్తే రైల్వే పోలీసులను సంప్రతించాలన్నారు.


రైల్వే ట్రాక్‌పై మృతదేహం

రైల్వేస్టేషన్‌లో గుర్తు తెలియని మృతదేహం

విశాఖపట్నం, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): విశాఖ రైల్వేస్టేషన్ ప్లాట్‌ఫాం నంబరు 2,3 మధ్య గుర్తు తెలియని వ్యక్తి మృతదేహాన్ని ప్రయాణికులు గమనించారు. రైల్వే పోలీసులకు సమాచారం ఇవ్వడంతో వారు ప్రాథమిక విచారణ చేపట్టారు. మృతుడి వివరాలు తెలియరాలేదని, వయసు సుమారు 65 సంవత్సరాలుంటుందని, మృతదేహంపై నీలంరంగు స్వెటర్, తెలుపు బెడ్‌షీట్ ఉందన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

నిండు కుండలా వరాహ పుష్కరిణి

సింహాచలం, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ ప్రభావంతో కురిసిన భారీ వర్షాలకు వరాహలక్ష్మీ నృసింహస్వామి దేవస్థానానికి చెందిన వరాహ పుష్కరిణి నిండుకుండను తలపిస్తోంది. సింహగిరి కొండల నుంచి ఇప్పటికీ వరద నీరు వచ్చి చేరుతుండడంతో పుష్కరిణి జలకళను సంతరించుకుంది. కాగా వర్షాల కారణంగా ఎగువ నుంచి నీరు వచ్చే మా ర్గాలు బీఆర్‌టీఎస్ రోడ్డు నిర్మాణంతో మూ సుకున్నాయి. దీంతో నీరు ఇతర మార్గాల ద్వారా దిగువకు పోతోంది. ఇప్పటికైనా అధికారులు స్పదించాలని భక్తులు కోరుతున్నారు.


నీటితో నిండిపోయిన వరాహ పుష్కరిణి

5న వరాహ పుష్కరిణిలో జలహారతి

వచ్చే నెల ఐదో తేదీన సింహాచలంలోని వరాహ పుష్కరిణిలో జలహారతి కార్యక్రమం నిర్వహించనున్నట్టు కార్యనిర్వహణాధికారి సుజాత తెలిపారు. దేవదాయశాఖ కమిషనర్ ఉత్తర్వుల మేరకు కార్తీకమాస పౌర్ణమి సందర్భంగా జలహారతి ఇస్తామన్నారు. ఆరోజు సాయంత్రం 4.30గంటలకు కొండదిగువ పద్మావతి, అలిమేలుమంగా సమేత వేంకటేశ్వరస్వామి ఉత్సవమూర్తులను పల్లకిలో ఊరేగింపుగా పుష్కరిణికి తీసుకువస్తారు. పుష్కరిణి ఒడ్డున ప్రత్యేక వేదికపై ఉంచి పుష్కరిణి జలాలకు హారతులు సమర్పించనున్నారు. అదే సమయంలో మహిళా భక్తులు దీపారాధన చేస్తారని, అందుకు అవసరమైన ప్రమిదలు, ఒత్తులు, నూనె తదితరాలను దేవస్థానం సమకూరుస్తుందని ఈఓ వివరించారు.

సీఎం సహాయనిధికి గంటా రవితేజ విరాళం


మంత్రి లోకేశ్‌కు రూ.5 లక్షల చెక్కును అందిస్తున్న గంటా రవితేజ, తదితరులు

భీమునిపట్నం, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ నేపథ్యంలో ముఖ్యమంత్రి సహాయనిధికి భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు తనయుడు, టీడీపీ యువ నేత గంటా రవితేజ రూ.5 లక్షలు విరాళంగా అందించారు. ఈ మేరకు గురువారం ఉండవల్లిలో మానవ వనరుల శాఖా మంత్రి నారా లోకేశ్‌ను కలిసి చెక్కును అందజేశారు. మొంథా తుఫాన్ తీవ్ర ప్రభావం చూపిందని, బాధితులను ఆదుకోవడానికి తన వంతు బాధ్యతగా నియోజకవర్గంలోని పార్టీ యువకులతో కలిసి మంత్రిని కలిసి విరాళాన్ని అందించానన్నారు. అనంతరం గీత మకరందం ఆధ్యాత్మిక గ్రంథాన్ని మంత్రి లోకేశ్‌కు బహూకరించారు. నియోజకవర్గంలో పార్టీ కార్యకలాపాలపై మంత్రికి వివరించారు. కాగా రవితేజ తన పుట్టిన రోజు వేడుకలను రద్దుచేసుకుని మరీ తుఫాన్ బాధితులకు ఆర్థిక సహాయాన్ని అందించడానికి ఉండవల్లి వచ్చినట్టు తెలిసిన మంత్రి లోకేశ్ అతనికి జన్మదిన శుభాకాంక్షలు తెలిపి, అభినందించారు.

దేశ ఆర్థిక వ్యవస్థకు మత్స్య పరిశ్రమ కీలకం

- ఎంపెడా డైరెక్టర్ ఎం.కె.రామ్మోహన్

బీచ్ రోడ్డు, అక్టోబరు 30, (ఆంధ్రజ్యోతి): దేశ ఆర్థిక వ్యవస్థకు మత్స్య పరిశ్రమ కీలకంగా మారిందని ఎంపెడా డైరెక్టర్ ఎం.కె.రామ్మోహన్ పేర్కొన్నారు. గురువారం గ్రాండ్ బే హోటల్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. మత్స్య, పాడి పరిశ్రమలు అభివృద్ధి చేసేందుకు కేంద్ర ప్రభుత్వం మత్స్య, పశు సంవర్థక, పాడి పరిశ్రమ పేరిట ఎన్నో సంక్షేమ కార్యక్రమాలు అమలుచేసిందన్నారు. కేంద్ర మత్స్య శాఖ డీడీ నీలేష్‌కుమార్ మాట్లాడుతూ మత్స పరిశ్రమలో సవాళ్లు ఎక్కువన్నారు. వీటిని అధిగమించేందుకు శాస్త్రవేత్తలు ఆలోచనలను, అనుభవాలను పంచుకోవాలని సూచించారు. విశాఖ కేంద్రంగా సముద్ర ఉత్పత్తుల దిగుబడి పెంచేందుకు కూటమి ప్రభుత్వం శ్రీకారం చుట్టిందన్నారు. 2025- 2026లో కనీసం 30 శాతం వృద్ధి సాధించేలా నూతన పద్ధతులను అనుసరిస్తోందన్నారు. ఇందులో భాగంగా సముద్రంలో కృత్రిమ ఆవాసాలు ఏర్పాటు చేస్తున్నారన్నారు. మత్స్యకారులు చేపల వేటలో ఆధునిక పద్ధతులను అనుసరించాలన్నారు. చేపలతో వివి.ధ ఆహార పదార్థాల తయారీపై కేంద్ర మత్స్య సాంకేతిక సంస్థ శిక్షణ ఇస్తోందన్నారు. ప్రపంచంలో అత్య ధిక డిమాండ్ ఉన్న టోనా చేపలు మన దేశంలో లభిస్తున్నాయని, వాటిని వేటాడేందుకు శాటిలైట్ పరిజ్ఞానాన్ని వినియోగిస్తున్నామన్నారు. విలువల ఆధారిత మత్స్య ఉత్పత్తులు, ఎగుమతులు పెంచడానికి ఎగుమతిదారులు, ప్రాసెసింగ్ యూనిట్లు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో మత్స్యశాఖ జాయిం ట్ డైరెక్టర్ పి.లక్ష్మణరావు, భీమవరం, కాకినాడకు చెందిన ఎక్స్‌పోర్టు ప్రాసెసింగ్ యజమానులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న ఎంపెడా డైరెక్టర్ రామ్మోహన్